1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 5
సంచిక : 5
పుటలు : 52
రు. 20 లు
తెనాలి

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

నుడి నాడు నెనరు

జూలై 2019

జాతీయ విద్యావిధానం – భాషలు
కస్తూరి రంగన్ నివేదికపై చర్చ



తెలుగు రాష్ట్రాల్లో తెలుగు గతి ఏమికానుంది?

తానా గిడుగు రామమూర్తి స్మారక పురస్కారం 2019



గిడుగు రామమూర్తి (1863-1940) పేరు చెప్పగానే 20వ శతాబ్ది ప్రథమ పాదంలో వ్యావహారిక భాషావాదానికి ఉద్యమరూపం కల్పించి గ్రాంధిక భాషావాదులపై విజయం సాధించిన ఒక భాషాయోధునిగా ఆయన్ని అందరూ పరిగణిస్తారు. దీనికి మించి ఆయన గొప్ప భాషా శాస్త్రవేత్త, పరిశోధకుడు, గ్రంథ పరిష్కర్త, శాసన పరిష్కర్త, పాఠ్యగ్రంథ రచయిత. సవర భాషకు వ్యాకరణం రచించి, సవరల జీవిత చరిత్రను గ్రంథస్థం చేసినవాడు. సవరల అభివృద్ధికి కృషి చేసిన సంఘసేవకుడు. ప్రజాస్వామిక వాది, మానవతావాది.

జీవితకాలం తెలుగు భాషాభివృద్ధికి కృషి చేసిన గిడుగు రామమూర్తి పేరు మీద ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి రూ.50,000ల నగదుతో కూడిన పురస్కారాన్ని అందజేయాలని తానా నిర్ణయించింది. తెలుగు భాషా వికాసానికి, అభ్యున్నతికి విశేషంగా కృషి సల్పిన ప్రముఖులను ఈ పురస్కారంతో గౌరవించాలని తానా ఆశయం. ఈ పురస్కారాలు 2002 డిసెంబర్ నుంచి ప్రకటిస్తోంది తానా. గతంలో ఈ పురస్కారాలను ప్రొ॥చేకూరి రామారావు (2002), ప్రొ॥ భద్రిరాజు కృష్ణమూర్తి (2004), సి. ధర్మారావు (2006), ఎబికె ప్రసాద్ (2008), స.వెం. రమేశ్ (2010), ప్రొ॥పి.ఎస్. సుబ్రహ్మణ్యం (2012), ప్రొ॥రవ్వా శ్రీహరి (2014), డా॥ సామల రమేష్ బాబు (2016) లకు అందజేసింది.

వాషింగ్టన్ డి.సి.లో 2019 జులై 4, 5, 6 తేదీలలో 22 వ తానా మహాసభలు జరుగుతున్న సందర్భంగా ఈ పురస్కారాన్ని 2019 సంవత్సరానికి ప్రొ॥ గారపాటి ఉమామహేశ్వరరావుగారికి అందజేయాలని తానా కార్యవర్గం నిర్ణయించింది.

1952 నవంబర్ 30న జన్మించిన ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావుగారు బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం నుంచి బయాలజీలో ఎమ్మెస్సీ చేసి, అనంతరం భాషాశాస్త్రం వైపు మళ్లారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి భాషాశాస్త్రంలో డిగ్రీని, అనువర్తిత భాషాశాస్త్రం (Applied Linguistics) లో ఎం.ఎ. డిగ్రీని న్యూయార్క్‌లోని స్టోనీ బ్రూక్ యూనివర్సిటీ నుంచి పూర్తిచేశారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచే చారిత్రక భాషాశాస్త్రంలో పిహెచ్.డి. పొందారు. ప్రముఖ భాషాశాస్త్రవేత్తలు ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి, ఆచార్య చేకూరి రామారావుల వద్ద భాషాశాస్త్రంలో శిష్యరికం చేశారు. మంగోలియన్, టర్కిక్ భాషాకుటుంబాలకు మూలమైన ఉమ్మడి వనరును జన్య సంబంధమైన ప్రక్రియ ద్వారా పునర్నిర్మాణం చేయటంలో రెండు దశాబ్దాలు కృషి చేశారు. దాని ద్వారా తెలుగుభాష మూలాల పరిశోధనకి స్వీకారం చుట్టారు. భాషకు మానవీయ శాస్త్రాన్ని జోడించి, భాషాశాస్త్రానికి కొత్త కోణాన్ని అందించారు. అంతేకాక, తెలుగుభాషకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించటంలో ముఖ్యమైన పాత్ర పోషించారు. కంప్యూటర్ సైన్స్, చారిత్రక భాషాశాస్త్రం వంటి రంగాలలో కొత్త ఆవిష్కరణలకు తెర తీశారు. హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయంలో పనిచేస్తూ, అనువర్తిత భాషాశాస్త్రం, అనువాద అధ్యయనాల కేంద్రానికి నిర్దేశకులుగా ఉన్నారు. తెలుగుభాషను కంప్యూటరీకరించటంలో వీరి పాత్ర ప్రముఖమైనది. తెలుగుభాష వికాసానికి ఉపయోగపడే సాఫ్ట్ వేర్ ను అభివృద్ధి చేశారు.

ద్రావిడ మంగోల్ భాషల జన్యుసంబంధం, తెలుగు రాష్ట్రాలలో భాషాసంక్షోభం వంటి పుస్తకాలు రాయటం ద్వారా తెలుగుభాష నేడు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలకు పరిష్కారం చూపించటంలో అవిరామ కృషి చేస్తున్నారు. తెలుగు భాషా వికాసానికి కృషి చేస్తూ, తెలుగుభాషకు సాంకేతికతను జోడించే ప్రయత్నం చేస్తున్న శ్రీ గారపాటి ఉమా మహేశ్వరరావుగారికి గిడుగు రామమూర్తి స్మారక పురస్కారాన్ని అందజేస్తున్నందుకు తానా కార్యవర్గం సంతోషిస్తోంది. వీరికి అభినందనలు

సతీష్ వేమన
తానా అధ్యక్షులు

ఎనికెపాటి జనార్ధన్
తానా అభివృద్ధి కమిటి అధ్యక్షులు


◆ తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
◆ తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
◆ ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు 9848016136

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు,
డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్,
సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి



జూలై 2019

రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట –రచనను ఏ రూపంలో నైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి గాని వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్ చేసి editorammanudi@gmail.com కు పంపాలి. కొరియర్ / రిజిస్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ-మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

4. రచన స్వంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ పంపాలి. ముందుగా సోషల్ మీడియాలో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించ లేము.

వలగూడు (ఇంటర్నెట్)లో www.ammanudi.org చూడండి.

లోపలి పుటలలో....

మాతృభాషలు:	బడిలో మొదటి రెండేళ్ల విద్యార్థులకు...	రహ్మానుద్దీన్ షేక్	05
సంపాదక హృదయం:	రెండు తెలుగు రాష్ట్రాల్లో తెలుగు గతి ఏమికానున్నది?		07
జాతీయవిద్యావిధానం:	'ఉపాధి'సాకుతో ఉనికికే ఎసరు!	వెన్నెలకంటి రామారావు	09
జాతీయవిద్యావిధానం :	కస్తూరి రంగన్ సంఘం నివేదిక...	రమేష్ పట్నాయక్	14
తెలుగు చదువులు	ఇంగ్లీషుతోపాటు హిందీని కూడా...	నూర్‌భాషా రహంతుల్లా	18
పాఠశాలలు :	ప్రైవేటు స్కూళ్లను రద్దు చేయటమే....	ఆకునూరి మురళి	21
అమ్మనుడుల వార్తలు :	అమ్మనుడులు–సైన్స్ అధ్యయనం...	రహ్మానుద్దీన్ షేక్	23
పాలనాభాష :	వ్యావహారికభాషే పాలనాభాష...	పాలెపు సుబ్బారావు	25
చట్టసభల్లో తెలుగువారు :	చట్టసభల్లో తెలుగువాళ్ళ ఆనవాళ్లు	స.వెం. రమేశ్	30
పిట్టచూపు :	కార్గిల్ యుద్ధానికి 20 ఏళ్లు...	చలసాని నరేంద్ర	33
సంప్రదాయం–సాధికారిత :	ఆలోచనే ఆయుధంగా...	డా.పి.శివరామకృష్ణ 'శక్తి'	35
పెద్దోరి తీపి గురుతులు :	రెండు మహర్దశల నిండు...	సన్నిధానం నరసింహశర్మ	41
నుడి–నాడు:	విఖ్యాత దివిసీమ	కీ.శే.పలగాని గోపాలరెడ్డి	43
నవల–కావ్యం	నవల కూడా కావ్యమే!	చిటిప్రోలు వెంకటరత్నం	46
పుస్తక సమీక్షలు:		ఎం.వి.శాస్త్రి	47
నివాళి :			50
కథాగేయ రూపకం :	లచ్చిమి పెండ్లి	సడ్లపల్లె చిదంబరరెడ్డి	26
ధారావాహిక :	సౌతంత్రకాల సదువులు–2	నంద్యాల నారాయణరెడ్డి	37
కవిత :	సహవాసి	వాణీశ్రీనివాస్	22

రేఖాచిత్రాలు: పావులూరి చిదంబరేశ్వరరావు

వ్యంగ్యచిత్రాలు: సరసి

కంప్యూటరీకరణ : లంకె జనార్దన్

'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలను కొందరు వాట్సప్ (WhatsApp) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు స్వీకరించలేము. దయచేసి కొరియర్‌లో / రిజిస్టర్ట్ పోస్టులో, లేదా editorammanudi@gmail.com కు పంపించండి. – సంపాదకుడు

రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:
సంపాదకుడు: **అమ్మనుడి,** జి–2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి,
మాచవరం,విజయవాడ–520004.
కార్యాలయం : 0866-2439466 సంపాదకుడు : 9848016136 e-mail : editorammanudi@gmail.com

తెలుగుజాతి పత్రిక
అమ్మనుడి
మాసపత్రిక
నుడి - నాడు - నెనరు

చందా వివరాలు

		వ్యక్తులకు	సంస్థలకు	విదేశీయులకు
శాశ్వత చందా	:	రూ.5000	రూ.7500	--
5 సం॥	:	రూ.1000	రూ.1500	150 డాలర్లు
3 సం॥	:	రూ. 700	రూ.1000	75 డాలర్లు
1 సం॥	:	రూ. 240	రూ. 400	25 డాలర్లు

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు డి.డి.ని **'అమ్మనుడి'** పేర పంపాలి. చెక్కు పంపేట్లయితే దయచేసి అదనంగా రు.30 లు చేర్చి పంపండి.

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'అమ్మనుడి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.
AMMA NUDI - AXIS BANK, TENALI
అక్కౌంట్ నెం. **915020010550189**
IFSC Code : UTIB0000556

ఆన్‌లైన్‌లో చందాను పంపినవారు, ఆ వెంటనే దయతో - చిరునామా, ఫోన్ నెం. తదితర వివరాలను జాబుద్వారాగాని, ఫోన్ మెసేజి ద్వారాగాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలకు చిరునామా

డా॥ సామల లక్ష్మణబాబు, ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి**
గుంటూరు జిల్లా - 522 211. ఫోన్ : 9440448244
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. ఇందుకోసం మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలుపగలరు.

చందాదారులకు సూచనలు

1. చందా కాలం ముగింపు తేదీ - పత్రిక కవరుమీద మీ చిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
3. మీ ఇంటి నెంబరుతో పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలపాలి.
4. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.

'అమ్మనుడి' ఈ క్రిందిచోట్ల కూడ లభిస్తుంది

నవోదయ బుక్ హౌస్, ఆర్యసమాజ్ భవనం ఎదురుగా, కాచిగుడా. హైదరాబాదు **- 27.** ఫోన్ :040-24652387

మైత్రీ బుక్‌హౌస్, జలీల్ వీధి, కార్ల్‌మార్క్స్‌రోడ్డు (ఏలూరు రోడ్డు) **విజయవాడ - 2.** ఫోన్ : 9866211995

మణి బుక్‌స్టాల్, షాప్ నెం.58, సందేమార్కెట్, **నెల్లూరు**-1.

హెచ్చరిక

అమ్మభాష తెలుగును కాపాడుకొనే
ఉద్యమంలో భాగంగా భాషాప్రాధాన్యతను తెలిపే

కథానికలకు ఆహ్వానం

ఈ వేగయుగంలో క్లుప్తతకి ప్రాధాన్యమిస్తూ బుల్లెట్లలా పాఠకుల మెదళ్ళని తాకి కదిలింపజేసి ఆలోచనలలో ముంచెత్తేట్టు చేయగల బలమైన సాహిత్యప్రక్రియ కథానిక. కథ వస్తువైతే, దానిని కళాత్మకంగా మలచి చెప్పే ప్రక్రియ కథానిక. దీనిని చదవడానికి పట్టే సమయంకన్నా ఆలోచింపజేసే సమయం ఎక్కువ. అందుకే అమ్మభాష ప్రాధాన్యం అన్ని కోణాలలో అందరి మనసులలో నాటుకునేట్టు చెప్పే కథానికల్ని వరుసగా **అమ్మనుడి**లో ప్రచురిస్తున్నాం.

ప్రభుత్వ పరిపాలనలో, కోర్టు వ్యవహారాల్లో, నిత్యజీవితంలో తెలుగును కోల్పోతున్నందువల్ల జరిగే నష్టాల్ని కథావస్తువులుగా తీసుకోవచ్చు. అన్నిటికీ మించి విద్యారంగంలో తెలుగును సమూలంగా అణచివేస్తున్నందువల్ల తెలుగు పిల్లలకు - మొత్తంగా తెలుగు జాతికి - కలిగే నష్టాల్ని చిత్రిస్తూ కథానికలను వ్రాయవచ్చు. ఈ కోణాల్లో ఆలోచిస్తే రచయితలకు ఎన్నో కథాంశాలు కన్పిస్తాయి. 'అమ్మనుడి'లో ప్రచురిస్తున్న వ్యాసాల నుంచి ఇలాంటి అంశాలను గ్రహించవచ్చు. ఇందుకు రచయితల, రచయిత్రుల సహకారాన్ని కోరుతున్నాము. ప్రచురించే ప్రతి కథానికకు గౌరవ పారితోషికం పంపిస్తున్నాము.

- కథానిక ప్రచురణలో 2నుండి 4 పుటలకు మించకుండా ఉంటే మంచిది. ప్రతినెలా 1 లేక 2 కథానికలను మాత్రం ప్రచురించగలం.
- దయచేసి 3వ పుటలోని 'రచయితలకు సూచనలు' చూడండి

సంపాదకుడు, **అమ్మనుడి,** జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం, విజయవాడ-520 004. ఫోన్ : 9848016136.
e-mail : editorammanudi@gmail.com

రహ్మానుద్దీన్ షేక్
94930 35658

బడిలో మొదటి రెండేళ్ళ విద్యార్థులకు ఆంగ్లభాషను సబ్జెక్టుగా నిషేధించిన దక్షిణకొరియా

ఆంగ్లభాష పాశ్చాత్య సంస్కృతుల భాష. ఆ భాష నేర్చుకునేందుకు సహజంగా ఆ భాష పదజాలాన్ని నేర్చుకోవాలి. ఆ పదజాలంలో సింహభాగం పదాలు పాశ్చాత్య సంస్కృతికి అనుగుణంగా ఉంటాయి. మనం తినే ఆహారానికి, కట్టుబట్టలకు, వాతావరణానికి సరితూగే పదజాలం ఉండకపోవచ్చు. ప్రాంతీయంగా ఆయా పదాలు చేర్చి ఇక్కడ మనం సంభాషించుకున్నా, మాతృభాషగా ఆంగ్లం మాట్లాడేవారికి అవి అర్థం కాక అదొక సంకర భాషగా తయారవుతుంది. ఇక ఆంగ్లం మోజులో తమ తమ మాతృభాషల్లో మౌలిక పదాలను కూడా పలకలేక పిల్లలు ఆత్మన్యూనతా భావం లోకి వెళ్ళిపోతున్నారు. అటు ఆంగ్లామూ సరిగ్గా రాదు, ఇటు మాతృభాషలోనూ సరిగ్గా మాట్లాడలేకపోతున్నారు. రెంటికీ చెడ్డ రేవడిలా.

అదుగో అలాంటి పరిస్థితిలో విద్యార్థులు ఉన్నారని గ్రహించిన దక్షిణ కొరియా ప్రభుత్వం, ఆంగ్ల భాష అభ్యాసం వలన పిల్లల్లో కొరియన్ భాష- సంస్కృతి-ఆచార-వ్యవహారాలను గురించిన అవగాహన ఉండటం లేదని, ఒకటి-రెండు తరగతుల్లో ఆంగ్ల భాషను నిషేధించింది. 28 ఫిబ్రవరి, 2019 నుండి అమలయ్యేలా ఆంగ్ల భాషా నిషేధ చట్టాన్ని అక్కడి ప్రభుత్వం జారీ చేసింది. తద్వారా ఆంగ్ల భాష అభ్యాసం వలన జరిగే చెడు ప్రభావాలను తగ్గించాలన్నది తమ భావన అని ప్రభుత్వ వాదన.

ఈ చట్టానికి వెనుక పెద్ద కథే ఉంది. 2016లో అక్కడి రాజ్యాంగ న్యాయస్థానం ఒక తీర్పును వెలువరిస్తూ విద్యార్థుల కొరియన్ భాషా నైపుణ్యానికి ఆంగ్ల భాష ఒక అడ్డంకిగా మారిందని తేల్చింది.

ఆంగ్లభాష రెండవ భాషగా మూడవ తరగతి నుండి నేర్పిస్తే సరిపోతుందని కొరియా విద్యా మంత్రిత్వశాఖ వర్గాలు పేర్కొన్నాయి.

ఒకటి-రెండవ తరగతుల్లో విద్యార్థుల్లో చాలావారకు మెదడు రెండవ భాషను సరిసమానంగా నేర్చుకునే సామర్థ్యంతో ఉండదు. రెండవ భాష నేర్చుకోవటానికి ముందే విద్యార్థుల్లో సామాజిక పరిస్థితులను అవగాహన చేసుకొని మసలుకోవటం, ఏదైనా విషయాన్ని నేర్చుకునే తత్వాన్ని అలవరుచుకోవటం ముఖ్యం. కానీ తల్లిదండ్రులకు వారి పిల్లలు తొందరగా ఆంగ్లం నేర్చేసుకోవాలన్న ఆశ ఉంటుంది.

కొంత ఖర్చు ఎక్కువైనా తల్లిదండ్రులు ఆంగ్లం చదివించే బడులకే పిల్లల్ని పంపుతున్నారు. కొరియాలో తలసరి ఆదాయం సాలీనా 10.6 లక్షలైతే, ఒక విద్యార్థికి ఆంగ్ల మాధ్యమానికి సంవత్సరానికి అయ్యే ఖర్చు 12.4 లక్షల రూపాయలు. అంటే తమ తలకు మించిన భారమైనా తల్లిదండ్రులు పిల్లలను ఆంగ్ల మాధ్యమంలోనే చదివించేందుకు ఆరాట పడుతున్నారు.

ఈ నిషేధాజ్ఞ అంతర్జాతీయ బడులకు వర్తించదు. అంటే ఉన్నత-ఎగువ మధ్య తరగతికి చెందిన కుటుంబాల్లో పిల్లలు ఆంగ్ల భాషా మాధ్యమంలోనో, ఆంగ్ల భాష ఒక సబ్జెక్టుగానో మొదటి నుండే చదువుకుంటారు. అలానే ఈ నిషేధం కారణంగా దాదాపు 7,000 ఉపాధ్యాయులు ఉద్యోగం కోల్పోయి రోడ్డు మీద పడతారు.

మామూలుగానే నాణ్యమైన చదువు అందని దిగువ మధ్య తరగతి మరియు పేద విద్యార్థులు ఇక మరింత వెనుకంజలోకి వెళ్ళే ప్రమాదమూ ఉంది.

ప్రైవేట్ గా ఆంగ్లం నేర్పించే మాస్టార్లు పుట్టుకొస్తారు, ఆపై ప్రాయివేటుగా నేర్చుకున్న విద్యార్థులకు, అప్పుడే మొదటిసారి ఆంగ్లం నేర్చుకోబోతున్న విద్యార్థులకు మూడో తరగతి నుండే భూమి-ఆకాశమంత తేడాతో విద్య అందుతుంది.

ఇక దక్షిణ కొరియా దేశంలో ఆడవారు ప్రతి విషయంలో తమ పిల్లలు పక్క వారికన్నా మెరుగ్గా ఉండాలని కోరుకుంటారు. గర్భం దాల్చిన నాటి నుండే ఏ హాస్పిటల్ లో చేరారో, ఏం టీకాలు వేయించారో మొదలుకొని, పిల్లో/పిల్లోడో పుట్టాక ఏ ఉయ్యాలను వాడాలి, ఏ స్ట్రాలర్ వాడాలి అన్న విషయాల వరకు తల్లులకు పట్టింపు ఉంటుంది. అందువలన డబ్బుకు వెనాకాడకుండా ప్రయివేట్ గా ఆంగ్లం నేర్పించాలనుకునే అమ్మలు దేశమంతా ఉన్నారు. వీరు ప్రతిష్ట కోసం విద్యార్థులను కొరియన్ బడుల నుండి మాన్పించి ఇంగ్లిష్ నేర్పే అంతర్జాతీయ బడుల్లో వేస్తున్నారు.

దక్షిణ కొరియాలోని విశ్వవిద్యాలయాల్లో ప్రవేశం కోసం ఆంగ్లం కచ్చితంగా వచ్చి ఉండాల్సిందే. ఆంగ్లం రాని పక్షంలో విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలు అసాధ్యం. ఈ సాకుతో కూడా

కొందరు తల్లిదండ్రులు కొరియన్ మాధ్యమాన్ని పక్కన పెట్టి ఆంగ్ల మాధ్యమంలో వారి పిల్లలు చదివే వ్యవస్థ వైపు మొగ్గు చూపుతున్నారు.

ఈ నిషేధ ఉత్తరువులోనే దక్షిణ కొరియా ప్రభుత్వం తల్లిదండ్రులకు ఒక హెచ్చరిక లాంటి సూచన చేసింది. ఆ సూచన ప్రకారం ఆంగ్ల భాషను కేవలం ఒక ద్వితీయ భాషగానే తల్లిదండ్రులు పరిగణించాలి.

విద్యా మంత్రిత్వశాఖలోని ఒక పరిశీలకుడు మాట్లాడుతూ ఆంగ్ల భాషను రెండవ భాషగా తల్లిదండ్రులు పరిగణించాల్సిన అవసరం ఉందని అన్నారు. బయట ఉన్న పోటీ వలన తల్లిదండ్రులు పిల్లలు పుట్టక ముందు నుండే వారి విద్యా క్రమాన్ని నిర్ణయించేస్తున్నారని, దీని వలన పిల్లలు అనవసరపు వత్తిడికి గురవుతున్నారని ఆయన అన్నారు. ఇది మంచి పోకడ కాదు.

అందువలన ప్రభుత్వం తరఫున విద్యా మంత్రిత్వ శాఖ ఆంగ్ల భాషా విద్యలోని మెళకువలను, ఆంగ్ల మాధ్యమ దుష్పరిణామాలను గురించి నిత్యం తల్లిదండ్రులకు అవగాహనా తరగతులు నిర్వహిస్తున్నది.

తల్లిదండ్రుల నుండి వస్తున్న వత్తిడిని తట్టుకునేందుకు తక్కువ ఆదాయమున్న కుటుంబాల పిల్లలకు విద్యాశాఖ డబ్బు సహాయం చేసి మరీ ఆంగ్లం నేర్పించే యోచనలో ఉంది. ఈ పథకం మూడో తరగతి నుండి ఆంగ్ల బోధనా సదుపాయం లేని బడుల్లో చదివే విద్యార్థులకు అందనుంది.

ఆంగ్లం నేర్చుకునేందుకు మొబైల్ ఫోనుల్లోని ఆప్లు, కొన్ని వలగూడులనూ విద్యార్థులు ఆశ్రయిస్తున్నారు. ఇది వారికి ఆంగ్లంలో మాట్లాడేందుకు ఉపకరిస్తుందే తప్ప, భాషలోని ముఖ్యమైన విషయాలను నేర్చుకునే స్థాయిని ఇవ్వదు.

ప్రభుత్వ వైఖరి ఈ విషయంలో కొరియన్ సంస్కృతీ సాంప్రదాయాలను కాపాడేందుకు దోహద పడాలంటే తల్లిదండ్రుల పూర్తి సహకారం అవసరం.

విద్యార్థుల అవగాహనా-నేర్చుకునే పద్ధతులపై జరిగిన అన్ని పరిశోధనల్లో మాతృభాషా బోధన ఉత్తమం అన్నది తెలిసిన విషయమే అయినా, ఆంగ్ల భాషా మోజు ప్రపంచ వ్యాప్తంగా ఆంగ్లేతర దేశాల్లోని తల్లిదండ్రులను ఆవహించి ఉంది.

పోటీ ప్రపంచంలో ఆంగ్లం అవసరం ఉందన్నది కాదనలేని నిజం, కానీ మాతృభాషలో ప్రాథమిక విద్య జరగకపోతే, మౌలిక నైపుణ్యాలు పిల్లలకు అబ్బవు అని తల్లిదండ్రులు తెలుసుకోవాలి. కనీసం ఐదవ తరగతి వరకూ గణితం, సైన్స్, సామాజిక శాస్త్రం అన్నీ మాతృభాషలో నేర్చుకుని ఆపై ఆంగ్ల భాషని ఒక భాషగా నేర్చుకుంటే ఆ విద్యార్థి అవగాహనా స్థాయి బలంగా ఉంటుంది.

ఈ సమాచారాన్ని అందించిన 'డెట్రాయిట్ తెలుగు లిటరరీ సెంటర్' వారికి కృతజ్ఞతలు - సంపాదకులు

తెలుగులో అంతర్జాలంలో పెరుగుతోన్న అశ్లీల సమాచారం

తెలుగులో అంతర్జాలంలో పెరుగుతోన్న అశ్లీల సమాచారం 2009-2010 ప్రాంతంలో నాకు ఒక సమస్య ఎదురయ్యేది. తెలుగులో ఏదైనా పదాన్ని(అమ్మ, అక్క, చెల్లెలు మొ॥) గురించి వెతకదలిస్తే, ఆ తెలుగు పదానికి వచ్చే శోధన ఫలితాల్లో మొదటివన్నీ అశ్లీల వలగూడుల నుండి ఉండేవి. అలా ఇబ్బందికర పరిస్థితి రావడానికి ముఖ్య కారణం తెలుగులో సవ్యమైన పేజీలు తక్కువ ఉండటం. ఇప్పుడు పరిస్థితి మారిందనుకుంటే, ఇప్పటికీ కొన్ని పదాలను (పిన్ని, వదినె) గురించి వెతికితే అసభ్యకరమైన పేజీలు దర్శనమిస్తున్నాయి. దీనికి విరుగుడు తెలుగులో బూతు వలగూడు పేజీల ఆదరణ తగ్గి, సవ్యమైన పేజీల వీక్షకుల సంఖ్య పెరగాలి అలానే అసభ్య పేజీలను గూగుల్ కు చూపించవద్దని నివేదించాలి. ఇక ఇలా ఈ మధ్య ఈ పేజీలు శోధన ఫలితాల్లో రావటానికి మరో ముఖ్య కారణం, భారతదేశ చట్టాలు మరింత బలోపేతం అవడం, అందువలన పిల్లి తన పిల్లలను రోజుకో చోటకి మార్చినట్టు, పాత బూతు పేజీలన్నీ కొత్త వలగూడు చిరునామాలకు తరలిస్తున్నారు. కొత్త పేజీలు, తాజా సమాచారం, గూగుల్ శోధనలో ప్రాధాన్యత పొందుతాయి, అలా ఈ పేజీలు శోధన ఫలితాల్లో ముందుకి తోయబడుతున్నాయి. ఆంగ్ల భాషలో మన శోధనను జల్లెడపట్టి సురక్షిత పేజీలను చూపించే సాధనాలున్నాయి. తెలుగులో కూడా పేజీలను నివేదిస్తే, అవి ఆపైన మనకు కనిపించవు, కానీ తొలి దర్శనాన్ని ఆపలేం. ఇక మరో దరిద్రం - యూట్యూబ్‌లో టిక్ టాక్‌లో వీడియోలు. మొబైల్ ఫోన్లలో ఇంటర్నెట్ వాడకం పెరిగాక, వాడుకరులు మొబైళ్ళను సమాచార సాధనాలుగా మార్చుకున్నారు. వార్తలు, ఆహ్లాదం కోసం వీడియోలు చూస్తున్నారు. తెలుగులో వీడియోలు రూపొందించే వ్యక్తులు సరైన సమాచారం తోచక అంగ్ల వీడియోలనో, ఇతర జ్ఞానభాండాగారాలనో ఆధారంగా చేసుకొని వీడియోలు రూపొందించారు. అదీ వీక్షకులను మెప్పించట్లేదని అనుకున్న వీడియో తయారీదార్లు బూతు సాహిత్యాన్ని పంచడం మొదలుపెట్టారు. ఈ పంథా ప్రాచుర్యం పొందకముందే మంచి సమాచారమున్న వీడియోలకు ఆదరణ కలిగిస్తే, తయారీదార్లు తిరిగి మంచి వీడియోలు రూపొందిస్తారు, లేదా తెలుగులో యూట్యూబులో వీడియోల కోసం చూస్తే అసభ్యకరమైన, ఇబ్బంది పెట్టించే సంభాషణ లున్న వీడియోలు ఎక్కువ అయిపోతున్నాయి. సినిమాలలో వచ్చే విషయాలను నియంత్రించే విధానాలున్నాయి, ఇంటర్నెట్ లో సమాచారానికి అలాంటి సంస్థలు గానీ విధానాలు గానీ పగడ్బందీగా లేవు, తెలుగుకు రూపొందించుకునే బాధ్యతా మనదే. పొద్దస్తమానం వాట్సాపుల్లో ఉదంతాలను, అపోహలను ప్రతిపాదించి పంచే బదులు, మంచి తెలుగు కథలను, కావ్యాలను, సామెతలను, పొడుపుకథలను, పంచుకోవడం ఒక మంచి ప్రత్యామ్నాయం.

- ర. షే

సంపాదక హృదయం

తెలుగు రాష్ట్రాల్లో తెలుగు గతి ఏమికానుంది?

ఇరవై ఏళ్లుగా సాగుతున్న భాషా సంక్షోభం రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇప్పుడు స్పష్టమైన రూపాన్ని ధరించింది. తెలుగును ఒక భాషగా నేర్చుకొంటే చాలుననీ, దానిని ఒక ఆధునిక భాషగా, తెలుగుజాతి వికాస సాధనంగా వినియోగించే కృషికి చెల్లుచీటీ రాసేశాయి రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు.

అన్ని స్థాయిల్లోనూ మన భాషను వినియోగించడానికై జరిగిన, జరుగుతున్న కృషికి దారులను సాక్షాత్తూ ప్రభుత్వాలే మూసివేశాయి. ఈ పని తెలంగాణలో నాలుగేళ్లక్రిందటే మొదలుకాగా, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ప్రభుత్వం వచ్చీ రావడంతోనే బడి చదువులను తొలి అడుగుల నుండీ మనదికాని భాషలోకి – ఇంగ్లీష్ మాధ్యమంలోకి నెట్టివేస్తూ సీలలు బిగించింది.

ప్రజల్లో ఆంగ్ల మాధ్యమం పట్ల మోజు ఉన్నది గనుక, వారి కోరికను మన్నించి ఇలాంటి నిర్ణయాలను తీసుకున్నట్లు పాలకులు చెప్తున్నారు. 'యునెస్కో' వంటి ప్రపంచ సంస్థల నిపుణుల నివేదికలనుగాని, శాస్త్రీయ బోధనారీతులను గురించిన సలహాలనుగాని మన రెండు ప్రభుత్వాలూ పట్టించుకోవడం లేదు. ఒక భాషగా మాత్రమే పదో తరగతి వరకు నేర్పటంతో సరిపెట్టి, దానిని బోధనా భాషగా వినియోగించడం మానివేస్తే...తెలుగు నేటి అవసరాలకు తగ్గట్టు ఎదగదు. ఎంతో సమర్థమైన, విస్తృతమైన మన సొంతభాషను ఎదుగకుండా నెత్తిన మేకు కొట్టడమే ఇది. దీనిని వివరిస్తూ ప్రతి సంచికలోనూ ఎన్నో వ్యాసాలను ప్రచురిస్తున్నాం. గణాంకాలతో సహా వివరాలనిస్తూ 'తెలుగు రాష్ట్రాల్లో భాషా సంక్షోభం' అనే పుస్తకాన్ని ప్రచురించాం.

మాతృభాషలోనే చదువులు కావాలనడానికి ఐదు ప్రధాన కారణాలను గమనించాలి.

"– మాతృభాషలో చదువులు సహజం, సులభం, వనరులు ఎక్కువ, ఖర్చు తక్కువ, అది స్వేచ్ఛకు సంకేతం.

– మాతృభాషా మాధ్యమంలో చదువుతో ఉపాధి, ఉద్యోగావకాశాలు ఎక్కువ. భాషా గుత్తాధిపత్యాన్ని నివారించవచ్చు.

– ఆంగ్లభాషా మాధ్యమం ఏక భాషాధిపత్య నియంతృత్వానికి బాటలు వేస్తుంది. భాషా వైవిధ్యం అంతరిస్తుంది. అది ఆటంబాంబులాంటిది. జాతుల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను హరించి వేస్తుంది.

– ఆంగ్లభాషా మాధ్యమంతో భాషతోపాటు మనవైన ఉపాధి అవకాశాలనూ, మన పరిశ్రమలనూ, చేజార్చుకొని, పరాధీనులమవుతాం.

– ఆంగ్లభాషా మాధ్యమంతో అంతర్జాతీయ ఆర్థిక శక్తుల ప్రాబల్యంతో పాఠశాల, కళాశాల స్థాయిలలో 'ఔట్ సోర్సింగ్' మొదలై, అన్ని ప్రైవేటుపరమై, మనలో సామాజిక అంతరాలు బలపడి అవి తరచుగా విద్వేషానికీ సంఘర్షణలకూ దారి తీస్తాయి'

మన ప్రభుత్వాల నేతలు ఈ అన్ని అంశాలను గమనించాలి. వారు విద్యాధికులే. ప్రజలకు మంచి చేకూర్చగల విధానాలను అవలంబించాలే తప్ప జాతి భవిష్యత్తును అడ్డుకొనే నిర్ణయాలను చేయడం తగదు.

భాషా ప్రయుక్త రాష్ట్రాల మౌలిక లక్ష్యాలను విస్మరించి, అందుకు పూర్తి విరుద్ధంగా పరాయీకరణకు

దారితీసే విధానాలను అవలింబించడం ఏం నీతి?

'భాష నశిస్తే జాతి నశిస్తుంది' అని చరిత్ర చేసిన హెచ్చరికలను పెడచెవిన పెట్టడం జాతి ద్రోహమే. తెలుగు మాధ్యమాన్ని తీసివేసిన తర్వాత ఇక పరిపాలనలో మాత్రం తెలుగు ఎన్నాళ్లుంటుంది! కొద్దికాలంలో ప్రజలభాషలో పాలన అనే ప్రాథమిక ప్రజాస్వామ్య సూత్రానికి నీళ్లు వదులుకోవలసిందే.

ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పడి జగన్మోహనరెడ్డిగారు ముఖ్యమంత్రి కావడంతో తెలంగాణ ముఖ్యమంత్రి చంద్రశేఖరరావుగారితో సయోధ్య ఏర్పడింది. ఇద్దరు ముఖ్యమంత్రులూ రెండు రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించుకోవడానికి చొరవ తీసుకొంటున్నారు. రెండు రాష్ట్రాల్లోని ప్రజలంతా తెలుగు భాషాజాతికి చెందినవారే గనుక – ఇది ఎంతగానో ఆహ్వానించదగ్గ పరిణామం. తెలుగు విశ్వవిద్యాలయం, తెలుగు అకాడమీవంటి భాషకు, సంస్కృతికి, చరిత్రకు సంబంధించిన సంస్థల విభజనతో సహా అపరిష్కృత సమస్యలన్నిటినీ జాతి శ్రేయస్సు దృష్ట్యా పరిష్కరించుకోవాలి.

ఇదే సమయంలో – రెండు రాష్ట్రాలలోనూ ప్రభుత్వాల విద్యావిధానాన్నీ, భాషా విధానాన్నీ రూపొందించడంలో కూడా తెలుగుజాతి సమిష్టి క్షేమాన్ని, భవిష్యత్తును లక్ష్యంగా పెట్టుకొని ఆలోచించాలి. ముందుగా ఈ క్రింది అంశాలపై నిర్ణయం తీసుకోవాలి.

1. అన్ని పాఠశాలలలో కనీసం ప్రాథమిక విద్యవరకు మాతృభాషలోనే బోధన (మీడియం) తప్పనిసరి చెయ్యాలి. 6వ తరగతి నుండి 10 వరకు మాధ్యమాన్ని ఎంచుకొనే స్వేచ్ఛను విద్యార్థికి ఇచ్చి, అందుకు తగ్గ సౌకర్యాలను కలిగించాలి. తెలుగు మాధ్యమంలో చదువుకొన్న వారికి ప్రభుత్వ ఉద్యోగాలలో (తమిళనాడులోవలె) 20శాతం కేటాయింపు (రిజర్వేషన్) జరగాలి.

2. అన్ని స్థాయిల్లోనూ పరిపాలనలో తెలుగును అధికారభాషగా తప్పనిసరిగా ఆచరణలోకి తేవాలి. చట్టాలను, ప్రభుత్వ ఉత్తర్వులను ఆంగ్లంలోనేగాక, అధికార భాష తెలుగులోనూ సాధికారిక పత్రాలుగా ప్రకటించాలి.

3. తెలుగు భాషోద్యమ సమాఖ్య ఎన్నో ఏళ్లుగా ఉద్యమాలు చేసి, 2013లో 'తెలుగుకు ప్రత్యేక మంత్రిత్వశాఖ'ను, 2018 లో 'తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ'ను సాధించింది. 2014 లో విభజన తర్వాత తెలుగుభాష, సాంస్కృతిక శాఖ రెండు రాష్ట్రాలలో నామమాత్రంగానే ఉంది. ఏనాడూ ప్రత్యేక బడ్జెట్టు కేటాయింపుకుగాని, క్రియాశీల కార్యక్రమాలకుగాని నోచుకోలేదు. కాగా, 'తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ' ఏర్పాటుకై చట్టాన్ని తెస్తామని చెప్పిన నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారు కేవలం ఒక ప్రభుత్వ ఉత్తర్వుగా మాత్రమే ఇచ్చి, ఆ వ్యవస్థను ఏర్పాటు చెయ్యడంలో ఏ మాత్రం శ్రద్ధ వహించలేదు. ఆ రెండు వ్యవస్థలూ ఆ విధంగా నీరుగారిపోగా, ఇప్పుడేర్పడిన రెండు ప్రభుత్వాలూ వాటిని పట్టించుకోలేదు.

ఉమ్మడి రాష్ట్రంలో 'అధికారభాషా సంఘం' ఒక పునరావాస కేంద్రంగా ఉండేది. అది చట్ట పూర్వకంగా ఏర్పడిందే అయినా, దానికి నియమనిబంధనలను రూపొందించడంగాని, శాశ్వత కార్యాలయ వ్యవస్థ ఏర్పాటుగాని ఎన్నడూ జరుగలేదు. తెలంగాణాలో నామమాత్రంగా ఒక అధ్యక్షుని నియమించి. ఊరుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అధికార భాషా సంఘం స్థానంలో ప్రాధికార సంస్థ ఏర్పాటుకు ఉత్తర్వులివ్వడంతో సరిపెట్టారు!.

ఇప్పుడు ఇద్దరు ముఖ్యమంత్రులూ ఈ అంశాలను పరిశీలించి, రెండు రాష్ట్రాల్లో తెలుగుభాషా సంరక్షణకు, అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం. నిపుణులతో, భాషోద్యమ ప్రతినిధులతో కూడిన ఒక త్రిసభ్య కమిటీని నియమించి, రెండు మూడు నెలల వ్యవధిలో వారి నివేదికను తెప్పించుకొని, రెండు రాష్ట్రాలలో తెలుగు అభివృద్ధికై ఒక విధానాన్ని రూపొందించుకొని ముందుకు సాగాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

తేదీ : 2-7-2019

సామల రమేష్‌బాబు

వెన్నెలకంటి రామారావు
9550367536

'ఉపాధి' సాకుతో ఉనికికే ఎసరు!

సమాజంలో నడుస్తున్న అత్యంత తీవ్రమైన పోటీ వాతావరణంలో తమ పిల్లలు నెగ్గుకురావడమే కాదు, అగ్ర తాంబూలాలు అందుకోవాలనే ఆశ/ఆకాంక్షతో తల్లిదండ్రులు ఉపాధి భాషగా ఇంగ్లీషును ఆశ్రయించడం సర్వసాధారణమైంది. తమ పిల్లలు ఇంగ్లీషు భాషలో ప్రావీణ్యత సంపాదించడం ద్వారానే సుఖంగా జీవించేందుకు అనువైన ఉపాధి అవకాశాలను అందింపుచ్చుకుని, అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాలకు వెళ్ళి ఃనాలుగు రాళ్లుః పుష్కలంగా సంపాదించాలని సగటు విద్యావంతులైన తల్లిదండ్రులు పగటి కలలు కంటున్న సంగతి అందరికీ తెలిసిందే. అందుకోసం వారు ఇంగ్లీషు మీడియంలో, ఐఐటీ ఫౌండేషన్తో ప్రీ క్లాస్, ఎల్కేజీ, యూకేజీ నడిచే కాన్వెంట్ల వెంట పరుగులు తీస్తూ లక్షల రూపాయలు వెచ్చిస్తుండడం పరిపాటి గా మారింది. అదే సమయంలో కుల వ్యవస్థ దొంతరలలో నలిగి పోతున్న జనం...అగ్రవర్ణాల (వర్గాల) పిల్లలవలె తమ పిల్లలు వృద్ధిలోకి వచ్చేందుకు ఆశపడి, నాసిరకం ప్రమాణాలతో నడిచే ఇంగ్లీషు మాధ్యమ పాఠశాలల్లో అనివార్యంగా చదివిస్తున్నారు. లక్షల రూపాయల ఖర్చుతో ఉన్నత ప్రమాణాలున్న స్కూళ్లలో చదివే అగ్రవర్ణాల పిల్లలు, స్తోమత కరువై నాసిరకం ఇంగ్లీషు మీడియం పాఠశాలల్లో చదువుకున్న పిల్లలకున్న కారణాలు భిన్నమైనప్పటికీ పరభాషను (రెండవ భాషను) నేర్చుకోవడం లోని సమస్యలు వారి వ్యక్తిత్వ, మేధో వికాసానికి విఘాతం కలిగిస్తున్నా యని అనేక అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. అయినప్పటికీ ఈ దేశ పాలకులు దుర్బుద్ధితో ప్రజల ఆశలను అధికార సోపానాలుగా మలచుకొనే క్రమంలో, కార్పొరేట్ విద్యాసంస్థల ప్రయోజనాలు కాపాడడంలో స్వయంలబ్దిని చూసుకుంటూ ప్రాథమికస్థాయి నుంచి ఆంగ్ల మాధ్యమ విద్యావిధానాన్ని ప్రజలపై రుద్దుతున్నారు. భాషోద్యమ కారులు, భాషా శాస్త్రవేత్తల హెచ్చరికలను పెడచెవిన పెట్టి, రెండు తెలుగురాష్ట్రాల పాలకులు ప్రాథమిక విద్యనుంచి ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టడం ఆత్మహత్యా సదృశ్యం.

'ముసాయిదా' మూడు భాషల మర్మం

ఇదే కోవలో కస్తూరి రంగన్ కమిటీ ఈ ఏడాది జూన్ 3తేదిన కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖకు సమర్పించిన జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) - 2019 చిత్తు ముసాయిదాపై దేశ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమైనాయి. అవి కేవలం ప్రత్యర్థి రాజకీయ వర్గాల నుంచి మాత్రమే కాదు, విద్యావంతులు, ప్రజా స్వామిక వాదులు, వివిధ పౌర, ప్రజాసంఘాలు కూడా ఆ ముసాయిదాకు వ్యతిరేకంగా నిరసించాయి. హిందీయేతర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు తమ మాతృభాషతో పాటు దేవనాగరీ హిందీ, ఇంగ్లీషు భాషలను కూడా తప్పనసరిగా అభ్యసించాలన్న ముసాయిదా ప్రతిపాదనను దక్షిణాది రాష్ట్రాలు సహా మహారాష్ట్రకు చెందిన రాజకీయ పక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. దాంతో తర్వాతి రోజున ఆ ముసాయిదాను కేంద్రం సవరిస్తూ...వెసులుబాటు అంశాన్ని దృష్టిలో పెట్టుకొని వారు (విద్యార్థులు) అధ్యయనం చేస్తున్న ఆ మూడు భాషల్లో ఒకటిగాని అంతమించి భాషలనుగానీ మార్చుకోవాలంటే గ్రేడ్ 6 తరగతి, గ్రేడ్ 7 (తరగతి)ల లోనే అది సాధ్యమవుతుంది. సెకండరీ విద్యా కాలంలో వారు రాసే మోడ్యులర్ బోర్డ్ పరీక్షల్లో ఆ మూడు భా షల్లో (ఒకటి సాహిత్య స్థాయిలో) ప్రావీణ్యతను గడించిన తర్వాతనే ఆ మార్పు సాధ్యమవుతుందని మెలిక పెట్టింది. పునాది స్థాయి (తొలినాటి శిశువిద్య) నుంచి మూడు భాషలను నేర్చుకోవడం ప్రారం భిస్తే 3వ గ్రేడ్ (తరగతి) అంటే 8/9 వయసు వచ్చేనాటికల్లా ఆ మూడు భాషల్లో మాట్లాడే, చదివే ప్రావీణ్యతను పిల్ల లు సంతరించు కోగలరని ఎన్ఈపీ 2019 ముసాయిదా సూచించింది. 1968, 1986 నాటి విద్యా విధానాలు సైతం తొలినాళ్ళ ప్రాథమిక తరగతు లలో మూడు భాషలను తప్పనిసరిగా నేర్చుకోవాలని ఎన్నడూ సూచిం చలేదు. మూడవ భాషను తరచూ చాలా ఆలస్యంగా మధ్యతరగతుల్లో విద్యార్థులకు బోధించడం పరిపాటి. చాలాకాలం క్రితమే ప్రవేశ పెట్టినా, ఇప్పటిదాకా పూర్తిగా అమలుకు నోచుకోని, ప్రపంచంలో ఎక్కడాలేని త్రిభాషా విధానాన్ని 2019 ముసాయిదా మరింత దూకుడుగా ముందుకు తీసుకురావడంపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

'నీళ్లలో ముంచిన స్పాంజి నీటిని వేగంగా పీల్చుకున్నట్లు' గా శిశుప్రాయంలో భాషలను వేగంగా నేర్చుకుంటారని చెప్పే 'సముచిత వ్యవధి' (క్రిటికల్ పీరియడ్) సిద్ధాంతానికి అనుగుణంగా మూడవ తరగతి నాటికల్లా విద్యార్థులు మూడు భాషల్లో ప్రావీణ్యతను సంతరించుకోవాలనే ఉద్దేశంతో ఎన్ఈపీ ఇలాంటి నిబంధనను (పేజి 4.5.3) రూపొందించింది. భాషను నేర్చుకోవడానికి (అక్విజిషన్), భాషను 'అభ్యసించడానికి' (లెర్నింగ్) మధ్య వ్యత్యాసం ఉంది. ఇంట్లో కుటుంబ సభ్యుల మధ్యనున్న వాతావరణంలో మాతృభాషను – పిల్లలు నేర్చుకున్నట్లుగా సమాజంలోనూ అలాంటి వాతావరణం ఉంటేగానీ ఇతర భాషల్లో ప్రావీణ్యాన్ని సాధించడం సాధ్యంకాదు. అలాంటి వాతావరణం లేకుండా రెండు పరాయిభాషలను పిన్న వయసులో నేర్పించేందుకు ప్రయత్నిస్తే, వారిలో మానసిక ఒత్తిడి కలిగిస్తుందన్న విషయాన్ని ఎన్ఈపీ గ్రహించకపోవడం దురదృష్టకరం. 10 ఏళ్లు దాటిన పిల్లలకు మాత్రమే ఇతర భాషలను అభ్యసించేందుకు తగిన పరిపక్వత ఉంటుందని పలు అధ్యయనాలు తెలియజేస్తున్నాయి.

అదీకాక ఏదైనా కొత్త లేదా అదనపు భాషలను నేర్చుకోవాలంటే ముందుగా ఇతరులతో వ్యవహరించడంలో మాటల ప్రావీణ్యాన్ని సంతరించుకున్న తర్వాతనే కొత్త భాషల నుడికారాలను రాత పూర్వకంగా నేర్చుకోవడం సులభ సాధ్యమవుతుందనే విషయం సర్వత్రా తెలిసిందే. అయితే ఈ చిత్తు ముసాయిదా ప్రకారం పిల్లలు

స్కూలుల్లోకి చేరిన తొలిమూడేళ్ళలోనే మూడు భాషలను తప్పక అభ్యసించవలసి ఉంటుంది. దాంతో హిందీ మాట్లాడే ప్రాంతాల్లోని మాతృభాషగా ఉన్న హిందీ కాకుండా, దేవనాగరి హిందీని, మరొక భారతీయ ప్రాంతీయ భాష, ఇంగ్లీషులకు సంబంధించిన అక్షరాలను, నుడికారాలను పిల్లలు నేర్చుకోవడం వారికి పెనుభారంగా మారుతుందని విద్యారంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. భారతీయ భాష నేర్చుకోవాలంటే 400–700 దాకా విజువల్ యూనిట్స్ (అక్షరాలు)ను విద్యార్థులు గ్రహించవలసి ఉంటుంది. ఈ నేపథ్యంలో స్కూల్‌లో చేరిన తొలినాళ్ళలోనే పిల్లలు మూడు భాషలనూ నేర్చుకోవాలని నిర్బంధించడం ఆచరణ సాధ్యం కానేకాదు. అయితే ప్రాథమిక విద్య మాతృభాషా మాధ్యమంలోనే సాగాలని ముసాయిదా సూచించడం ఒకింత ఊరట కలుగుతుంది. ఏఎస్ఈఆర్ (ASER...Annual Status of Education) వంటి అనేక అధ్యయనాల ప్రకారం దేశంలో మూడవ తరగతి విద్యార్థుల్లో అత్యధికులు ఒక్క భాషను కూడా సరిగా నేర్చుకోలేని దుస్థితిలో ఉన్నారని వెల్లడిస్తున్నాయి. అలాంటిది మూడవ తరగతిలోపు మూడు భాషల్లో విద్యార్థులు ప్రావీణ్యత సంపాదించాలనే కేంద్రప్రభుత్వ ప్రతిపాదిన హాస్యాస్పదం. ప్రమాదకర ప్రయోగం మాత్రమే. జాతీయభాష హిందీని గానీ, దాదాపు అంతర్జాతీయ ఉపాధి భాషగా ఉపకరిస్తున్న ఇంగ్లీషునుగానీ అనాలోచితంగా, అహేతుక పద్ధతుల్లో బోధించేందుకు ప్రయత్నించడం సామాజిక ఉత్పాతాలకు దారితీస్తుంది. భావితరాల మేధోవికాసానికి శాపంగా పరిణమిస్తుందన్న విషయాన్ని పాలకులు గుర్తించాలి. అనాలోచితంగా, అశాస్త్రీయంగా విద్యార్థిదశ నుంచి జాతీయవాదం ముసుగులో జాతి ఉన్మాదాన్ని భాషరూపంలో శిశు విద్య దశ నుంచి ప్రేరేపించేందుకు చేస్తున్న ప్రయత్నాలు భారతీయ బహుళత్వ సమాజానికి విఘాతం కలిగిస్తుంది.

పరభాష బోధన – 'సముచిత వ్యవధి'

దక్షిణ కొరియా ప్రభుత్వం 2018 మార్చిలో ప్రాథమిక పాఠశాలలోని మొదటి, రెండు గ్రేడ్ విద్యార్థులకు ఇంగ్లీషు భాషా బోధనా తరగతులను నిలిపివేసింది. విద్యాభ్యాసం తొలినాళ్ళలోనే ఆంగ్లవిద్య బోధనవలన కలిగే దుష్పరిమాణాలను తగ్గించేందుకు అక్కడి పాలకులు ఈ నిషేధాన్ని తీసుకొచ్చారు. ప్రాథమికదశలో ఇంగ్లీషు విద్యాబోధనవల్ల కొరియా విద్యార్థుల ప్రతిభా పాటవాలకు విఘాతం కలుగుతోందని ఆ దేశ కాన్స్టిట్యూషనల్ కోర్టు తీర్పు నేపథ్యంలో వారు ఈ చర్య తీసుకున్నారు. ఇంగ్లీషు విద్యా నిపుణులు, న్యూరో శాస్త్రవేత్తల అధ్యయనాల ప్రకారం మూడవ గ్రేడ్ (తరగతి) నుంచి ఇంగ్లీషు నేర్పించడం సరైన సమయమని తేల్చి చెప్పడంతో తాము ఈ నిర్ణయం తీసుకున్నట్లు దక్షిణ కొరియా ప్రభుత్వం ప్రకటించింది. సామాజిక నైపుణ్యాలు, అభివ్యక్తి అభివృద్ధి జరగవలసిన ప్రీ స్కూల్ లోనే రెండవ భాషను నేర్పిస్తే విద్యార్థుల్లో అనేక అధ్యయన సమస్యలు తలెత్తుతాయని భాషావేత్తల అభిప్రాయం. అయితే అతి చిన్న వయసులో పరభాషను నేర్చుకోవడంగానీ, ఆ భాషా జాతీయుల స్థానికతను సాధించడంగానీ చాలా సులభమనీ భాషా అధ్యయనవేత్తల అభిప్రాయమే ప్రజల్లో ప్రచారంలో ఉంది. 5 నుంచి 15 ఏళ్ళ లోపు (9–14ఏళ్ళ లోపు యుక్తవయసు రావడం) కాలం సమీపించేందుకు ముందుగా మొదటి భాష (మాతృ భాష)నుగానీ, రెండవ భాష (పరభాష) నుగానీ నేర్చుకుంటే భాషా ప్రావీణ్యం సవ్యంగా, సులభంగా అలవడుతుందనీ, ఆ పై వయసు వారికి అది అంతగా సాధ్యంకాదని 1959లో పెన్ఫీల్డ్, లామార్ రాబర్ట్స్లు ప్రతిపాదించారు. ఆ కాలాన్ని వారు 'సముచిత వ్యవధి' (క్రిటికల్ పీరియడ్) అని వారు సూత్రీకరించారు. అయితే 1967లో లెన్నెబెర్గ్ అనే భాషావేత్త మెదడుకు దెబ్బతగిలిన పిల్లలు, పెద్దల అభ్యసన నైపుణ్యాలపై 1967లో జరిపిన అధ్యయనాల ఆధారంగా క్రిటికల్ పీరియడ్ (సముచిత వ్యవధి) గురించి బాగా ప్రచారంలోకి తీసుకొచ్చారు. అయితే ఫిజీషియన్, విద్యావేత్త, విద్యాతత్వవేత్త డాక్టర్ మేరియా మాంటిస్సోరి ఈ 'సముచిత వ్యవధి' ని 'సున్నిత వ్యవధులు'గా అభివర్ణిస్తూ, వాటి ఆధారంగా విద్యా తత్వశాస్త్రానికి రూపకల్పన చేశారు. అయితే రెండవ లేదా పర భాషలను నేర్చుకునేందుకు కూడా ఈ 'సముచిత వ్యవధి' (5–15 ఏళ్ల మధ్య కాలం) చాలా కీలకమైనది. ఈ వ్యవధిలో మాత్రమే 'స్థానిక భాషాజాతీయుల ప్రావీణ్యాన్ని, పటిమ' ను విద్యార్థులు సులభంగా సాధించగలరని భాషా శాస్త్రవేత్తల అభిప్రాయం. ఈ 'సముచిత/సున్నిత వ్యవధి' కాలంలోనే మాతృభాషతో పాటుగా – ఇంగ్లీషు, హిందీ వంటి భాషలను నేర్పించడం సరైనదేననే అవగాహనతో ఎన్ఈపీ 2019 రూపొందింది.

అయితే ఇటీవల బ్రిటన్‌లో ఫ్రెంచ్ రెండవ భాషగా నేర్పించడంపై 17వేల మంది ఇంగ్లీషు పిల్లలపై జరిపిన అధ్యయనం ప్రకారం మొదటిభాష లేదా మాతృభాషను (ఆ భాషా మాధ్యమాన్ని) తొలినాళ్ళలో బోధించడం వల్ల సత్ఫలితాలు సాధించవచ్చుగానీ, అదే సమయంలో పరభాష (మాధ్యమం కూడా) ను కూడా వారికి బోధిస్తే అనేక అధ్యయన, వ్యక్తిత్వ వికాస రుగ్మతలు తలెత్తిన విషయాన్ని ఆ అధ్యయనం గుర్తించింది. 8 ఏళ్ళప్పటి నుంచి రెండవ/మూడవ తరగతి నుంచి ఇంగ్లీషు భాష (మాధ్యమం) నేర్చుకున్న వారిలో కంటే యవ్వన (10–19 ఏళ్లు) దశలోని తొలినాళ్ళలో (11–13 ఏళ్ల వయసు – తొలి యవ్వనదశ) లో నేర్చుకున్నవారిలో మెరుగైన భాషా నైపుణ్యాలను నిపుణులు గుర్తించారు. తొలి యవ్వనదశలో (కచ్చితంగా చెప్పాలంటే 15 ఏళ్ళకు లోపు వయసులో) పరభాషను (మాధ్యమాన్ని నేర్చుకున్న విద్యార్థులు స్థానిక భాషా వ్యవహర్తల వలె ప్రావీణ్యాన్ని సంతరించుకోగలిగినట్లు ఆ అధ్యయనం వెల్లడించింది. ఈ అధ్యయనం ప్రకారం పరభాషా (మాధ్యమం) బోధనకు 'సముచిత వ్యవధి' 11–13 ఏళ్ళుగా గుర్తించక తప్పదు. అంటే ఆ అధ్యయనం ప్రకారం మనదేశంలో 6వ తరగతి నుంచి పరభాషను బోధించే విధానాన్ని చేపట్టవలసి ఉంటుంది. దీనికి అగ్రవర్ణాలు (వర్గాలు), వెనకబడిన వర్ణాలు (వర్గాలు) అనే సామాజికాంశంతో పనిలేదు. జీవ సంబంధిత మెదడు పరిణామంతో ముడిపడిన వ్యవహారమిది. అలాకాక డబ్బు, సామాజిక హోదా మదంతో అలాగ వర్గాలుగానీ, సామాజిక న్యాయం పేరుతో విచక్షణారహితంగా, విముక్తి ప్రదాతగా

పాఠశాల విద్యలో మాతృభాషే మాధ్యమంగా ఉండాలి

భావించి, ఆంగ్లారాధనతో ఆంగ్ల విద్యను (మాధ్యమాన్ని అందించి నట్లయితే తమ పిల్లల మేధో విధ్వంసానికి తాము కూడా కారణం కాగలరు. ఆంగ్లారాధనను ఉపాధి మార్గంగా అగ్రవర్ణాలు (వర్గాలు), విముక్తి మార్గంగా నిమ్న వర్గాలు (వర్గాలు) భావించి, ఆ మాయలో కొట్టుకుపోవడం ఆత్మహత్యా సదృశ్యంగా నిలుస్తుంది. ఉపాధికోసం పరభాషా నైపుణ్యాలు సాధించడం తప్పనిసరి అని అగ్రవర్ణాల (వర్గాలు) వారు, ఇంగ్లీషు భాషతో అభివృద్ధి సాధిస్తున్నారనే భ్రమల్లో నిమ్న వర్ణాల (వర్గాలు) ప్రజలు ఇంగ్లీషు భూతాన్ని నెత్తికెక్కించుకుంటున్నారు. దళిత, బహుజన ప్రజానీకాన్ని ఆయా అస్తిత్వవాద మేధావులు రెచ్చగొడుతూ ఇంగ్లీషులోనే విముక్తి ఉందనే భ్రమల్లో (ఇంగ్లీషు భాష అనే పులి పాలు తాగాలి...) తప్పుడు భావనలో వారిని ముంచెత్తుతుండడం దురదృష్టకరం. 'పరభాషను ఎలా నేర్చుకోవాలని (అభ్యసనం) చేసే చర్చను...' దళిత, బహుజన సమూహాలకు గతంలో సంస్కృతంవలె ఇప్పుడు ఆంగ్లభాషను కూడా అగ్రవర్ణాలు కుట్రచేస్తున్నాయనే' చర్చగా వాళ్ళు తప్పుదారి పట్టిస్తు న్నారు. ఆంగ్ల భాషను అగ్రవర్ణాలకే పరిమితం చేస్తున్నారనే అస్తిత్వ మేధావుల వాదన అర్థరహితం. ఆంగ్లభాషను ఎవరైనా ఎలా నేర్చు కోవాలనేదే ప్రధాన చర్చ. అంతేగానీ కులాల ప్రస్తావనతో పాలకుల భాషా విధానాన్ని గుడ్డిగా సమర్థించడం దళిత, బహుజన ప్రజలకు అన్యాయం చేయడమే అవుతుంది. పరభాషను తొలినాళ్ళలోనే నేర్చు కోవడంవల్ల కలుగుతున్న వ్యక్తిగత, సామాజిక దుష్పరిణామాలను పరిగణనలోకి తీసుకొని అందుకు భిన్నమైన హేతుబద్ధ భాషా విధానాన్ని రూపొందించడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారు. లేదా విద్యా వ్యాపారస్తుల వొత్తిడులకు, తాయిలాలకు తలొగ్గి ఆ ఎరుకలేనివారి బిడ్డల మేధోవికాసాన్ని గండికొట్టే ఆంగ్లమాధ్యమ విధా నాన్ని అమలు చేస్తున్నారు.

సామ్రాజ్యవాద భాషా విధానం

ప్రపంచం 'గ్లోబల్ డిజిటల్ విలేజ్' గా మారిన సందర్భంలో (ప్రపంచీకరణ) ఇంగ్లీషు భాష నేర్చుకోవడంపట్ల అంతర్జాతీయ స్థాయి లో అనివార్యంగా ఆసక్తి పెరిగిందనేది కాదనలేని వాస్తవం. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కేంద్రంగా ఉన్న పారిశ్రామిక దేశాలకు వ్యవసాయ దేశాల నుంచి భారీ ఎత్తున వివిధ భాషాజాతీయుల వలసలు సాగిన నేపథ్యంలో ఈ పరిస్థితి తలెత్తింది. అదీ కాక ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో పారిశ్రామిక, వ్యవసాయ రంగానికి అనుబంధంగా ఉండాల్సిన ద్రవ్య తదితర సేవల రంగాలు దేశాలు, జాతులు, ప్రాంతాలు తదితర భౌగోళిక సరిహద్దులను చెరిపివేస్తూ బ్రహ్మాండమైన స్థాయిలో అవతరించడంతో వివిధ భాషా జాతీయుల మధ్య ఆదాన ప్రదానాల అవసరం మరింతగా పెరిగింది. దాంతో అంతర్జాతీయ సమాజానికి ఒక అనుసంధాన భాష ఆవశ్యకత అనివార్యమైంది. ఇంగ్లీషు భాషా జాతి పాలక సమాజాలుగా ఉన్న ఆంగ్లో శాక్సన్ రాజ్యాలు (బ్రిటన్, అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్) ప్రపంచ ఆర్థిక, రాజకీయ, మిలటరీ ఆధిపత్యం కొనసాగించినంతకాలం ఆంగ్లభాష అంతర్జాతీయ అనుసంధాన భాషగా కీలకపాత్ర పోషించింది. 2007 అమెరికాలో గృహ రుణాల సంక్షోభంతో ప్రారంభమై ఏడాది కల్లా ప్రపంచ ఆర్థిక సంక్షోభపు చీకట్లు అలుముకున్న నాటినుంచి పొలిమేర దేశాల నుంచి భాషా జాతీయుల వలసల డిమాండ్ పెరిగింది. దాంతో పాటుగా, సంక్షోభంలో కూరుకుపోయిన ఆంగ్లో శాక్సన్ రాజ్యాలు ఆ వలసలపై ఆంక్షలు విధించడంతో యూరోపియన్ యూనియన్ (ఈయూ) లోని ఆర్థికంగా స్థితమంతమైన దేశాలకు అవి మళ్లాయి. పర్యవసానంగా ఆంగ్లం సహా వివిధ అభివృద్ధి చెందిన దేశాల భాషలలో ప్రావీణ్యతను సాధించవలసిన అగత్యం (అవసరం బట్టి) వలస ప్రజలకు ఏర్పడింది. దాంతో ద్విభాషా జాతీయత ఒక ప్రబల అంశంగా ముందుకొచ్చింది. బహు భాషాజాతీయులతో రూపొందిన ఈ బహుళత్వ సమాజాలలోని తర్వాతి తరాలు మాతృ భాషలు, స్థానిక పరభాషలు నేర్చుకుని స్థానికత్వాన్ని సంతరించు కోవడం అనేది ఆ సమాజాలకు ఒక ప్రధాన సమస్యగా మారింది. అందుకు పరిష్కారంగా పాశ్చాత్య సమాజాల అవసరాలను తీర్చేందుకు అనువుగా సముచిత (సున్నిత) వ్యవధిః అనే సిద్ధాంతం ఆవిర్భవించింది. అదే సమయంలో పొలిమేర దేశాల (ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా ఖండాలలోని వ్యవసాయక, వర్ధమాన దేశాలు) నుంచి వలస వెళుతున్న భాషా జాతీయులు తమ అస్తిత్వాన్ని కాపాడుకుంటూ, పరభాషలోను, వారి స్థానికత్వంలోనూ నైపుణ్యం సంతరించు కోవడం, అంతర్జాతీయంగా అనుసంధాన భాషను లేదా ఉపాధి కొరకు వెళ్ళిన ప్రాంతంలోని పరభాషను స్థానికుల స్థాయిలో పటిమను అలవర్చుకోవడం, తమ తర్వాతి తరాలకు నేర్పించడమనే ఒక పెద్దసమస్య వచ్చింది. అదే సమయంలో వలస పోతున్న పొలి మేర వ్యవసాయ ప్రధాన దేశాలలో విద్యా విధానంలో తీవ్ర సమస్యలు తలెత్తాయి. ప్రధానంగా ఇంగ్లీషు (పరాయి భాష) సహా ఇతర ఉపాధి భాషలను నేర్పే విద్యా విధానంపై మల్లగుల్లాలు ప్రారంభమైంది. ఉపాధి భాషగా ఇంగ్లీషు ఆరాధన ప్రజల్లోనూ, పాలకుల్లోనూ ఇబ్బ డిముబ్బడిగా పెరగడం, అది విద్యా వ్యాపారంగా మారడంతో ఆంగ్ల భాషా బోధన, ఆంగ్ల మాధ్యమం తదితర విద్యా విధాన అంశాలు తీవ్ర చర్చనీయాంశాలుగా మారాయి. ముఖ్యంగా రెండు తెలుగు రాష్ట్రాల పాలకులు విద్యా బోధనలోని శాస్త్రీయతను, సామాజిక పరిమాణాలను పరిగణనలోకి తీసుకుకోకుండా ప్రాథమిక విద్య నుంచి ఆంగ్ల భాషా బోధనను, ఆంగ్ల మాధ్యమాన్ని పోటీపడి తమ బిడ్డల ఉపాధి భద్రతకోసం వెంపర్లాడే అమాయక ప్రజలపై రుద్దు తున్నారు. ప్రాథమిక విద్య నుంచి ప్రభుత్వ రంగంలో ఆంగ్లమాధ్యమ ప్రవేశ పెట్టడం, ప్రైవేట్ రంగంలో ఆంగ్ల మాధ్యమం కొనసాగుతుండడం వల్ల సంభవిస్తున్న విచక్షణా రహిత భాషా జాతి విధ్వంసం గురించి మాతృభాషోద్యమకారులు పలుమార్లు హెచ్చరిస్తున్నప్పటికీ తెలుగు పాలకులు భస్మాసుర ఆంగ్ల మాధ్యమ విద్యావిధానాన్నే అమలు చేస్తున్నారు. అధికార స్థానాలను కైవసం చేసుకోవడానికి లేదా సుస్థిరం చేసుకోవడానికి ప్రజల్లోని హేతువిరుద్ధ ఆకాంక్షలను, ఉద్వేగాలను రెచ్చగొట్టే ధోరణి ఒక కళగా ప్రపంచ రాజకీయాల్లో (సత్యానంతర రాజకీయాలు - పోస్ట్ ట్రూత్ పాలిటిక్స్) ప్రబలంగా అలముకున్న

తెలుగును బోధించడం కాదు ; తెలుగులోనే అన్నీ బోధించాలి

సందర్భంలో తెలుగు పాలకులు మరింత మేధో వైపరీ త్యంతో వ్యవహరిస్తున్నారు.

ప్రతి విషయమూ స్థల – కాలాలతో ముడిపడి ఉంటుంది. పరభాషను నేర్చుకునే విషయంలోనూ ఇదే వర్తిస్తుంది. అంటే ఇంగ్లీ షును ఎక్కడ నేర్చుకోవాలి? రోజులో ఏ సమయంలో నేర్చుకోవాలి అని అర్థం చేసుకుంటే శుద్ధ పొరపాటే అవుతుంది. స్థలం అంటే ఒక వస్తువు లేదా ప్రక్రియకు సంబంధించిన అభివృద్ధి క్ర మంలోని దశలను సూచిస్తే, కాలమంటే దాని అభివృద్ధికి దోహదంచేసే అంశీ భూతాల (inner components) చర్యా ప్రతిచర్యల వ్యవధిని, తీరును తెలియజేస్తుంది. అంటే మాతృభాషతో పాటు పరభాషలో కూడా పట్టుసాధించేందుకు వ్యక్తుల మనో వికాస దశల (స్థలంలో వ్యాప్తి లేదా చారిత్రక అంశం)తో పాటు, ఆ దశల స్వభాన్ని నిర్ణయించే సామాజికాంశాల పరస్పర ప్రతిచర్యలు, వాటి తీవ్రతలు, పరస్పర చ్ఛేదనలు, అభిన్నతల పరిణామాల వ్యవధి (కాలం లేదా తార్కిక అంశాలు) ని అంచనా వేయవలసి ఉంటుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కేంద్రమైన అభివృద్ధి చెందిన దేశాలకు వెళుతున్న పొలిమేర వ్యవసా యక దేశాలకు చెందిన వలస ప్రజలకు అక్కడి సమాజంలో సంలీనం కావలసి ఉంటుంది. ఆ కారణంగా స్థానికత్వంతో కూడా భాషా ప్రావీణ్యం వలస ప్రజలు అలవర్చుకోవలసిన అవసరం ఉంటుంది. ఈ నేపథ్యంలో వలస ప్రజల తర్వాతి తరాలు స్థానికత్వంతో కూడిన భాషా వ్యవహర్తలుగా తయారు చేసుకునే లక్ష్యంతో భాషా బోధనలో 'సముచిత వ్యవధి' అనే భావనతో కూడి విద్యావిధానాన్ని పాశ్చాత్య సమాజాలు అమలు చేసాయి. ఈ సందర్భంలో తమలాంటి భాషా జాతీయులుగా వలస ప్రజలను ఎలా తీర్చిదిద్దాలనే సంకల్పం మాత్రమే ఉంది గానీ, వారు లేదా వారి తర్వాతి తరాలు భాషతో పాటు కోల్పోతున్న సంస్కృతి, విశ్వ మానవ జ్ఞానంలో అంతర్భాగం కావలసిన స్థానిక విజ్ఞానం వంటి కీలక విషయాలను ఆ విద్యావిధానం పట్టించుకోలేదు. దాంతో స్థానికుల స్థాయిలో భాషా పటిమను సాధిం చడంపైనే రెండవ భాషా బోధనను కేంద్రీకరించడంవల్ల జరుగుతున్న నష్టాన్ని ఆ భాషా వేత్తలు విస్మరించారు. లేదా జాత్యహంకార విధానాన్ని రూపొందించారు.

భాష అంటే భావ వినిమయ సాధనం మాత్రమే కాదు, ఆ భాషా జాతీయులు తరాలతరబడి అనుభవాల పునాదిగా సాధించిన స్థానిక విజ్ఞానం కూడా ఉంటుంది అనే స్పృహ అభివృద్ధి చెందిన దేశాల పాలకులు, భాషావేత్తలకు లేదు. కేవలం పరభాషాజాతీయులు తమ సమాజంలో అంతర్భాగం కావడానికి అవసరమైన స్థానిక భాషా పటిమను సంతరించుకోవాలనే లక్ష్యంతో వారు 5 ఏళ్ళ నుంచి యుక్త వయసులోపు వలస భాషాజాతి పిల్లలకు రెండవ భాషను నేర్పించాలనే 'సముచిత వ్యవధి' సిద్ధాంతాన్ని అమలు చేసారు. దాంతో వలస ప్రజలు తమ మాతృభాషా పరిజ్ఞానంతో పాటు, అందులో నిక్షిప్తమైన స్థానిక విజ్ఞానికి కూడా దూర మయ్యారు. తెలుగు భాషా వ్యవహర్తలు సగంమంది రెండు తెలుగురాష్ట్రాల్లో ఉంటే, అంతే జనాభా తెలుగువారు ప్రవాసీలుగా ఉన్నారు. దాంతో తెలుగు భాషాజాతిలో దాదాపు సగం మంది తమ సొంత అస్తిత్వానికి దూరమైన పరిస్థితి నెలకొంది. ఉపాధి కోసం పాశ్చాత్య దేశాలకు వలస వెళ్ళే ప్రజలకోసం ఆయా దేశాల పాలకులు తమ విద్యా విధానాన్ని కూడా సముచిత వ్యవధి ప్రాతిపదికన పరభాషా మాధ్య మాలతో నడిచే విద్యావిధానాలను రూపొందించడం ఆత్మహత్యా సదృశ్యం. పాశ్చాత్య దేశాల అవసరాలకు పరిమితమైన 'సముచిత సందర్భం' భావనపై రూపొందిన విఫల త్రిభాషా సూత్ర విద్యావిధానం మన దేశంలో గతం నుంచి కొనసాగుతున్నది. ప్రస్తుతం ఎన్ ఈపీ 2019 చిత్తు ముసాయిదా కూడా భావితరాల మేధోభివృద్ధికి విఘాతం కలిగించే భాషా సామ్రాజ్యవాదంతో ముడిపడిన 'జాతీయ భాషా స్వామ్యాన్ని' త్రిభాషా విధానం రూపంలో మరింత విచక్షణారహి తంగా ముందుకు తీసుకురావడం పై ప్రజాస్వామిక శక్తులు నిరసన వ్యక్తం చేస్తున్నాయి. 'ఒకే జాతి, ఒకే మతం, ఒకే భాష' అనే నినాదంతో, 'ఏకీకృత హిందూ అస్తిత్వం' అనే ఎజెండాతో ఏకశిలా సదృశ్యమైన సమాజాన్ని నిర్మించేందుకు (మెజారిటీ ప్రజల ఏకస్వా మ్యాన్ని సాధించేందుకు) కేంద్ర పాలకులు ప్రయత్నిస్తున్నారు. అస మాన సామాజిక, ఆర్థిక వ్యవస్థ కొనసాగుతున్న చారిత్రక సందర్భంలో ఆరోగ్యకరమైన బహుళత్వ సాంఘిక అస్తిత్వం ఉనికిలో ఉండడమే ప్రజాస్వామిక రాజ్యానికి పరమప్రమాణమని పాలకులు ఎప్పటికైనా గుర్తిస్తారా?


ఉద్వేగం మాత్రమే చాలదు – విజ్ఞానం కావాలి!

తెలుగు రాష్ట్రాల్లో నివసిస్తున్న తెలుగుభాషా జాతి పరిస్థితి గడ్డుగా మారింది. సామాజిక–ఆర్థిక పరిస్థితి అధ్వాన్నంగా మారడం, ఉపాధికోసం ప్రవాసాన్ని ప్రధాన పథంగా ఏర్పరచుకున్న తెలుగు జాతియ యువతరం దాదాపు రెండు దశాబ్దాలకు పైగా రాష్ట్రాంత రాలకు, ఖండాతరాలకు వలసలబాట పట్టింది. ప్రపంచీకరణ నేపథ్యంలో స్థానిక వృత్తులు ధ్వంసమై సాఫ్ట్ వేర్, వైద్య రంగాలు వేగంగా వృద్ధిచెందడం, అందుకు అనువైన కార్పొరేట్ సంస్థల్లోను, విదేశాల్లోనూ ఉపాధి కొరకు వలసలు ముమ్మరమైనాయి. ఈ సామా జిక నేపథ్యంలో తెలుగు స్థానంలో ఆంగ్లం ఉపాధి భాషగా మారడం సహజం. ఈ పోటీని ఆసరా చేసుకొని ప్రైవేట్ ఆంగ్లమాధ్యమం స్కూళ్లు వేలం వెర్రిగా సరైన ప్రమాణాలు లేకుండా, నాసిరకం నైపుణ్యాలు గల సిబ్బందితో రాష్ట్రమంతా వెలిసాయి. ఉపాధి హామీ కొరకు ఆంగ్ల మాధ్యమ విద్య ఒక సాధక మంత్రంగా మారింది. తెలుగు భాషాజాతి సాధించిన స్థానిక విజ్ఞానం పునాదిగా సాగే వృత్తులు, ఉపాధిమార్గాలు ఆవిరవడంతో తెలుగు వ్యవహారిక భాష (సహజ భాష) స్థాయికే పరిమితమై, వివిధ సామాజిక / విజ్ఞాన శాస్త్రాల అభివృద్ధి క్రమంలో రూపొందవలసిన కృత్రిమ తెలుగు భాషా ప్రవాహం పూర్తిగా స్తంభించి పోయింది. సొంత వైజ్ఞానిక, పారిశ్రామిక అభివృద్ధి పథం కుప్పకూలిపోయి సామ్రాజ్యవాద అభివృద్ధి నమూనా పైనే ఆధారపడడంతో భాషాభివృద్ధిలో కీలక భూమిక పోషించే కృత్రిమభాష (విజ్ఞాన శాస్త్రాల పరిభాషలు) అంతరించడంతో తెలుగు సహజభాష అభివృద్ధిక్రమం ఉపాధి భాషగా మారిన ఇంగ్లీషు ప్రభా

తెలుగులో రాయలేని, రాయని అధికార్లను నిలదీయండి

వంతో ఉదాసీనంగా మారింది. దాంతో శతాబ్దాలుగా తెలుగు ప్రజలు సాధించిన స్థానిక విజ్ఞానం నిరర్థకంగా మారింది. పర్యవసానంగా కోట్ల మంది తెలుగు భాషా జాతీయులున్నప్పటికీ త్వరలో తెలుగు అంతరించిపోయే ప్రమాదం పొంచి ఉంది. ఈ విధ్వంసక క్రమానికి ఆజ్యం పోసే అభివృద్ధి చెందిన పాశ్చాత్య దేశాల ప్రయోజనాలను నెరవేర్చే జాత్యహంకార అహేతుక విద్యా (భాషా) విధానాన్నే వర్ధమాన/బడుగు దేశాల పాలకులు విచక్షణారహితంగా అమలు చేస్తున్నారు.

పాశ్చాత్య దేశాల ప్రయోజనాలకనుగుణమైన 'సముచిత వ్యవధి' విధానం అమలులో భాగంగా ప్రాథమిక విద్యనుంచి ఇంగ్లీషు మాధ్యమాన్ని తెలుగు పాలకులు ప్రవేశపెడుతున్నారు. ఉపాధి విద్య పేరుతో ఇంగ్లీషును ప్రోత్సహిస్తూ తెలుగును నిర్లక్ష్యంచేయడం అర్థరహితం. ప్రపంచ వ్యాప్తంగా గూగుల్ సహా అనేక వ్యాపార, వాణిజ్య సంస్థలు తెలుగుసహా స్థానిక ప్రజలు మాట్లాడే భాషలోనే కార్యకలాపాలు నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో తెలుగు పాలకులు మాతృభాషను ఉపాధి భాషగా తీర్చిదిద్దడంలో పూర్తిగా విఫలమయ్యారు. ఇంగ్లీషుభాష నేర్చుకోవడం ద్వారా ఉపాధి పొందే వారి సంఖ్య కంటే స్థానిక వనరుల (స్థానిక భాష కూడా) నుంచి ఉపాధి పొందే వారే అధికంగా ఉన్నపుడు, తెలుగును ఉపాధి భాషగా కాక, ఇంగ్లీషుకు ఆ స్థాయిని కట్టబెట్టి ప్రచారం చేయడం అర్థరహితం. ఆర్థిక, సామాజిక స్వీయాభివృద్ధిపై ఆధారపడే ఏదైనా ఒక భాషా జాతి అభివృద్ధి ఆధారపడి ఉంటుంది. అలాకాక కార్పొరేట్ సంస్థలకు, అభివృద్ధి చెందిన దేశాల ఆర్థిక వ్యవస్థలకు కొనసాగింపు ఆర్థిక వ్యవస్థలుగా కొనసాగుతున్నంతకాలం స్వీయాభివృద్ధి ఉండదు. స్వీయ వైజ్ఞానిక, శాస్త్ర సాంకేతిక రంగాల పురోగతికి సమాంతరంగా, సమతుల్యంగా సాగే వ్యవసాయ, పారిశ్రామికాభివృద్ధులపై ఆధారపడి ఒకభాషా జాతి సహజ, కృత్రిమ భాష వికాసం ఉంటుంది. ఉపాధి కోసం కార్పొరేట్ శక్తులకు, రాజ్యాలకు, పరభాషకు ఆత్మలను అమ్ముకొని, తమ అస్తిత్వానికి దూరం కావలసిన అగత్యం తెలుగుజాతికి ఉండదు. ఇంగ్లాండ్, అమెరికా తదితర ఆంగ్లో శాక్సన్ దేశాలు మినహా మరే అభివృద్ధి చెందిన పారిశ్రామిక భాషా జాతి అయినా తమ సొంత భాషలోనే ప్రాథమిక విద్య నుంచి శాస్త్ర సాంకేతిక పరిశోధనల స్థాయి వరకు సకల వైజ్ఞానిక కార్యకలాపాలను నిర్వహించుకునే భాషా సంపదను కలిగి ఉంది. ఈ నేపథ్యంలో భాషాజాతిని నిలబెట్టుకోవడం, అభివృద్ధి చేసుకోవడం అంటే భాషను నిలబెట్టుకోవడం, అందుకు తగిన డిమాండ్లను వల్లెవేయడంలో లేదు. తెలుగు భాషాజాతి సామాజిక, ఆర్థిక, రాజకీయ స్వీయాభివృద్ధి క్రమంతోనే తెలుగు భాష వికాసం ముడిపడి ఉంది. తెలుగు భాషా జాతి చారిత్రక అనుభవంలో సమీకృతమైన స్థానిక విజ్ఞానం, స్థానిక నైపుణ్యాలు, స్థానిక భాషా సంపద సుస్థిరమయ్యే, విశ్వజనీనమయ్యే ఎజెండాతో, ఆదానప్రదానాల పునాదిగా పరస్పర అంతర్భాగీకరణ (మ్యూచువల్ ఇన్ కార్పొరేషన్) లక్ష్యంతో సాగే భౌతికవాద తెలుగు భాషోద్యమం తక్షణావసరం. భాషోద్యమానికి ఉద్వేగం మాత్రమే చాలదు–విజ్ఞానం కావాలి!



రమేష్ పట్నాయక్
7901286396

కస్తూరి రంగన్ సంఘం నివేదిక-భాషావిధానం

కస్తూరి రంగన్ సంఘం నివేదికను నివేదిక కర్తలు 'ముసాయిదా జాతీయ విద్యావిధానం 2019' అని పేరు పెట్టినా అది నిజానికి ముసాయిదా విధానం కాదు. అది ఒక నివేదిక. దీనిపై ఆధారపడి ప్రభుత్వం ఒక ముసాయిదా విధానాన్ని తయారు చేసి పార్లమెంటుకు సమర్పించవచ్చు. పార్లమెంటులో ఆమోదం పొందితే అది విధానం అవుతుంది. విధాన పత్రం 15 పేజీలకు మించి ఉండదు. ఇది నివేదిక కాబట్టి అనేక వివరాలతో 484 పేజీలు ఉంది. నాలుగు భాగాలుగా ఉన్న ఈ నివేదికలో మొదటి అధ్యాయం అయిన పాఠశాల విద్యలో భాషల బోధన మరియు బోధనాభాష గురించిన విషయాలు ఉన్నాయి. కాగా నాలుగవ అధ్యాయంలో భారతీయ భాషల అభివృద్ధి మరియు విస్తరణల గురించి ఉంది. అయితే నివేదికలో ఉన్న సిఫారసులు పరస్పర పొందికలో ఉన్నట్లు కనిపించవు. ఇంకా ప్రధానంగా పరస్పర విరుద్ధ దృక్పథాలు కనిపిస్తాయి. అయితే ఈ వ్యాసంలో ఈ సమస్యలన్నింటినీ పూర్తిగా వివరించలేకపోవచ్చు. కొన్ని ప్రాథమిక విషయాలను మాత్రం పరిశీలిద్దాం.

బోధనా మాధ్యమం

చర్చను సహజంగానే బోధనా మాధ్యమంతో ప్రారంభించాలి. నివేదిక ప్రాంతాయ భాషలో బోధన గురించేకాదు, ఇంటిభాషలో బోధన గురించి కూడా మాట్లాడింది. ఆంగ్ల భాషా మాధ్యమాన్ని నిరసించింది. అయితే ఆ మాట మీద చివరికంటూ నిలబడలేదు. విభజిత పూర్వ ఆంధ్రప్రదేశు ఉదాహరణగా తీసుకుంటే తెలుగు ఉర్దూలే కాక సరిహద్దు జిల్లాలలో ఒడియా, తమిళ్, కన్నడ మరియు మరాఠీ భాషలు బోధనా మాధ్యమంగా ఉండేవి. అయితే ఇప్పుడు ఉభయ తెలుగు రాష్ట్రాలలో సర్వత్రా ఆంగ్లమాధ్యమం కమ్ముకువస్తున్న విషయం అందరికీ తెలిసిందే. ఇక అనేక షెడ్యూలు ప్రాంతాలలో గిరిజన భాషలు ఉన్నాయి. వారికి తెలుగు, ఒరియా, తమిళం వంటి భాషలు కూడా పరాయి భాషలే. వారి మాతృభాషలు వారికి ఉన్నాయి. పూర్వ ప్రాథమిక విద్యలో తప్పనిసరిగా, అవసరమైతే ఒకటి మరియు రెండు తరగతులలో కూడా వారికి తమ భాషలోనే బోధన అందించాలి. సూత్రప్రాయంగా ఈ విషయాలను నివేదిక ఆమోదించింది. కాని నివేదిక చేసిన ఇతర ప్రతిపాదనలు విద్యార్థిపై మరియు అభ్యసన బోధనా ప్రక్రియపై పెద్ద ఒత్తిడిని కలిగించి కొద్దిపాటిగా ఉన్న మంచి ప్రతిపాదనల అమలుకు అవకాశం లేకుండా చేస్తాయన్న విషయం మనం త్వరలోనే గమనిస్తాం. ఇక మూడవ తరగతికి వచ్చే నుంచి అందరూ రాజ్యాంగంలో గుర్తించిన హిందీ, ఉర్దూ మరియు తెలుగు వంటి 22 భాషలకు మారవలసిందే. అంటే మూడవ తరగతి సరికి బాలలందరికీ వారి ప్రాంతంలో ఉన్న ఒక ఆధునిక భాషలో చదవనూ వ్రాయనూ వచ్చి ఉండాలి. నివేదికలో ఈ ప్రతిపాదన స్పష్టంగానే ఉంది. ప్రాంతంలో ఉన్న ఆధునిక భాషనే నివేదిక మాతృభాష లేక ప్రాంతీయ భాషగా ప్రస్తావించింది. మూడవ తరగతి నుంచి మాతృభాష అంటే ఆ ప్రాంతంలో ఉన్న ఒకానొక ఆధునిక భారతీయ భాష అని భావించవచ్చు. అయితే మాతృభాషా (ప్రాంతీయ భాష) మాధ్యమాన్ని ఐదవ తరగతి వరకు వీలయితే (వీలుకానిదెక్కడో) 8వ తరగతి వరకు అమలు చేయాలని నివేదిక ప్రతిపాదించింది. ఆ పైతరగుతులలో మరియు ఉన్నత విద్యలో మాధ్యమం గురించి నేరుగా వ్రాసినట్లు లేదు. 9వ తరగతి నుంచి ప్రాంతీయ భాష మాధ్యమాన్ని కొనసాగించినా సైన్స్ సబ్జెక్టులలో ఆంగ్ల పదాలను సమాంతరంగా వాడాలని ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనలో ఉన్నత విద్యకు ప్రాంతీయభాషలు (రాజ్యాంగంలో షెడ్యూలు ఎనిమిదిలో పేర్కొన్న భాషలు) పనికి రావనే భావన అంతర్లీనంగా ఉంది. అత్యున్నత స్థాయివరకు, అన్ని శాస్త్రాలలో మాతృభాషా మాధ్యమాన్ని అమలు చేయాలని ఎక్కడా వ్రాయలేదు. ఒకవైపు భారతీయ భాషలను ఎంతగానో కొనియాడుతూనే, భారతీయ భాషలు శాస్త్రీయమైనవని, సంపద్వంతమైనవని, భావ వ్యక్తీకరణలో అత్యున్నతమైనవని చెప్తూనే ఆపైన మాతృభాషను అనుసరించిన దేశాలు ఏ విధంగా అభివృద్ధిచెందాయో సోదాహరణంగా వివరిస్తూనే అన్ని స్థాయిలలో మాతృభాషా మాధ్యమాన్ని ప్రతిపాదించడానికి నివేదిక వెనుకాడింది. సెకండరీ విద్యలో ప్రధానంగా విజ్ఞాన శాస్త్రాలలో ఆంగ్ల పదాలను సమాంతరంగా వాడమని నివేదిక చెప్పినందున సెకండరీ విద్యను కూడా మాతృభాషా (ప్రాంతీయ భాష) మాధ్యమంలో కొనసాగించాలని చెప్పినట్లే. అయితే కనీసం 8వ తరగతి వరకు అని చెప్పి ఉండడం వలన నివేదిక అభిప్రాయం ఏమిటో గ్రహించడంలో గందరగోళం ఏర్పడింది. ఇక ఆంగ్లాన్ని ఒక భాషగా మంచి ప్రమాణాలతో నేర్పాలని నివేదిక స్పష్టంగానే చెప్పింది. 12వ తరగతి వరకు మాతృభాషా మాధ్యమాన్ని కొనసాగించి, విజ్ఞాన శాస్త్రాలలో ఆంగ్ల పదాలను సమాంతరంగా ఉపయోగించి, ఆంగ్లాన్ని ఒక భాషగా అందరికీ మంచి ప్రమాణాలతో నేర్పిస్తే ఉన్నత విద్యలో ఆంగ్ల మాధ్యమానికి మారవలసి ఉన్నా పెద్ద సమస్య ఏమీ ఉండదు. నివేదికను ఈ విధంగా అర్థం చేసుకునే అవకాశం కూడా ఉంది. అయితే ప్రభుత్వం వారు ఐదవ తరగతి వరకే నివేదిక మాతృభాషా మాధ్యమాన్ని సిఫారసు చేసిందని భావిస్తే కాదనగలిగేది లేదు. నివేదికలో ఉన్న అస్పష్టత ఇందుకు కారణం.

బోధించ వలసిన భాషలు

పాఠశాలలో బోధించవలసిన భాషల విషయంలో నివేదిక చేసిన ప్రతిపాదనలను పరిశీలిద్దాం. ప్రతివిద్యార్థి మాతృభాష (ప్రాంతీయ భాష) మరియు ఇంగిషుతో పాటు హిందీని తప్పనిసరిగా నేర్చుకోవాలని, హిందీ ప్రాంతం వారు మరొక భారతీయ భాషను నేర్చుకోవాలని త్రిభాషా సూత్రాన్ని అన్ని రాష్ట్రాలు తప్పక పాటించాలని నివేదిక ప్రతిపాదించింది. దక్షిణాది రాష్ట్రాలనుంచి వ్యతిరేకత

రావడంతో ఆ భాగాన్ని ప్రభుత్వం నివేదిక నుంచి తొలగించింది. అంతేకాదు, ఈ నివేదిక ప్రతిపాదించిన త్రిభాషా విధానంలో హిందీ ప్రాంతంలో హిందీ మరియు ఇంగ్లీషు భాషలతోపాటు మరొక భారతీయ భాషను నేర్చుకోవాలని ఆ విధంగా దేశప్రజల మధ్య ఐక్యత మరియు దేశసమగ్రత అభివృద్ధిచెందుతాయని ముందుగా వ్రాసి తరువాత ఆ మూడవ భాష సంస్కృతంగా కూడా ఉండవచ్చని వ్రాసారు. సంస్కృతాన్ని దేశంలో ఏప్రాంత ప్రజలు మాట్లాడుతున్నారు? హిందీ వారు ఏదేని దక్షిణాది భాషనో లేక ఈశాన్య రాష్ట్రాల భాషలో నేర్చుకుంటే దేశ ప్రజల మధ్య ఐక్యత మరియు దేశ సమగ్రత సాధ్యం అవుతాయేమోగాని సంస్కృతం నేర్చుకోవడంవల్ల అటువంటి ప్రయోజనం ఎంతమాత్రం నెరవేరదు. సంస్కృతాన్ని ఏదో ఒక విధంగా ముందు పెట్టడం ఈ నివేదిక పొడువునా మనకు కనిపిస్తుంది.

భాషా సమస్య సహజంగానే క్లిష్టమైన సమస్య. పాలక వర్గాలు అనుసరించే ఆధిపత్య వాదం వలన ఈ సమస్య మరింత జటిలమవుతుంది. రామాయణాన్ని సాధారణ ప్రజల భాష(హిందీ)లో రచించినందుకు ఆనాటి బ్రాహ్మణ పండిత సమాజం తులసీదాసును బహిష్కరించిందట. అలాగే ఖురాన్‌ను ఉర్దూలోనికి తర్జుమాచేసిన రచయిత కూడా సంఘబహిష్కరణకు గురయ్యాడు. అందుకే భయపడి కావచ్చు నన్నయ భారతాన్ని తెలిగించినప్పుడు దానిని సంస్కృతమయం చేసాడు. సంస్కృతం ఇతర భాషల అభివృద్ధిని చరిత్ర పొడవునా అడ్డుకుంది. ఈ విషయాలను చెప్పకుండా సంస్కృతం భారతీయ భాషల అభివృద్ధికి ఎంతగానో దోహద పడిందని, ఇప్పుడు కూడా భారతీయ భాషల అభివృద్ధికి సంస్కృతం ఎంతో సహకరించగలదని, సంస్కృతాన్ని ఒక ఐచ్ఛికభాషగా ప్రతిపాఠశాల కాంప్లెక్స్‌లో అందుబాటులో ఉంచాలని నివేదిక ప్రతిపాదించడం ఆశ్చర్యకరం. ఒకప్పుడు అనేక రాజ్యాలలో దీర్ఘకాలంపాటు సంస్కృతం రాజభాష. ఆ కారణంగా ఆనాడు అభివృద్ధిచెందిన విజ్ఞాన శాస్త్రాలు మరియు పాలక వర్గాల సాహిత్యం సంస్కృత భాషలో ఉన్నమాట వాస్తవమే. ఈ దేశంలో ఆనాడు నాగరికత ఏ స్థాయికి అభివృద్ధిచెందిందో తెలుసుకోవడానికి అందుబాటులో ఉన్న సంస్కృత గ్రంధాలను అధ్యయనం చేయాలి. ఆనాటి శాస్త్రాలలో భౌతికవాదం మరియు భావవాదం కలగలిసి ఉండేవి. వాటిని భావవాదం నుంచి, మత దృక్పథం నుంచి విముక్తిచేసి అధ్యయనం చేయాలి. ఆ పని ఈ సరికే వివిధ దేశాల, వివిధ విశ్వవిద్యాలయాలశాస్త్రవేత్తలు, చరిత్రకారులు చేపట్టారు. అటువంటి కృషిని ప్రోత్సహిస్తే ఎంతో ప్రయోజనం ఉంటుంది. అంతేగాని సంస్కృతజ్ఞానానికి నిధి అని దానిని పునరుద్ధరించాలని, విమానాలు మరియు ప్లాస్టిక్ సర్జరీలు ఆనాడే ఉన్నాయని అంటే మన పరిశోధన అజ్ఞానపు లోతులను మాత్రమే చూడగలుగుతుంది. మరొక విషయం, చరిత్రగతినే మార్చివేసిన సంస్కృత రచనలను భాషా బోధనలోనేగాక వివిధ శాస్త్రాల బోధనలో కూడా ప్రవేశపెట్టాలని నివేదిక సిఫారసు చేసింది. ఇది ప్రకృతి మరియు సామాజిక శాస్త్రాలను మూఢ నమ్మకాలతో నింపడానికి దారితీయవచ్చు. ఇక ఆచరణాత్మక సమస్యలకు వస్తే, పాఠశాల బాలలపై సంస్కృతం రుద్దడం వలన వారు తమకు అవసరమైన భాషలు, గణితం, ప్రకృతి మరియు సామాజిక శాస్త్రాలు నేర్చుకోలేక పోతారు. ఈ నివేదిక మరొక విభాగంలో 6-8 తరగతులలో బాలలు 'భాషా వినోదం' పేరుతో వివిధ భాషల మధ్య ఉన్న సంబంధాలను అధ్యయనం చేయాలని, వివిధ భాషలలో ఉన్న సాహిత్యంతో పరిచయం ఏర్పాటు చేసుకోవాలని, వివిధ భాషలలో కొన్ని ప్రాథమిక సంభాషణలు నేర్చుకోవాలని అందుకు అనుగుణంగా పాఠ్య ప్రణాళిక రూపొందించాలని సిఫారసు చేసింది. ఒక తెలుగు ఉపాధ్యాయుడికి వివిధ భాషలతో పరిచయం ఉండి తన తరగతి బోధనలో భాగంగా వివిధ భాషల మధ్య ఉన్న సంబంధాన్ని పోలికలను, వ్యత్యాసాలను, వాటిలో వెలువడిన ఉన్నత సాహిత్యాన్ని ప్రస్తావించి భాషల పైన విద్యార్థులలో మక్కువ కలిగించడం వేరు, దానిని మూడు సంవత్సరాల పాటు ఒక పాఠ్యాంశంగా పెట్టడం వేరు. ఈ నివేదిక విద్యార్థి, ఉపాధ్యాయుడు మరియు పాఠశాలకు ఉండగల పరిమితులపై దృష్టిపెట్టినట్లు లేదు. పాఠశాల విద్యకు భాషారంగంలో చాలా అసాధ్యమైన లక్ష్యాలను ఈ నివేదిక నిర్దేశించింది.

మరొక విషయం, సెకండరీ విద్యలో (ప్రకృతి మరియు సామాజిక శాస్త్రాలలో ఏదో ఒకదానిని విడిచిపెట్టి దాని స్థానంలో) ఒక భారతీయ భాషను గాని లేదా ఒక విదేశీ భాషనుగాని పాఠ్యాంశంగా ఎంచుకునే వీలు ఉండాలని నివేదిక సూచించింది. ప్రతి పాఠశాల కాంప్లెక్స్లో ఆ ప్రాంతాన్ని బట్టి తప్పని సరిగా బోధించే మూడు భాషలతో పాటు మరొక భారతీయ భాష బోధించడానికి ఒక ఉపాధ్యాయుడిని అదనంగా నియమించాలని నివేదిక సూచించింది. ఈ ప్రతిపాదన 9వ తరగతి నుంచి కాక, 11వ తరగతి నుంచి అమలు చేస్తే ప్రయోజనకరంగా ఉండవచ్చు. ఆంధ్రప్రదేశ్ లో ఒకప్పుడు ఆ విధంగా ఇంటర్ స్థాయిలో ఒక భాషను ఎంపిక పాఠ్యాంశంగా తీసుకోవడం ఉండింది. ఇప్పుడు కూడా ఆచరణలో లేక పోయినా అటువంటి అవకాశం ఉందనుకుంటాను. 11వ తరగతిలో కాకుండా 9వ తరగతిలోనే ఎంపిక పాఠ్యాంశాల పద్ధతి (ఎలెక్టివ్ సబ్జెక్ట్ పద్ధతి) ప్రవేశ పెడితే పాఠశాల విద్య ప్రయోజనం దెబ్బతినే అవకాశం ఉంది. 10వ తరగతి వరకు అవసరమైన భాషలు (ఇంటి భాష, ప్రాంతీయ భాష మరియు ఆంగ్లం), గణితం, ప్రకృతి సామాజిక శాస్త్రాలు ఒక స్థాయిలో అధ్యయనం చేయడం అవసరమని, అనంతరం మాత్రమే స్పెషలైజేషన్ ప్రవేశపెట్టడం సరియైనదనే భావన ఉంది. ఆ విషయాలను ఈ వ్యాస పరిమితిలో మనం చర్చించలేము. అనేక భాషలు బోధించాలనే ప్రయత్నం అవసరమైన భాషల బోధనకు నష్టం కలిగించవచ్చు..

ఫౌండేషన్ కోర్సు (3-8 వయోపరిమితి) లోనే మూడు భాషల అభ్యసనాన్ని ప్రవేశపెట్టాలని నివేదిక చేసిన ప్రతిపాదన వీటన్నింటి కంటే ప్రధానమైన చర్చనీయాంశం. బాలలకు 3 - 8 వయోపరిమితో ఎక్కువ భాషలు నేర్చుకునే సామర్థ్యం ఉంటుందనే ప్రాతిపదికన ఈ ప్రతిపాదన చేయబడింది. బాలల భాషా సామర్థ్యం వారున్న ప్రాంతంపై ఆధారపడుతుందన్న వాస్తవాన్ని నివేదిక

గ్రహించలేదని అనిపిస్తుంది. బాలల సహజ వికాసానికి అవకాశాలు కలిగించడమే బోధనా విధానంగా వికాస విద్యావనం అనే పాఠశాలను మూడున్నర దశాబ్దాలుగా నిర్వహిస్తున్న డాక్టర్ యస్. ఆర్. పరిమి గారు పరాయిభాష నేర్పడంలో ఉన్న సమస్యలను ఈ మధ్యనే ఒక ఉపన్యాసంలో చెప్పారు. సారాంశంగా 'బాలలకు బాల్యంలో ఎక్కువ భాషలు నేర్చుకునే సామర్థ్యం ఉంటుంది, కాని అందుకవసరమైన వాతావరణాన్ని సరిగ్గా చెప్పాలంటే భాషావరణాన్ని పాఠశాలలో కల్పించడం సులభంకాదు, బాలలు ఉన్న కుటుంబాలలో, ఇరుగు పొరుగు (నైయిబరుహుడ్)లో బహుభాషా వాతావరణం ఉన్నా, పాఠశాలలో వివిధ భాషల బాలలు చదువుకుంటున్నా అది కొంత సులభం అవుతుంది. అంతే తప్ప ఉపాధ్యాయుడు లేదా బడి అట్టి వాతావరణాన్ని ప్రత్యేకంగా కలిగించడం కష్టమని, ఆయన వివరించారు. ఒక్క మాటలో చెప్పాలంటే అవసరమైన భాషావరణం లేకుండా ఒక భాషను నేర్పడం సులభం కాదని చెప్పవచ్చు. మాతృభాష అని మనం చెప్పేదే నిజానికి ఇంటిభాష కాదు. అందుకే పాఠ్య పుస్తకాలు ప్రతి జిల్లాలో మాండలికాలలో వ్రాయాలని వివిధ భాషారంగ మరియు విద్యారంగ ఉద్యమ సంఘాలు డిమాండు చేస్తూ వచ్చాయి. ఇక గిరిజనుల విషయంలో వారి ఇంటిభాష మరియు పాఠశాలలో ఉపయోగిస్తున్న ప్రాంతీయ భాష పూర్తిగా వేరు. భాషా సమస్యల వలన బాలలు మధ్యలో బడిమానివేస్తున్నారని కూడా నివేదిక అంగీకరించింది. వారి ఇంటిభాష నుంచి లేదా మాతృభాషనుంచి వారు ప్రాంతీయ భాషకు మారడానికి అవసరమైన ప్రయాస అటు బాలలకు, ఇటు ఉపాధ్యాయునికి తప్పదు. ఆ పైన ఆంగ్లాన్ని నేర్చు కోవాలి. ఇంతకు మించి మరిన్ని భాషలు బాలలపై రుద్దడం ఎంత మాత్రం సరికాదు. నిజానికి భారత దేశం అనేక భాషలు మాట్లాడే అనేక జాతుల సమాఖ్య. హిందీ జాతీయ భాష అనే వాదన సరియైనది కాదు. హిందీని రుద్దాలనుకుంటే అది ఐక్యత విచ్ఛిన్నతకు దారి తీస్తుంది. విద్య, ఉద్యోగం మరియు వ్యాపారం వంటి కారణాల వలన వ్యక్తులు ఒక రాష్ట్రం నుండి మరొక రాష్ట్రానికి మారుతూ ఉంటారు. వారు సహజంగానే ఆ క్రొత్త ప్రాంతంలో భాషను అనతి కాలంలో నేర్చుకుంటారు. అందుకు గరిష్టంగా ఆరు మాసాలు చాలు. అందు కొరకు బాలలపై ఒత్తిడి పెంచవలసిన అవసరం లేదు. అయితే రెండవ తరగతి నాటికే బాలలకు కనీసం మూడు భాషలు పరిచయం కావాలని, ఆయా భాషలలో అక్షర మాలలను వారు గుర్తు పట్టాలని, ప్రాంతీయ భాషలో వ్రాయడం వరకు నేర్చుకోవాలని మిగిలిన భాషలలో సరళ పదాలు చదవగలగాలని నివేదిక సిఫారసు చేసింది. ఎనిమిది సంవత్సరాల లోపు ఈడు గల బాలలకు ఇంత భారమైన పాఠ్య ప్రణాళిక అవసరమా? పూర్వప్రాథమిక విద్యలో ఇంటి భాషలో వ్యవహరించి, 1,2,3 తరగతులలో ప్రాంతీయ భాషలో వినడం, మాట్లాడం, చదవడం మరియు వ్రాయడం బాగా అలవరచి, మాతృభాష (ప్రాంతీయ భాష) బాగా వచ్చిన తరువాత 4వ తరగతి నుంచి ఆంగ్లాన్ని నేర్పిస్తే ఇంటర్ పూర్తిచేసే సరికి వారికి ఆంగ్లం కూడా బాగా వస్తుంది. ఇంటర్లో ఇతర భారతీయ భాషలను ఎలెక్టివ్ సబ్జక్టా నిర్వహిస్తే సరిపోతుంది. బాలలకు సామాజిక శాస్త్రాలు మరియు ప్రకృతి శాస్త్రాలు నేర్చుకోవడానికి మరియు ఆటలు, పాటలు, కథలు, సంగీతం, ఇతర కళలు నేర్చుకోవడానికి, పనివిద్యలో, ఆరోగ్య విద్యలో, పర్యావరణ విద్యలో పాల్గొనడానికి పాఠశాలలో సమయం ఉండాలి కదా!

దేశంలో భాషా బోధన చాలా దీనావస్థలో ఉందని, ఈ పరిస్థితి మారాలని, దేశవ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు భాషల అభివృద్ధికి కృషి చేయాలని, అందుకొరకు భాషా శాఖలను మంచి ప్రమాణాలతో నిర్వహించడమేగాక, భాషా అధ్యయనాన్ని విస్తరించాలని, రాజ్యాంగం అనుబంధంలో పొందుపరచిన 22 భాషల విషయంలోనే గాక గిరిజన భాషల అభివృద్ధికి విశ్వవిద్యాలయాలు శ్రద్ధతో పనిచేయాలని, సైగ భాషల అభివృద్ధికి ప్రత్యేకమైన చర్యలు తీసుకోవాలని, వివిధ భారతీయ భాషలు బోధించడానికి అవసరమైన ఉపాధ్యాయులను పెద్ద ఎత్తున విశ్వవిద్యాలయాలు ఉత్పత్తి చేయాలని, మంచి ప్రమాణాలు గల ఉపాధ్యాయులను ఉత్పత్తి చేయాలని, ప్రతిపాదిత నాలుగు సంవత్సరాల బి.ఇడి కోర్సును భాషా బోధన ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధిచేయాలని, ప్రతి రాష్ట్రంలో ఆ ప్రాంత భాష మాత్రమే కాక ఇతర భాషలు బోధించే ఉపాధ్యాయులు అందు బాటులో ఉండాలని, అవసరమైతే వివిధ రాష్ట్రాల మధ్య అందుకు అవసరమైన ఒప్పందాలు జరగాలని, దేశవ్యాప్తంగా పాఠశాలలలో మరియు విశ్వవిద్యాలయాలలో భాషా బోధన ఉపాధ్యాయ ఉద్యోగాలు విరివిగా కల్పించాలని, భాష నేర్చుకోవడం ద్వారా ఉద్యోగాలు సంపాదించవచ్చు అనే నమ్మకం విద్యార్థులలో కలగాలని, వివిధ భాషల గ్రంథాలయాలు అభివృద్ధిచేయాలని, అన్ని భాషలలో ఉన్న మంచి సాహిత్యాన్ని ఇతర భాషలలోనికి తర్జుమా చేయాలని, అందుకు ఇండియన్ ట్రాన్స్లేషన్ మరియు ఇంటర్ ప్రెటేషన్ సంస్థ (ఐ.ఐ.టి.ఐ) బృహత్తర కృషి జరపాలని, దానికి అవసరమైన నిధులను ప్రభుత్వాలు విస్తారంగా అందించాలని అలాగే శాస్త్ర సాంకేతిక పదజాల సంఘం (సి.యస్.యస్.టి) తన కృషిని సామాజిక మరియు మానవీయ రంగాలకు కూడా విస్తరించాలని నివేదిక పేర్కొంది. ఐ.ఐ.టి.ఐ మరియు సి.యస్.యస్.టి ల లక్ష్య ప్రకటనలపైగాని లేదా వాటి పనివిధానం గురించిగాని నివేదిక ఎటువంటి మూల్యాంకనం చేయలేదు. నివేదిక వాటిపై ఉంచిన బాధ్యతలను శాస్త్రీయంగానూ మరియు సమర్థవంతంగానూ అమలుచేయడానికి వాటిని ప్రక్షాళనచేయవలసి రావచ్చు, పునర్వ్యవస్థీకరించవలసి రావచ్చు. ఇదంతా బాగానే ఉంది. నివేదిక ఆంగ్లంపై పెరుగుతున్న మోజు మరియు దానికి సమాజంలో ఉన్న ఃపై తరగతుల వార్ని తెలిసీ తెలియక ప్రాపకాన్ని కల్పించడం, ఆంగ్లం రావడమే గొప్ప అనే భావన సమాజంలో ఏర్పడడం భారతీయ భాషలకు చాలా కీడు కలిగిస్తుందని నివేదిక పేర్కొంది. సమాజంలో పై పొరలలో ఉన్న వారిని విమర్శించడం బాగానే ఉందిగాని, అసలు నేరం ప్రభుత్వానిది కదా! రాజుల కాలంలో సంస్కృతం, ఆంగ్లేయుల కాలంలో ఆంగ్లం ఈదేశంలో భాషలను అణచివేశాయి. ఆంగ్ల ఆధిపత్యం

భాష నశిస్తే జాతి నశిస్తుంది, వాడని భాష వాడిపోతుంది

(తరువాయి 45 వ పుటలో)


స్థానంలో సంస్కృత ఆధిపత్యాన్ని తిరిగి ప్రవేశ పెట్టడం వలన ప్రయోజనం ఏమీ ఉండదు కదా. ఆంగ్లం ఈ నాడు ఒక అవసరమైన భాష. ఈ విషయాన్ని నివేదిక కూడా గుర్తించింది. 4వ తరగతి నుంచి 12 వ తరగతి వరకు ఆంగ్లాన్ని ఒక భాషగా సమర్ధవంతంగా బోధిస్తే, ఉన్నత విద్యలో ఆంగ్ల సాహిత్యాన్ని పరిచయం చేస్తే అందరికీ ఆంగ్లం వస్తుంది, ఆంగ్లం వచ్చిన వారి ఆధిపత్యం పోతుంది. స్థాయిలో ఒక సంవత్సరం కాలం స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు నిర్వహిస్తే, ఆ సమస్య పరిష్కారమవుతుంది. ఇక పౌర సమాజంలో ఆంగ్లం ఆధిపత్యాన్ని తొలగించడానికి అవసరమైన చర్యలు నివేదిక సిఫారసు చేయలేదనే చెప్పవచ్చు. ప్రభుత్వ కార్యకలాపాలు, న్యాయస్థానాల కార్యకలాపాలు, చట్ట సభల కార్యకలాపాలు ఆయా రాష్ట్రాల ప్రాంతీయ భాషలలోనే (ఆంధ్రప్రదేశ్లో తెలుగు మరియు ఉర్దూ) జరిగితే ఆంగ్ల ఆధిపత్యం పోతుంది. ఇంకా ప్రధానంగా ప్రభుత్వ ఉద్యోగ నియామక పోటీ పరీక్షలలో మరియు కేంద్రీయ విద్యా సంస్థల ప్రవేశ పరీక్షలలో ప్రాంతీయ భాషలను ప్రవేశ పెడితే ఆంగ్ల ఆధిపత్యాన్ని నియంత్రించవచ్చు. అయితే ఇటువంటి ప్రతిపాదనలేవీ నివేదికలో లేవు. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే భారతీయ ఆధునిక భాషల విషయంలో ఆశయ ప్రకటనలు ఎంత గంభీరంగా ఉన్నాయో కార్యరూపానికి చెందిన సూచనలు అంత పేలవంగా ఉన్నాయి.

రచయిత కన్వీనర్, ఆంధ్రప్రదేశ్ విద్యాపరిరక్షణ కమిటి

వోకల్ అనే ప్రశ్నోత్తరాల ఆప్ లో తెలుగుకూ స్థానం

వోకల్ అనే ప్రశ్నోత్తరాల ఆప్ లో తెలుగుకూ స్థానం వలగూడుల్లో ప్రశ్నోత్తరాల వలగూడులకు ఈ రోజుల్లో ఆదరణ బాగా ఉంది. వాటిలో ఎవరైనా ఏదైనాఅ ప్రశ్న అడగగానే, తెలిసిన మరెవరో వచ్చి సమాధానం ఇస్తారు. ఇలా సామాజిక సంభాషణలు జరుగుతున్నాయి ఈ రోజుల్లో. ఆ కోవకు చెందిన ఆప్ లలో కోరా బాగా ప్రసిద్ధి చెందింది. కేవలం ప్రోగ్రామింగ్, కంప్యూటర్ సమస్యలు అంశంగా మొదలైన స్టాక్ఎక్స్‌చేంజ్ ప్రస్తుతం అంగ్ల సాహిత్యం నుండి, హిందూ మతం, ద్రావిడ భాషలు, అందానికి చిట్కాలు ఇలా అన్ని రంగాలాపై ప్రశ్నోత్తరాల ఆప్ ను తయారు చేసింది. అలా ఈ మధ్యనే మరో భారతీయ ఆప్ ప్లే స్టోర్ లోకి వచ్చింది. అదే వొకల్. తెలుగు లోనే ప్రశ్నలు అడిగి, ఆ ప్రశ్నకు సమాధానం పాఠ్యం రూపంలో లేదా వీడియో రూపంలో పొందవచ్చు. వోకల్ అని ప్లేస్టోర్‌లో శోధించి ఈ ఆప్ ను మీ ఫోనులో స్థాపించవచ్చు.

– ర. షే



నూర్‌బాషా రహంతుల్లా
6301493266

ఇంగ్లీషుతో పాటు హిందీని కూడా మొయ్యాలా ?

తెలుగుమీడియం మానిపించి స్కూళ్ళలో యింగ్లీషుమీడియం ప్రవేశపెట్టిన రాష్ట్ర ప్రభుత్వానికి తెలుగు బరువు వదిలిందనుకుంటే త్రిభాషాసూత్రం పేరుతో హిందీబరువు అదనంగా మెడకు తగులు కోటానికి కాచుకొని ఉంది. మాతృభాష నేర్చుకోటానికి నోచకపోయినా సరే భారతీయులు అందరూ హిందీని తప్పనిసరిగా నేర్వాల్సిందే అంటూ ఉత్తరాది కేంద్రం దక్షిణాది పిల్లలపై అదనపు భారం మోప టానికి పదేపదే ప్రయత్నిస్తోంది. తమ సొంత సమస్యల్లో తలమునకలై ఉన్న హిందీయేతర రాష్ట్రాలపై కేంద్రం హిందీ బాణాలు వదులుతూ మిగతా భాషలు చచ్చాయా లేదా అని అప్పుడప్పుడు పరీక్షిస్తుంది. ఇంగ్లీషు దెబ్బకు ఇప్పటికే అనేక భాషలు వడలిపోయాయి. శక్తిహీనమైన భారతీయ భాషలమీద హిందీ కూడా తన ప్రతాపం చూపిస్తోంది.

1632 భాషలున్న మన దేశంలో లక్ష మందికి పైగా మాట్లాడే భాషలు 33 ఉన్నాయి. 60 శాతమంది హిందీయేతర భాషలు మాట్లాడుతున్నారు. మిగిలిన 40 శాతంమంది బ్రజ్‌భాష, ఛత్తీస్‌గఢీ, హర్యాన్వీ వంటి 49 రకాల హిందీ యాసలు మాట్లాడుతారు.

భాషా ప్రాతిపదిక మీద జాతులవిభజన అనే సూత్రాన్ని మన దేశం సోవియట్ నుండే స్వీకరించింది. అక్కడ రష్యన్ భాషా రుద్దుడు ఎలాంటి ఫలితాన్ని తెచ్చిందో ఇక్కడ హిందీని బలవంతంగా రుద్దడం కూడా అలాంటి ఫలితాన్నే తెస్తుంది. రష్యాలోని వివిధ భాషల పట్ల అవలంబించిన వివక్ష బలవంతంగా రష్యన్ భాషను ఇతర భాషల వారిపై రుద్దడం వంటి పనులవల్ల, జాతీయ మైనారిటీలను స్టాలిన్ ఛిన్నాభిన్నం చేసినందువల్ల ఎక్కువ హాని జరిగిందని భారత కమ్యూ నిస్టు పార్టీ ప్రధానకార్యదర్శి శ్రీ చంద్ర రాజేశ్వరరావు పేర్కొన్నారు. సోవియట్ యూనియన్‌లో 15 యూనియన్ రిపబ్లిక్కులు, 20 స్వయం ప్రతిపత్తిగల రిపబ్లిక్కులు, 8 స్వయంపాలిత ప్రాంతాలు ఉన్నాయి. 130 భాషలున్నాయి. వందకుపైగా జాతులున్నాయి. 1917 అక్టోబర్ విప్లవంలో ఈ జాతులు విడిపోయి స్వతంత్ర రాజ్యాలను ఏర్పాటు చేసుకునే హక్కును లెనిన్ ప్రసాదించాడు. భాషాప్రాతిపదిక మీద జాతులవిభజన సూత్రాన్ని మనదేశం సోవియట్ యూనియన్ నుండే స్వీకరించింది. నేటివరకు హిందీని బలవంతంగా రుద్దడం కొనసాగు తూనే ఉంది. రేడియో, టీవీ, ప్రభుత్వ ఆఫీసుల్లో హిందీ ఆధిపత్యం సాగుతోంది. హిందీయేతర రాష్ట్రాల వాళ్ళు తమకు హిందీ వచ్చినా రాకపోయినా హిందీ వార్తలు వినాలి,హిందీ సినిమాలు సీరియళ్ళు చూడాలి. వినోదసాధనాలతో ఈ నిర్బంధం ఆగలేదు. మన తెలుగు రాష్ట్రాలలో కూడా బ్యాంకుల్లో, పోస్టాఫీసుల్లో ఫారాలు,ఎల్లైసీ పత్రాలు హిందీలో వస్తున్నాయి. ఉత్తరాదిన కొంత ప్రాంతానికి పరిమితమైన హిందీభాషను జాతీయభాషగా చేయదలుస్తున్నారు. దేశంలోని మిగతా భాషలకు కేంద్రం నుండి ప్రోత్సాహం కొరవడింది. సోవియట్‌లో రష్యన్‌భాష పట్ల పెల్లుబికిన అసంతృప్తి మన దేశంలో హిందీ పట్ల కూడా పెల్లుబుకుతుంది. కేంద్రం దీన్ని గమనించి మసలుకోవాలి.

కస్తూరిరంగన్ కమిటీ హిందీ పక్షపాతం

హిందీయేతర రాష్ట్రాల్లో సైతం హిందీని కచ్చితంగా బోధిం చాలని కస్తూరిరంగన్ కమిటీ సిఫార్సు చేసిందట. త్రిభాషా సూత్రాన్ని అమలుచేయాలని సూచించిందట. ఇది హిందీయేతర రాష్ట్రాలపై బలవంతంగా హిందీని రుద్దడమేనంటూ తమిళనాడు, పశ్చిమబెంగాల్, కర్ణాటక, కేరళ ఎదురుతిరిగితే ఇది ముసాయిదా నివేదిక మాత్రమే నని, ఏ రాష్ట్రంపైనా బలవంతంగా హిందీని రుద్దబోమని కేంద్రం ప్రకటించింది.

1937లో సి. రాజగోపాలాచారి మద్రాసులో హిందీని తప్పని సరి సబ్జెక్టుగా ప్రవేశపెడితే నిరసనలు చెలరేగి నటరాజన్, థలము త్తులు జైల్లోనే మరణించారు. అప్పుడు హిందీ తప్పనిసరి కాదని ఉత్తర్వును 1940లో ప్రభుత్వం 21న ఉపసంహరించుకుంది. హిందీ ని అన్ని పాఠశాలల్లో తప్పనిసరి చేయడానికి మళ్లీ ప్రయత్నాలు జర గటం, నిరసనలు చెలరేగాక ఉత్తర్వులు ఉపసంహరించుకోవటం మళ్ళీ మళ్ళీ జరుగుతున్నాయి.

రాజ్యాంగం ప్రకారం దేశంలో మాట్లాడే ఏ భాషకూ జాతీయ హోదా లేదు. దేవనాగరి లిపిలో ఉన్న హిందీ, ఇంగ్లీషు భాషలకు మాత్రమే ఆ అవకాశం ఉంది. తమ అధికారిక భాషను నిర్ణయించు కునే అధికారం ఆయా రాష్ట్రాలకే ఉంది. 22 షెడ్యూల్డ్ భాషల్ని అభివృద్ధి చేసే బాధ్యత కేంద్రంపై ఉంది. కానీ కేంద్రం ఎప్పుడైనా హిందీకితప్ప మరోభాషకు సహాయపడిందా?

దక్షిణాది వారి ఆందోళన

దేశానికి తమ హిందీ భాషే జాతీయ భాష కావాలని ఉత్తరాది నేతలు నిరంతరం కోరుకుంటున్నారు. అప్పట్లో శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి హిందీ భాషా పెత్తనాన్ని ప్రశ్నిస్తూనే ఉండేవారు. ఎన్‌జీ రంగా, వెంకయ్యనాయుడు వంటి నేతలు ప్రతిఘటిస్తూనే ఉన్నారు. జన ఘోషకు స్పందించాల్సిన సర్కారీ యంత్రాంగం జన భాషకు పట్టం కట్టాల్సిందేనంటూ పట్టుపట్టిన ఎన్టీఆర్, దస్త్రం తెలుగులో రూపొంది స్తేనే సంతకం చేస్తానన్నాడు. ఫైలు తెలుగులో తెస్తేనే సంతకం పెట్టాడు. యదారాజా తథా ప్రజా అన్నట్లు అధికారులు తెలుగులో ఫైళ్ళను పరుగులెత్తించారు. తెలుగులోనే తీర్పులు వచ్చేలా గ్రామ న్యాయాలయాలను నెలకొల్పుతానన్నారు. ప్రజలు ఎంతగానో సంతో షించారు. ఇలాంటి నాయకులున్నప్పుడు స్థానికభాషలు క్షేమంగా వర్ధిల్లుతాయి.

ఉత్తరాది ఆధిపత్యాన్ని దక్షిణాదిపై చెలాయించడానికే హిందీని రుద్దుతున్నారనేది దక్షిణాది వారి ఆందోళన. సంస్కృతం నుంచి ఉత్తరాది భాషలు పుట్టగా, దక్షిణాది భాషలు స్వతంత్రంగా అభివృద్ధి అయ్యాయి. మూలవాసులు ద్రావిడులు, మధ్య ఆసియా నుంచి ఉత్తరాదిలోకి ప్రవేశించిన ఆర్యులు దక్షిణాదికి వలస వచ్చారు. ఉత్తర,

దక్షిణ భారతాల విభజన జరగాలి. దక్షిణ భారత హిందీ ప్రచార సభ ప్రధానకార్యాలయం చెన్నైలోనే ఉంది. హిందీ ప్రభావంవల్ల ద్రవిడభాషల ఉనికి ప్రమాదంలో పడుతోంది. త్రిభాషాసూత్రమే పిల్లలపై అదనపు బరువు. మూడోభాష తాము ఇష్టమొచ్చింది నేర్చుకోవాలనేదీ మోసపూరితమే, అది దొడ్డిదారిన హిందీని తోయడమే. అందుకే తమిళనాడు దశాబ్దాలుగా ద్విభాషా సూత్రాన్నే అమలు చేస్తోంది.

మాతృభాషలోనే విజ్ఞాన బీజాలు

బాలల్లో మాతృభాషలోనే విజ్ఞాన బీజాలు నాటాలి. కానీ కస్తూరి రంగన్ కమిటీ మరో రెండు భాషల్నీ బోధించాలంటూ పిల్లలపై అదనపు బరువుమోపింది. హిందీ మాట్లాడే రాష్ట్రాల్లో ఇంగ్లిషుతోపాటు ఆధునిక భారతీయ భాషల్లో ఒకదాన్ని ఎంచుకోవాలట. హిందీయేతర రాష్ట్రాల్లోనైతే స్థానిక భాషతోపాటు హిందీ ఆంగ్లం బోధన సాగాలట. త్రిభాషా సూత్రంపేరిట హిందీని బలవంతంగా రుద్దే ఎత్తుగడ కదా ఇది? మాతృభాషతోపాటు జీవన నైపుణ్యాల మెరుగుదలకు ఆంగ్లం నేర్పితే సరిపోదా? మధ్యలో ఈ హిందీ ఎందుకు? మన పిల్లలకు తెలుగే సరిగా రాదు, ఇంకా ఈ భాషల అదనపు బారమా ?ఆలోచన వికసించేదశలో తనభాష తనకు రాకుండా పసి మనసును పరాయి భాషలకు వశం చేయటం ప్రభుత్వాల పాపమే.

ఇంగ్లీషే జాతీయ భాష అన్నాయి కోర్టులు

సుప్రీం కోర్టులో చెలామణి అయ్యేదే జాతీయ భాష. ఆస్థాయి హిందీకి మాత్రమే కట్టబెడదామని ఉత్తరాది వాళ్ళ ప్రయత్నం. విద్యాలయాల్లో హిందీని ప్రవేశపెట్టగలిగారుగానీ న్యాయస్థానాల్లోకి హిందీని తీసుకురావటంలో సఫలం కాలేకపోయారు. అందుకే మామూలు జనానికి హిందీ నేర్పుదామని బయలుదేరారు. ఇక్కడ ఎవరి భాషను వాళ్ళు తమ ప్రాంతంలోనే ప్రాభవంలోకి తెచ్చుకోలేక నానా తంటాలు పడుతుంటే మూడోభాష బరువునూ మోయటానికి ఒప్పుకుంటారా? భిన్నత్వంలో ఏకత్వ భావన, జాతి సమైక్యత, భాషాపర సఖ్యతల కోసం 1968లో త్రిభాషా సూత్రం తెచ్చారు. హిందీ రాష్ట్రాలు మాత్రం ఆంగ్లంతోపాటు మరో భారతీయ భాష ను నేర్పకుండా సంస్కృతాన్ని ఎంచుకున్నాయి. త్రిభాషా సూత్రం పనికిరాకుండా పోయింది.మూడు భాషల మోత కంటే జాతీయ భాషగా ఇంగ్లిషునే చేసి నేర్చుకోవటం నయం కదా అంటూ భారతీయ జాతీయనాయకులు సైతం ఇంగ్లిషు వైపే మొగ్గారు. రాజ్యాంగమే ఇంగ్లిషులో రాశారు.హిందీ భాషా నేతలు విశ్వప్రయత్నం చేసినా అక్కడి హైకోర్టులు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఆభాషను న్యాయస్థానాల గడప దగ్గరే ఆపేశారు. అందరూ ఇంగ్లీష్ అభిమానులే.

లిపి మార్చటమే కుదరదన్నవారికీ ఇంకో భాషా?

వత్తుల, గుణింతాల బెడదలేని ఆంగ్లలిపి పిల్లలు అందరికీ దగ్గర అయ్యింది. తమిళలిపి కూడా ఇంచుమించు అలాంటిదే.వేటూరి ప్రభాకరశాస్త్రి లాగా తెలుగు లిపిని పిల్లలకు అక్షరాలను సులభతరం చేస్తూ సంస్కరించటానికి ఎవరూ పూనుకోలేదు. శ్రీశ్రీ కోరినట్లు ఇంగ్లీషు అక్షరాలను తెలుగుకోసం వాడుకునే అవకాశమూ ఇవ్వలేదు.జనమే ఆపనికి శ్రీకారం చుట్టారు. తెలుగును రోమన్ లిపిలో రాస్తున్నారు. కోర్టుల్లో న్యాయవాదులకు న్యాయమూర్తులకు ఈ లిపిని వాడుకొనే స్వేచ్ఛ ఇచ్చినా తెలుగు నిలబడేది. భాషమారటం కంటే లిపి మారటం కొంత నయం. భారతీయ భాషలన్నీ ఆంగ్లలిపిలో అర్థం కాకపోయినా కనీసం చదువవచ్చు.

ఇంగ్లీషు తప్ప మరేభాషా హైకోర్టుల్లో వద్దన్నారు

హైకోర్టులో తమిళం వినియోగంపై చేసిన విన్నపాన్ని కేంద్రం తిరస్కరించిందని, మద్రాసు హైకోర్టులో తమిళాన్ని అధికార భాషగా వినియోగించేందుకు అనుమతించాలని తమిళనాడు శాసనసభ పంపిన తీర్మానాన్ని పునఃపరిశీలించాలని ఏఐఏడీఎంకే ఎంపీ శశికళ పుష్ప కేంద్రప్రభుత్వాన్ని కోరారు.దానిపై స్పందిస్తూ స్థానిక భాషలను హైకోర్టుల్లో అధికార భాషగా ఉపయోగించడం ఆదర్శవంతంగా ఉంటుందని రాజ్యసభ ఛైర్మన్ ఎం.వెంకయ్యానాయుడు అభిప్రాయపడ్డారు. అయితే అందుకు విస్తృతస్థాయిలో ఏకాభిప్రాయం అవసరమని వ్యాఖ్యానించారు.

2008లో హిందీ నేతలు రాజ్యాంగంలోని ఆర్టికిల్ 248ని సవరించి హైకోర్టు,సుప్రీంకోర్టుల్లో హిందీ తీర్పులు తేవాలని ప్రతిపాదించారు. లాకమీషన్ దేశవ్యాప్తంగా నిష్ణాతులైన న్యాయమూర్తుల్ని సంప్రదించి ఇంగ్లీషులోతప్ప హిందీలోగానీ ఇంకా ఏ ఇతర భారతీయ భాషలలోగానీ వాదనలు తీర్పులు కుదరవని ఏకగ్రీవంగా తీర్మానించింది. అందుకు లాకమీషన్ చెప్పిన కారణాలు :

"భాష దేశప్రజల భావోద్వేగాలను ప్రభావితం చేస్తుంది. భాష ప్రజలను ఐక్యపరుస్తుంది. ఎవరిమీదా ఏ భాషనూ బలవంతంగా రుద్దకూడదు. ఉన్నతన్యాయస్థానాలలోని వాదనలు తీర్పులు మామూలుగా జరిగేది ఆంగ్లభాషలోనే. భారతీయ న్యాయవ్యవస్థ ఇంగ్లీషుకు అమెరికా న్యాయ పుస్తకాలకు అలవాటుపడింది. కాబట్టి ఉన్నత న్యాయమూర్తుల్ని ఇంగ్లీషుకే స్వేచ్ఛగా వదిలేయ్యాలి. ఒక రాష్ట్ర హైకోర్టు జడ్జి మరోప్రాంతానికి బదిలీపై వెళితే ఆరాష్ట్రభాష నేర్చుకొని ఆ భాషలో తీర్పులివ్వాల్సి వస్తుంది. అది చాలాకష్టం. జడ్జీలమీద అనేక భాషల భారం మోపకూడదు. వాళ్ళమీద ఏ భాషనూ రుద్దకుండా జడ్జీలను వాళ్ళ భాషకు వాళ్ళను స్వేచ్ఛగా వదిలేయ్యాలి. దేశప్రజలందరూ తప్పక సర్వోన్నత న్యాయస్థానం తీర్పులిచ్చే ఏకైక భాష అయిన ఇంగ్లీషును అర్థం చేసుకోక తప్పదు. అన్నీ కోర్టుల్లో ఇంగ్లీషే ఉంటే వివిధ భాషా ప్రాంతాలమధ్య న్యాయవాదుల కదలిక సులభం అవుతుంది. కోర్టుల్లో హిందీ అమలు కోసం కావాల్సిన చట్టపరమయిన నియమాలు నిబంధనలుమాత్రం ముందు ఇంగ్లీషులోనే చెయ్యాలి. దానికి అధి కారపూర్వకమైన అనువాదం చేసుకోవచ్చు. ఉన్నత న్యాయస్థానాలను మాత్రం ఇప్పుడున్న పరిస్థితుల్లో ఆంగ్ల భాషను మార్చుకోమని అడగవద్దు".

ఇలాంటి పరిస్థితుల్లో తెలుగు తీర్పులు ఆశించగలమా?

రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి

సంస్కృతాన్ని అడ్డుపెట్టి తెలుగు కాంతినాపలేరు

లాంటి పెద్దలంతా కక్షిదారుల భాషలోనే హై కోర్టుల్లో కూడా వాద నలూ తీర్పులు ఉండాలని చెబుతున్నారు కదా అన్న ధైర్యంతో 2017 లో రాజధాని ప్రాంత భూసమీకరణ కేసులో తెలుగులో ప్రతివాదన తయారుచేసి తీసికెళితే హైకోర్టు ప్రభుత్వ న్యాయవాది దానిని తీసుకోటానికే తిరస్కరించారు. ఎంత సవివరంగా రాసినా తెలుగులో రాస్తే హైకోర్టులో మీ వాదన చెల్లదు అన్నారు. తెలుగులో ప్రతి వాదనా? అదీ హైకోర్టుకు ఎలా తెచ్చారు? అంటూ తెచ్చినందుకు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇంగ్లీషులో వాదించలేని నేను డిప్యూటీ కలక్టర్ పదవికి తగనని ఎగతాళి చేశారు. చివరికి నాతెలుగు ప్రతి వాదాన్ని ఇంగ్లీషులోకి మార్చి ఇస్తేనే తీసుకున్నారు. హైకోర్టు స్థాయికి తెలుగుభాష ఇంకా వెళ్ళలేదు. మనము మన మాతృభాషలను వదిలి ఆంగ్లానికి దాసోహమవటానికి సగం కారణం కోర్టులు, కోర్టులిచ్చే ఆంగ్ల తీర్పులే. ఇంగ్లీషు రాని వాళ్ళెవరూ కోర్టుల్లో పనికిరాని పరిస్తితి దాపురించింది.

దేశానికి ఆంగ్లమే దిక్కు అంటున్న న్యాయమూర్తులు కల్పించే ఇలాంటి అడ్డంకుల్ని అధిగమించి ప్రజల భాషలలో న్యాయస్థానాలు నడిచేలా చేయాలి. హైకోర్టుల్లో ప్రాంతీయ భాషలలో వాదనలు వినిపించేలా న్యాయవ్యవస్థతో సంప్రదింపులు లేకుండా కేంద్రమే ఓ నిర్ణయం తీసుకునేందుకు తగినన్ని అధికారాలను రాజ్యాంగం కల్పించిందని పార్లమెంటరీ సంఘం పేర్కొంది కాబట్టి ఇప్పటికైనా కేంద్రం ప్రాంతీయ భాషలు బ్రతకడం కోసం తనకున్న రాజ్యాంగ అధికారాలు వినియోగించుకోవాలి. ప్రాంతీయ భాషలలో తీర్పులు ఇవ్వాలని చట్టం చెయ్యాలి. న్యాయవ్యవస్థ హిందీగానీ, మరే భారతీయ భాషగానీ తనదరిదాపుల్లోకి రాకుండా తనను తాను కాపాడుకుంది. మిగతా సామాన్య జనంమీద మూడు భాషలభారం మోపుతుంటే న్యాయ వ్యవస్థ మౌనం గా ఉంది.

జాతీయ భాష హిందీ కాదు ఇంగ్లీషే

జాతీయ అనుసంధాన భాషగా హిందీ ఎప్పటికీ కాలేదని దశాబ్దాల చరిత్రే చాటుతోంది. దక్షిణ భారతంలోని కేంద్ర కార్యాలయాలలో 'హిందీవారం', "రాత కోతలన్నీ హిందీలోనే" అనే కార్యక్రమాలు విఫలమయ్యాయి. ఇది గ్రహించకుండా దేశవ్యాప్తంగా అన్ని స్కూళ్లలో హిందీని నిర్బంధంగా బోధించాలని చూడటం హిందీ పాలకుల కుటిల పన్నాగాన్ని తెలియజేస్తోంది. ఉత్తరప్రదేశ్ విద్యా సంస్థల్లో బోధన భాషగా ఆంగ్లాన్ని రద్దు చేసేసిన ములాయంసింగ్, ప్రభుత్వ వ్యవహారాల్లో ఉత్తర ప్రత్యుత్తరాల్లో హిందీనే వినియోగించాలంటూ 1990లో ముఖ్యమంత్రిగా ఆదేశించారు. అది హిందీ రాష్ట్రం గనుక సరిపోయింది. అలాంటిపని మన తెలుగు రాష్ట్రాల్లో కూడా చెయ్యమని అడిగే వాళ్ళూలేరు, అమలుచేసే వారూ లేరు. 'మీరు హిందీలో ఉత్తరంరాస్తే మేము తెలుగులో బదులిస్తా' మని కరుణానిధి లాగా కేంద్రాన్ని హెచ్చరించే నాయకులూ లేరు. తమిళనాట మైలు రాళ్లపై ఉన్న హిందీ అక్షరాలను చెరిపేసి తమిళంలో రాసినట్లు తెలుగువాళ్ళు రాయలేరు. ఆంధ్రులు అంత సౌమ్యులు. మరో భారాన్ని మోపినా ఆనందంగా మోస్తారు.

తెలుగునాట మూడో భాష కావాలా?

కేంద్రప్రభుత్వ ఉద్యోగ నియామక పోటీపరీక్షల్లో హిందీ ప్రశ్న పత్రం తప్పనిసరిగా ఉండాలన్న ప్రతిపాదనను వైఎస్ రాజశేఖర రెడ్డి వ్యతిరేకించారు. వాటిని అమల్లోకితెస్తే హిందీభాషా ప్రాంతాల అభ్యర్థులు మాత్రమే లబ్ధిపొందుతారని, హిందీయేతర రాష్ట్రాలవారు నష్టపోతారన్నారు. ప్రజలు ఏదేశంలో నివసించినా వారిభాషలో, భాషతోనే బ్రతుకుతారు. భాషపోతే ప్రాణం పోయినట్లు ఉంటుంది. ఏభాషా ప్రాంతంవారైనా మరోభాష పెత్తనాన్ని సహించలేరు. భాష అధికారానికీ, ఆధిపత్యానికీ చిహ్నం. ఆ అధికారం మరోభాషకు ఇవ్వరు. తమ భాషాసంస్కృతులను ఆభాష నాశనం చేస్తుందని భయ పడతారు. తమ భాషను కించపరుస్తున్నారనేది ఒక కారణాంకదా తెలంగాణ విడిపోవటానికి? తమ భాషపైనా, మాండలికంపైనా, సంస్కృతిపైనా ప్రజలకుండే మక్కువ అలాంటిది. పార్లమెంటరీ కమిటీ చేసిన సిఫార్సులు సలహాలే కానీ ఆదేశాలు కానప్పుడు విద్యాలయాల్లో హిందీని తప్పనిసరి చేయడంఏమిటి? హిందీని తప్పనిసరి చేస్తే ఇతర భాషల ప్రజలు నష్టపోరా? హిందీ నేర్చుకుతీరాలని ఇతరులపై ఒత్తిడి తీసుకు రావడం, హిందీ వస్తేనే ఉద్యోగం, హిందీలో రాణిస్తేనే పదోన్నతి, అంటే ఇతర భాషల వాళ్ళు సహిస్తారా? అసలు హిందీ వాళ్ళు ఎప్పుడైనా మరో భారతీయభాష నేర్చుకున్నారా? ఇతర భాషలను వాటి మానాన వాటిని ఎదగనిచ్చారా? హిందీ ప్రాంతాలలోకి ఇతర భాషల జనం ఉద్యోగాలకోసం వలసలు పోయేలా చేశారు. దేశమంతా హిందీ వాళ్ళ వాణిజ్యం, వినోదం అల్లుకుపోయాయి. హిందీ చలన చిత్రాలు, టెలివిజన్ సీరియల్స్, హిందీభాషను వ్యాప్తి చేశాయి. మరే భారతీయభాషకూ ఈ అవకాశం లేదు.

ఉత్తరాది నాయకులకు హిందీ రాజభాషగాచేసి మిగతా భాషా ప్రాంతాలనూ ఏలాలన్న దురాశ,ఆదుర్దా మాత్రమే ఉన్నాయి. హిందీ జాతీయ భాషకాదు. 22 అధికార భాషల్లో అదొకటి మాత్రమే. 1965 కల్లా ఇంగ్లిష్ స్థానంలోకి హిందీని తేవాలనే లక్ష్యం ఎప్పటికీ నెరవేరదు. దేశమంటే మట్టి కాదు దేశమంటే మనుషులు. అనేక భాషల మనుషులు. అనేక మతాల మనుషులు. వారి సంస్కృతులు వేరు. వారి సంప్రదాయాలు వేరు. వారి మాటలను, పలుకుబడిని, భాషను, యాసను గౌరవించడం అవసరం. అధికారం వచ్చిందికదా అని ఒక్క భాషకే అన్నీ అవకాశాలూ కట్టబెడుతూ పెత్తందారీ శాసనాలు చేస్తే ఇతర భాషల ప్రజలు ఎదురు తిరగరా?

ఇప్పటి దాకా ఇంగ్లీషు మీడియం కాన్వెంట్లతో పోటీ పడలేక తెలుగు పాఠశాలలు తెలుగు ప్రజలు, ప్రభుత్వాల దయవల్ల ఇంగ్లీషు పాఠశాలలుగా క్రమేణా రూపాంతరం చెందాయి. ఇక ఇప్పుడు హిందీ పాఠశాలలుగా కూడా వాటిని మార్చాలి. ఆవులు ఆవులు పోట్లాడుకొని లేగల కాళ్ళు విరగదొక్కినట్లుగా మారుతోంది పరిస్తితి. సుప్రీంకోర్టు ఈ భాషాసమస్యను మరో దేశవిభజనలాంటి పెద్దసమస్య కాకముందే తనంతటతానుగా తీసుకొని పరిష్కరించాలి.

రచయిత విశ్రాంత స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలక్టర్

భాష లేకపోతే భావంలేదు;నీ భావాల్ని నీ భాషలో చెప్పడమే సరైనది

ఆకునూరి మురళి, ఐ.ఎ.ఎస్

ప్రైవేట్‌స్కూళ్ళను రద్దు చేయటమే పరిష్కారం!?

నాణ్యమైన విద్య అందాలంటే దేశంలో ప్రైవేట్ పాఠశాలలను పూర్తిగా రద్దు చేయడం ఒక్కటే పరిష్కార మార్గంగా కనపడుతుంది. అప్పుడు ముఖ్యమంత్రుల పిల్లలు, మనుమలూ మనుమరాళ్ళు, అధికారుల పిల్లలు, ధనవంతుల పిల్లలు, పేద వారి పిల్లలు అందరినీ ప్రభుత్వ బడిలో మాత్రమే చదివించాల్సి వుంటుంది. దాంతో బడుల పని విధానం, సౌకర్యాలు, విద్య నాణ్యత అన్నీ మెరుగవుతాయి. మండలానికి ఆరు నుండి పది పాఠశాలలు పెట్టి మిగతా చిన్న గ్రామాలకు రవాణా వ్యవస్థ ఏర్పాటు చేయడం ద్వారా పాఠశాలల సంఖ్య తక్కువై, సౌకర్యాలు మెరుగై విద్యాప్రమాణాలను పెంపొందుతాయి.

భారత రాజ్యాంగంలో పేర్కొన్నట్టు ప్రభుత్వమే అందరికీ నాణ్యమైన విద్యను అందించాలి. ఏ దేశంలో అయినా పేదరికం పోయిందంటే, బాగా అభివృద్ధి జరిగిందంటే దానికి పునాది పాఠశాల విద్య, కాలేజి విద్య, విశ్వవిద్యాలయ విద్య అనేది చారిత్రక సత్యం. కానీ మన దేశంలో ప్రభుత్వ పెద్దలు, రాజకీయ నాయకులు, కాంట్రాక్టులకిచ్చే ప్రాజెక్టు పనుల మీద ఉన్నంత శ్రద్ధ పిల్లలకు నాణ్యత కల్గిన చదువు చెప్పించడం మీద పెట్టలేకపోతున్నారు. సివిల్ ఇంజనీరింగ్ ప్రాజెక్టులు, రియల్ ఎస్టేట్ లావాదేవీలు ఎన్నికలకు అవసరమైన డబ్బు సమకూరుస్తాయి. సర్కారు బడుల మీద పెట్టే పెట్టుబడులు డబ్బులు రాల్చవు కదా! అందుకే రాజకీయ నాయకులకు విద్య మీద సమయం వెచ్చించడం శుద్ధ దండగ అనిపిస్తుంది. అయితే, రాజకీయ చిత్తశుద్ధి ఉంటే అందరికీ నాణ్యమైన విద్య అందించడం మనకు అసాధ్యమేమీ కాదు. ఎలానో చూద్దాం. నేను కలెక్టర్‌గా పని చేసిన ఒక జిల్లాలో ప్రైవేట్ విద్య, ప్రభుత్వ విద్య ఎలా ఉందో విశ్లేషించి చెబుతాను. జిల్లాలో వున్న ఒక ప్రైవేట్ బడిలో ప్రతి 38 మంది విద్యార్థులకు ఒక టీచరు వుంటే, ఆ జిల్లాలో ప్రభుత్వ బడులలో ప్రతి 17 మంది విద్యార్థులకు ఒక టీచర్ వున్నారు. ప్రైవేట్ యాజమాన్యం ప్రతీ విద్యార్థిమీద సగటున ప్రతి సంవత్సరం రూ.6,200 ఖర్చు పెట్టి (ప్రైవేట్ యాజమాన్యం తల్లిదండ్రుల నుండి ఎంత మొత్తం రాబడుతున్నది అనేది వేరే విషయం) 86 శాతం విద్యార్థులకు నాణ్యతలో 'ఏ' గ్రేడ్‌లో తీర్చి దిద్దగలిగితే, మన సర్కారు బడులలో ప్రభుత్వం సగటున విద్యార్థికి ప్రతీ సంవత్సరం రూ.35,000- ఖర్చు పెట్టినా 67శాతం విద్యార్థులు 'సీ' గ్రేడు కంటే దాటలేకపోతున్నారు. ప్రైవేట్ యాజమాన్యం ఒక టీచరుకు నెలకు రూ.5,000 -నుండి రూ.20,000 వరకు (సబ్జెక్టును బట్టి) చెల్లిస్తుంటే ప్రభుత్వం నెలకు ఒక టీచరుకు రూ.35000 నుండి రూ.1,20,000వరకు చెల్లిస్తుంది. మరి, లోపం ఎక్కడ వుంది? ప్రభుత్వ పరిపాలనలోనే అని చెప్పక తప్పదు.

ఇదే జిల్లాలలో (వెనకబడిన జిల్లా) ఒక మండలంలో పరిస్థితి విశ్లేషిస్తే నాలుగు పెద్ద గ్రామాలలో వున్న ప్రైవేట్ బడులలో 4500 మంది విద్యార్థులు చదువుతూ ఉంటే అదే మండలంలో 36 గ్రామాలలో వున్న ప్రభుత్వ బడులలో 1400 మంది చదువుతున్నారు. ఆ మండలంలో పేద, మధ్య తరగతి తల్లిదండ్రులు అప్పులు చేసి సంవత్సరానికి ఒక్కొక్క విద్యార్థికి రూ.15,000 నుండి రూ. 30,000 వరకు ఫీజులు కడుతున్నారు. మిగతా మధ్యతరగతి కుటుంబాలు, ఒక మోతాదులో వున్న పెద్ద రైతులు వారి కుటుంబాలను పెద్ద పట్టణాలలో పెట్టి, పిల్లలను ప్రైవేట్ కాన్వెంట్ స్కూళ్లలో చదివించుకుంటున్నారు. 'ప్రభుత్వ బడులలో చదివించాలంటే నామోషీగా అనిపిస్తుంది' అని ఒక గ్రామంలో తల్లిదండ్రులు నాతో అన్నారు. పక్క ఇంటి వాళ్ల పిల్లలు టిప్ టాప్‌గా తయారై టై, బూట్లు వేసుకొని మండల కేంద్రంలోని ప్రైవేట్ బడికి వ్యాన్‌లో పోతుంటే మా పిల్లలను దీనావస్థలోవున్న ఊళ్లోని ప్రభుత్వ బడికి ఎలా పంపించాలని వారు వాపోయారు. ఇటీవలి కాలంలో వాట్సాప్‌లో ఒక 'బొమ్మ' విస్తృతంగా ప్రచారంలోకి వచ్చింది. ప్రైవేట్ బడి భవనం బ్రహ్మాండంగా వుంటుంది కాని ప్రైవేట్ టీచరు ఒక పెంకుటింటిలో నివసిస్తుంటారు. అదే ప్రభుత్వ బడి విషయానికి వస్తే ప్రభుత్వ బడి భవనం అధ్వాన్న స్థితిలో వుంటుంది. కాని ప్రభుత్వ టీచరు ఇల్లు జిల్లా ముఖ్య పట్టణంలో బ్రహ్మాండంగా వుంటుంది.

పరిస్థితిని అర్థం చేసుకోవడానికి చాలా చక్కని ఉదాహరణ అది. మరో సంఘటన- నేను 16 సంవత్సరాల క్రితం చైనాకు వెళ్ళినప్పుడు గ్రామాలలో నాకు కనిపించిన దృశ్యాన్ని ఇక్కడ ప్రస్తావించుకోవాలి. అక్కడ గ్రామంలో ఆధునికమైన భవనంలో ప్రభుత్వ బడులు, ప్రభుత్వం కట్టించిన భవనాలలో టీచర్లు నివాసం వుంటారు. అక్కడి ప్రభుత్వం 1950లలో ప్రాథమిక విద్య మీద పెట్టిన పెట్టుబడి, శ్రద్ధ వల్లనే ఈ రోజు చైనా ప్రపంచంలోనే ఒక అగ్రగామి దేశంగా భాసిల్లుతోంది. 'మీరు ప్రభుత్వ బడులకు మీ పిల్లలను ఎందుకు పంపించరు?' అని నేను చాలా గ్రామాలలో తల్లిదండ్రులను అడిగితే వారు నాకు ఈ విషయాలను చెబుతుండేవారు: ఇంగ్లీషు మీడియం లేద్కు మరుగు దొడ్లు, శుభ్రమైన తాగు నీరు, తరగతి గదిలో ఫర్నీచర్ వంటి కనీస సౌకర్యాలు ఉండవ్కు బోధనలో నాణ్యత వుండదు అన్నారు. అంతేకాదు, ఎల్‌కేజీ, యూకేజీలు లేకపోవడాన్నీ వారు ఎత్తి చూపారు. ఒక ప్రైవేట్ బడి యజమాని ఎవరు అంటే కృష్ణా రెడ్డి అనో, శ్రీనివాస్ రావు అనో (ఉదాహరణకు) ఒక పేరు చెబుతారు. అదే మీ వూరిలో వున్న సర్కార్ బడి యజమాని ఎవరు అంటే ప్రభుత్వం అని చెబుతారు.

ఇక్కడ సమస్యల్లా ఏమిటయ్యా అంటే? అదే కృష్ణా రెడ్డి, శ్రీనివాస్ రావు బడులలో విద్యా నాణ్యతకు సంబంధించి, బడిలోని సౌకర్యాలకు సంబంధించి తీసుకునే చర్యలు మనకు ప్రభుత్వ బడులలో కానరావు. అక్కడ ఉపాధ్యాయులు స్కూలు యజమానులకు జవాబుదారీగా వుంటారు. మరి ప్రభుత్వ బడుల ఉపాధ్యాయులు ఎవరికి జవాబుదారీగా వుంటారు అనేదే పెద్ద ప్రశ్న. కొంత మంది అనొచ్చు వారు ప్రభుత్వానికి జవాబుదారీతనం వహించాలి అని, కానీ ఇక్కడ రెండు

ప్రశ్నలు ఉద్భవిస్తాయి. ఒకటి, విద్యకు సంబంధించినంత వరకు ప్రభుత్వం కనపడని ఒక విచిత్ర వ్యవస్థ. రెండు, ప్రభుత్వానికి ఉపాధ్యాయులు భయపడుతున్నారా? లేక, ఉపాధ్యాయులకు ప్రభుత్వాలు భయపడుతున్నాయా? అన్నది. దీనికి పరిష్కార మార్గంగా తల్లిదండ్రులను సమీకరించి కమిటీగా ఏర్పరచి ఆ కమిటీలను పటిష్ఠ పరిచి వారికి బడి పరిపాలనలో భాగస్వామ్యం కల్పించి ప్రతి తల్లి / తండ్రి ప్రతి విద్యార్థికి సంవత్సరానికి వెయ్యి రూపాయలు (రెండు విడతలలో) స్కూల్ కార్పస్ ఫండ్ కింద కట్టించగల్గితే తల్లిదండ్రులకు ఉపాధ్యాయులను ప్రశ్నించే అధికారం వస్తుంది. విద్య నాణ్యతను సమీక్ష చేసుకునే సామర్థ్యం సహజంగా వస్తుంది. ప్రజల భాగస్వామ్యం లేకపోతే ప్రభుత్వం ఎంత డబ్బు ఖర్చు పెట్టినా ప్రభుత్వ బడులు బాగుపడవు. ప్రభుత్వం ఖర్చు పెట్టే ప్రతీ రూపాయి తల్లిదండ్రుల కమిటీ ద్వారానే ఖర్చు పెట్టించగలిగితే పనుల నాణ్యత, వేగం పెరుగుతుంది. పాత తరంలో ప్రైవేట్ బడులు లేని కాలంలో గ్రామీణ ప్రాంతాలలో ప్రభుత్వ బడులలో నాణ్యత, ఉపాధ్యాయులలో దృఢ సంకల్పం బాగా కనపడేవి. అప్పుడు గ్రామంలోని మోతుబరులు, అక్కడే నివసించే ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు వారి పిల్లలను ప్రభుత్వ బడులలోనే చదివించే వాళ్ళు. వారు శ్రద్ధగా బడిలో జరిగే కార్యక్రమాల నాణ్యతను పరిశీలించేవారు. ఉపాధ్యాయులు జవాబుదారీగా ఉండేవారు. ఇప్పుడు ఏ ప్రభుత్వ ఉద్యోగి (గ్రామ పంచాయితీ కార్యదర్శితో సహా) గ్రామంలో నివసించడం లేదు (అంగన్‌వాడి టీచరు తప్ప). చాలా గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు కూడా నివసించడం లేదు. పెద్ద రైతులు, ప్రజా ప్రతినిధులు వారి కుటుంబాలను పట్టణాలలో పెడుతున్నారు. పేద కుటుంబాలు మాత్రమే వారి పిల్లలను ప్రభుత్వ బడులలో చదివిస్తున్నాయి. వారికి ఉపాధ్యాయులను ప్రశ్నించే సామర్థ్యం గాని, వారి పిల్లలకు సంబంధించి చదువును పరిశీలించే జ్ఞానంగాని లేవు.

అమెరికాలోనూ, యూరప్ దేశాలలోనూ 'స్కూల్ డిస్ట్రిక్ట్' అనే విధానం వుంటుంది. అంటే ఆవాసంలోని పిల్లలందరూ ప్రభుత్వ బడులలో విధిగా చదివించాలి. అక్కడ రెసిడెన్షియల్ స్కూళ్లు చాలా తక్కువగా వుంటాయి. మన ఊరికి దగ్గరలోనే మంచి స్కూల్ ఉన్నట్లయితే దూరంగా వున్న గురుకుల పాఠశాలలకు (ప్రైవేట్ కార్పొరేట్, ప్రభుత్వం.. ఏదైనా కావొచ్చు) పిల్లలను పంపాల్సిన అవసరం వుండదు కదా! నాణ్యమైన విద్యకు ఖరీదైన గురుకుల పాఠశాలలు పరిష్కారమే కాదు. గురుకుల పాఠశాలలో చదివే పిల్లలు వారి బాల్య హక్కులను, తల్లిదండ్రులు పిల్లలతో గడపాల్సిన సంతోష కాలాన్ని కోల్పోతున్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో అన్ని తరగతులకు ఇంగ్లీషు మీడియంను తక్షణమే (10వ తరగతి తెలుగు మీడియం తప్ప) ప్రవేశ పెట్టవలసిన అవసరం ఎంతైనా వుంది. ఇక్కడ చర్చించిన విషయాలను, మన సమాజ పరిస్థితులను, రాజకీయ వ్యవస్థను, కుల వ్యవస్థను పరిశీలిస్తే నాణ్యమైన విద్య అందాలంటే దేశంలో ప్రైవేట్ పాఠశాలలను పూర్తిగా రద్దు చేయడం ఒక్కటే పరిష్కార మార్గంగా కనపడుతుంది.

అప్పుడు ముఖ్యమంత్రుల పిల్లలు, మనుమలు/ మనుమరాళ్ళు మంత్రుల పిల్లలు, అధికారుల పిల్లలు, ధనవంతుల పిల్లలు, పేద వారి పిల్లలు అందరినీ ప్రభుత్వ బడిలో మాత్రమే చదివించాల్సి వుంటుంది. దాంతో బడుల పని విధానం, సౌకర్యాలు, విద్య నాణ్యత అన్నీ మెరుగవుతాయి. మండలానికి ఆరు నుండి పది పాఠశాలలు పెట్టి మిగతా చిన్న గ్రామాలకు రవాణా వ్యవస్థ ఏర్పాటు చేయడం ద్వారా పాఠశాలల సంఖ్య తక్కువై మంచి సౌకర్యాలు, మెరుగైన సమీక్షల ద్వారా విద్య ప్రమాణాలను పెంపొందించుకోవచ్చు. అన్ని కులాల విద్యార్థులు ఒకటే బడికి పోవడం ద్వారా విద్యార్థుల మధ్య సౌభ్రాతృత్వం, సుహృద్భావం ఏర్పడుతుంది. కుల వ్యవస్థ కూడా బలహీన పడటానికి అవకాశం ఏర్పడుతుంది. నాణ్యమైన విద్య అందించే మానవ వనరులు, సాంకేతికత, ఆర్థిక వనరులు మన దగ్గర ముఖ్యంగా మన రాష్ట్రానికి పుష్కలంగా ఉన్నాయి. కావాల్సిందల్లా.. అన్ని వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను ప్రాథమిక హక్కుగా అందించాలి అనే నిబద్ధత ప్రభుత్వాలకు ఉండడమే! ఈ విషయంలో సర్కారు చిత్తశుద్ధి చూపితే రాష్ట్రంలో, దేశంలో పేదరికం లేకుండా చేయొచ్చు. ఒక లౌకిక సమాజాన్ని, బంగారు భారతాన్ని నిర్మించవచ్చు.

కవిత

సహవాసి

సహవాసీ! రమ్మంటూ పిలిచిందొక వనవాసి
కుశలాలడిగి సేదతీర రమ్మంటూ
పిలిచింది నను చూసీ
తన చెలిమి పూల మేని సొగసు
మెరిసింది నీటి తళుకులలో
తన విరుల శ్వాస ఊపిరూది
ఆశ నింపినదీ నా గుండె తలపులలో
సొక్కిన నా మేనంతా సొంతమల్లే గాలి విసిరినది
ఆకు పసరు లేత చిగురు
అధరాలతో ఒళ్ళు నిమిరింది
వేడుకైన వేదనైన నాపై 'పచ్చి' ప్రేమ పోదందీ
ఆమని వేళకు ఆశల చిగురుల వలువలు తొడిగీ
హరిత వర్ణ ప్రౌఢ సొబగులరారుతు అగుపించీ
నిలువెల్లా కనులై నా కొరకై నిరీక్షించే నెచ్చెలివో
నను నిత్యం వర్ధిల్లమని దీవించే హరిత తరుల చలువవో
మల్లెల విరివై వికసించినా,
ఫలాల కల్పవల్లివై మురిపించినా
మన బంధం విడలేనిది
నిను వీడీ మనలేనిది...
సహవాసీ! రమ్మంటూ పిలిచిందొక వనవాసి.
కుశలాలడిగి సేదతీర రమ్మందీ నను చూసి.

వాణీశ్రీనివాస్
9441345651

రహ్మానుద్దీన్ షేక్
94930 35658

అమ్మనుడులు - సైన్స్ అధ్యయనం : చర్చ

10 జూన్ 2010 సంచిక నేచర్ పత్రికలో ఒకవార్త నన్ను ఆకట్టుకుంది. "మీ మాతృభాష ఇంగ్లిష్ కానప్పుడు" అనే శీర్షికతో ప్రచురించిన ఈ వార్తలో విజ్ఞానశాస్త్రంలో పరిశోధనలు చేస్తున్న ఇంగ్లీషేతర మాతృభాష గల విద్యార్థుల కష్టాలను చర్చించారు.

సైన్స్ ప్రపంచవ్యాప్తంగా పరిశోధనాంశంగా ఎందరినో ఆకర్షిస్తున్నా, ఏ భాషలో పరిశోధన చేసినా, చివరాఖరున ఫలితాలను ఆంగ్లంలో వెల్లడించాలి. ఒకే భాషను అందరు పరిశోధకులకు సంపర్క భాషగా ఏర్పాటు చేసుకోవడం సైన్సుకు ఉపకరించినా, సైన్సు విద్యార్థులకు ఇది ఇబ్బంది పరిచే విషయం. ఈ జనవరిలో డ్యూక్ విశ్వవిద్యాలయంలో ఒక ప్రొఫెసర్ గారు తన విద్యార్థుల్లో చైనా విద్యార్థులు మాతృభాషలో సంభాషించడాన్ని తప్పు పట్టి, ఆంగ్లంలోనే మాట్లాడాలని శాసించిందట. ఆమె ఇందుకు సంబంధించి విద్యార్థులకు ఒక ఈమెయిల్ రాస్తూ ఆంగ్లంలో మాట్లాడకపోతే వారికి విద్య-ఉద్యోగ రంగాలలో మంచి అవాకాశాలు దొరకవని, అందుకని ఆంగ్లభాష అలవరుచుకోవాలని, ఆ ప్రొఫెసర్ నిర్వహిస్తున్న తరగతులున్న భవన ఆవరణలో కూడా ఆంగ్లమే సంభాషణ భాషగా ఉండాలని ఆమె చెప్పినట్టు తెలుస్తోంది.

ఈ ఉదంతాన్ని చైనా ప్రభుత్వం నిరసించింది. చైనా విదేశాంగ శాఖ మంత్రి పత్రికాముఖంగా ఈ సంఘటనను ఎండకట్టాడు. ఈ సంఘటన జరిగిన సందర్భంలో నేచర్ పత్రిక ఏడుగురు ప్రొఫెసర్లతో ఆంగ్లావసరాన్ని గురించి ముఖాముఖి జరిపింది.

1. కోర్నెల్ విశ్వవిద్యాలయంలో భౌతికశాస్త్ర ప్రొఫెసర్ గా ఉన్న యాంగ్‌యాంగ్‌చెంగ్ మాట్లాడుతూ, చైనాలో శాస్త్ర సాంకేతికాలు చైనా భాషాలోనే ఉంటాయని, అక్కడ పెద్ద పరిశోధనలు చేసి పిహెచ్‌డీ పట్టా పొందిన వారున్నా, విదేశాలకొచ్చి తమ పరిశోధనలు కొనసాగించడానికి అవసరమైన చిన్నపాటి ఇంగ్లిష్ ప్రవేశపరీక్ష కూడా రాయలేరని ఆమె అన్నారు. ఆంగ్లభాష రాని చైనా విద్యార్థులను చూసి పాశ్చాత్య ప్రొఫెసర్లు ఆ విద్యార్థులకు సైన్స్ రాదనుకుంటారు, కానీ అది అపోహ, ఆంగ్ల జ్ఞానానికి, సైన్స్ లో ప్రతిభకూ సంబంధం లేదు అని ఆవిడ అన్నారు.

ఐతే ఒకసారి ఆంగ్లభాషలో సైన్స్ నేర్చుకోవటం మొదలుపెట్టాక తిరిగి చైనా భాషలో ఆ పరిశోధన మౌలికాంశాలను తను వివరించలేకపోతున్నానని ఆమె అన్నారు. చైనాలో ఇంగ్లిష్ విద్య ఎంతైనా అవసరమని ఆమె అన్నారు. ఐతే ఇంగ్లిష్ నేర్చుకున్నవారు సైన్స్ వైపు రావటం లేదని, దుబాసీలుగా వృత్తి చేపడుతున్నారని ఆమె వాపోయారు.

2. బెంగుళూరులో ఉంటున్న అటవీజీవజాల పరిశోధకురాలు స్నేహ ధర్వాడ్‌కర్ ప్రకారం భారతదేశంలో ఆంగ్లంలో కాకుండా తమ భాషల్లో సైన్స్ నేర్చుకునేవారిని భారతీయ పరిశోధకులు, వైజ్ఞానికులు చులకనగా చూస్తారట. మన దేశ ప్రొఫెసర్లే ఇలా ఉంటే, విదేశాల నుండి వచ్చే ప్రొఫెసర్ల అభిప్రాయాలు ఎలా ఉంటాయి? ముందుగానే భారతీయులు అజ్ఞానులు, చదువబ్బని వారు అని వారనుకుంటారట, కారణం ఇక్కడ వారికి ఫీల్డ్ రీసర్చిలో సహకరించే శాస్త్రజ్ఞులు మాతృభాషలో సంభాషించకపోవడం, వచ్చీరాని ఆంగ్లంలో ప్రాంతీయ పేర్లను మక్కికి మక్కీ తర్జుమా చేసి నవ్వులపాలవ్వడం.

పర్యవసానంగా, ఈ విదేశీ శాస్త్రజ్ఞులు స్వదేశీ శాస్త్రజ్ఞులకు ఒక వారమో రెండు వారాలో అదనపు తర్ఫీదునిచ్చాక పరిశోధన మొదలుపెట్టాల్సి వస్తోందట. సమయాభావం ఉన్నపుడు, ఈ శాస్త్రజ్ఞులు సైన్స్ రాని, ఇంగ్లిష్ వచ్చిన ఎగువ తరగతి వారితో పరిశోధనలు చేసి తూతూ మంత్రంగా కానిచ్చేస్తున్నారట. ఇది సైన్సుకూ చేటు, మన దేశానికి చేటు. అందుకని సైన్స్ పట్ల ఆసక్తి ఉన్నవారిని భాష అనే సాకుతో వెనక్కునెట్టకుండా, అక్కున చేర్చుకుని, వారి సహకారాన్ని పూర్తిగా పొందాలని ఆమె చెప్పారు.

3. డూబ్లిన్ సిటీ విశ్వవిద్యాలయ భాషలు మరియు అంతర్సాంప్రదాయాలపై అధ్యయనం చేస్తున్న వెరా షెర్డియన్ మాట్లాడుతూ, ఆంగ్లం నేర్చుకోవటం ఇతర భాషా విద్యార్థులకు ఒక అదనపు బరువని అన్నారు. రానురానూ అదొక గుదిబండగా మారుతోందని ఆమె అన్నారు. పరిశోధనకు వచ్చే విద్యార్థులు పూర్తిగా సిద్ధమై వచ్చారని ప్రొఫెసర్లు అనుకుంటారు కానీ, ఒక కొత్త సంప్రదాయంలో, వారు అభ్యసించిన భాషలకు విదేశీ అయిన ఆంగ్లభాషలో మసలే అదనపు అవసరంతో విద్యార్థులొస్తారని వీరికి తెలీదు. తాము చదువుతున్న విద్యాసంస్థ నుండి, ఆ ప్రొఫెసర్ నుండి కావాల్సినంత సహకారం ఆ విద్యార్థులకు లభించక నష్టపోతున్నారు.

4. నెదర్లాండ్స్‌లో ఎక్పా పలెక్ సంస్థను నిర్వహిస్తున్న క్లారిసా రియోస్ రోజాస్ ప్రకారం ఆంగ్లేతర విద్యార్థులకు సైన్స్ అధ్యయనం చాలా కష్టమైన పని. పిహెచ్‌డీ అభ్యర్థన పత్రం నుండి ఇంటర్వ్యూ వరకు అన్నీ ఇంగ్లిష్ లోనే ఉంటాయట. కేవలం ఆంగ్ల పదజాలం నేర్చేసుకుంటే సరిపోదు. ఆంగ్ల భాషతో పాటుగా ఆంగ్ల సంప్రదాయాన్ని నేర్చుకుంటేనే మనగలమని ఈమె నమ్ముతారు. ఈమె పెరు నుండి వచ్చారు, స్పానిష్ మాతృభాష. మొదట్లో పడిన కష్టాలు ఇంకెవరికీ రాకూడదని సైన్స్ పరిశోధనా రంగంలోకి వెళ్ళే ముందు నేర్వాల్సిన విషయాలను ఎక్పా పలెక్ అనే తర్ఫీదు సంస్థ ద్వారా నేర్పిస్తున్నారట. ఆంగ్ల భాష నేర్చుకోవడంతో పాటు, విశ్వవిద్యాలయాలలో పాటించాల్సిన జాగ్రత్తలను, మెలకువలను లాటిన్ అమెరికా దేశస్థులకు నేర్పుతున్నారట.

5. బ్రిస్‌బేన్, యూనివర్సిటీ ఆఫ్ క్వీన్స్‌లాండ్ లోని జంతుశాస్త్రవేత్త తత్సుయా ఆమనో, ఒక జపానీ భాషీయురాలిగా ఆంగ్ల ప్రొఫెసర్లతో ఎదురైన సమస్యలను తెలిపారు. ఈమె ప్రకారం ఇంగ్లిష్ కాని భాషలలో ఉన్న సమాచారం, కేవలం ఇంగ్లిష్ లో

ప్రచురణ కాకపోవటం వలన మిగతా ప్రపంచానికి తెలీటం లేదు. 2016లో చేసిన ఒక అధ్యయనంలో 2014 సంవత్సరంలో ఈమెకు నచ్చిన అంశం జంతుపరిరక్షణకు సంబంధించి 75,000 పరిశోధనా పత్రాలు వచ్చాయి, అందులో 36 శాతం పత్రాలు అంగ్లేతర భాషల్లో వచ్చినవే. ఆంగ్లాధిపత్యం వలన విజ్ఞాన పరిశోధనలలో ఒకరకమైన పక్షపాత ధోరణి చొచ్చుకువచ్చిందని ఈమె అభిప్రాయం.

ఈమె ప్రకారం ఆంగ్లం ప్రముఖంగా ఉన్న భూభాగంలోని జీవరాశుల సమాచారం పొందుపరచడం అధికంగా జరుగుతోందట. కానీ ప్రపంచంలో అది ఐదోవంతు ప్రాంతమే, మిగితా ఐదులో నాలుగొంతుల భూభాగం తాలూకు జంతురాశి సమాచారం పొందు పరచటం కేవలం ఈ ఆంగ్ల భాష నిబంధన వలన కుదరటం లేదట. ఈమె చెప్పిన విషయాలలో ఒక ఆసక్తికరమైన విషయం ఏంటంటే, ఆంగ్ల భాషీయ ప్రొఫెసర్లకు ఇతర భాషల్లో వచ్చే పరిశోధనా పత్రాలు ఇట్టే ఆంగ్లంలోకి గూగుల్ ట్రాన్స్లేట్‌తో తర్జుమా అయిపోతాయన్న అపోహ ఉందట. గూగుల్ ట్రాన్స్లేట్ చేసే అనువాదాల గురించి మనకు బాగా తెలుసుగా. ఆంగ్ల ప్రొఫెసర్లు విదేశీ ఆంగ్లేతర పరిశోధనలను గూగుల్ ట్రాన్స్లేట్ లాంటి సాధనాలతో పరికించి, తప్పుడు ఫలితాలను అన్వయించుకుంటున్నారట. అందువలన ఆంగ్లేతర పరిశోధకులు తమ భాషలోనే తమ స్వరాన్ని సైన్స్ ప్రపంచంలో వినిపించేందుకు వెనకడుగు వేయకూడదని, ఆంగ్ల తర్జుమా సాధనాలను నమ్ముకుని తమ పరిశోధనను చిన్నది చేసేయొద్దని ఆమె తెలిపారు. మన మాతృభాషల్లో సైన్స్ అధ్యయనం చేయటం సిగ్గుపడాల్సిన విషయం కాదని, గర్వపడాలని ఆమె అన్నారు.

6. ఫ్రాన్సులోని సెన్సోరియన్ ఫార్మా కంపెనీలో పరిశోధన చేస్తున్న మోంట్ సెర్రాట్ బాష్ గ్రౌ ప్రకారం ప్రతి ఒక్కరూ తప్పకుండా ఆంగ్లం నేర్చుకోవాల్సిన పరిస్థితి ఈనాడు విజ్ఞాన పరిశోధనా రంగంలో ఉందట. ఈమె 2000-2002 మధ్య ఫ్రాన్స్‌లో పరిశోధన నిమిత్తం వెళ్ళగా అక్కడ ప్రాంతీయ ప్రజలు ఫ్రెంచ్ లో తప్ప వేరే భాషలలో మాట్లాడే వారు కాదట. ఈమె పరిశోధనా ఫలితాలను ఆంగ్లంలో నివేదించాలి. మాతృభాష స్పానిష్. అందువలన ఈమె పని కోసం ఆంగ్లం, రోజువారీ మనుగడ కోసం ఫ్రెంచ్ నేర్చుకున్నారట. ఆమె స్వదేశం స్పెయిన్లో, విద్యార్థిదశలో ఆంగ్ల భాష దాదాపు కనిపించ లేదట, ఇంగ్లిష్ కార్యక్రమాలూ టీవీల్లో వచ్చేవి కాదట. ఫ్రాన్స్ వెళ్ళి నపుడు అక్కడ విదేశీ పరిశోధనా విద్యార్థుల కోసం ఫ్రెంచ్ నేర్పించే కోర్సులున్నాయి కానీ ఇంగ్లిష్ నేర్పించే కోర్సులు లేవట. ఫ్రెంచ్ విద్యార్థులకు ఇంగ్లిష్ తరగతులుండేవట. అందువలన ఈమె పరిశోధనా పత్రాలు చదివి, ఆంగ్ల సినిమాలు చూసి, ఆపైన తోటి ఆంగ్ల విద్యార్థులతో మాట్లాడి ఇంగ్లిష్ నేర్చుకున్నారట.

ఆంగ్ల భాషీయులు మాట్లాడే వేగాన్ని అప్పుడే ఆంగ్లం నేర్చుకునేవారు అర్థం చేసుకోవటం కష్టం, అలానే వారు వాడే యాస ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకంగా ఉంటుంది. అందువలన ఆంగ్లేతర విద్యార్థులే తమలో తాము ఆంగ్లంలో సంభాషించి అంగ్లం నేర్చుకునే వారట. భాష అనేది విజయానికి దోహదపడే ఒక ఉపకరణం. మనం ఎలా మాట్లాడుతున్నాం, మన భావాలని ఎలా భాషలోని పదాల్లోకి పొదిగి భావ వ్యక్తీకరణ చేస్తున్నామనేది ఈనాడు అత్యంత అవసరమైన జీవనాధారం. సైన్స్‌లో అందరం ఒకేభాషలో వ్యక్తమవ్వడం అవసరం. ఆ స్థానాన్ని మంచో, చెడో ఆంగ్లం ఆక్రమించింది. విశ్వవిద్యాలయాలలోనైనా, ఉద్యోగంలోనైనా ఆంగ్లం నేర్చితేనే మనం మనగలము. మనం చేయదలుచుకున్న పనికి భాష ఎప్పుడూ అడ్డంకి కాదు. కానీ కాన్ఫరెన్సుల్లో, ఇంటర్వ్యూలలో, పరిశోధనాపత్రాలు రాసేటప్పుడు, ఆంగ్లం ఒక అడ్డుతెరలా వస్తుంది, దాన్ని నేర్చేసుకుంటే మన పని సులువవుతుంది.

7. అమెరికా న్యూజెర్సీలోని ప్రిన్స్‌టన్ విశ్వవిద్యాలయ చరిత్ర పరిశోధకులు మైకేల్ గోర్డిన్ ప్రకారం సైన్స్ పరిశోధనలకు ఆంగ్ల భాషలో ప్రత్యేకించి ఇతర భాషల్లో లేని ఏ గుణాలూ లేవు. మాండరిన్ లోనో, స్పానిష్‌లోనో, తెలుగులోనో, స్వహిలిలోనోసైన్స్ ఇంతే అభివృద్ధి జరిగేది. కానీ ప్రపంచంలోని ఆర్థిక, రాజకీయ శక్తుల కారణంగా ఆంగ్లం అందలమెక్కింది. ఇది మంచికో చెడుకో మనకు తెలీదు. ఒకేభాష సైన్స్ పరిశోధనా భాషగా ఉండటం వలన ఎన్నో ఉపయోగా లున్నాయి. ప్రపంచంలో ఆరు వేల భాషలున్నాయి. ఆరు వేల భాషల్లో పరిశోధనా పత్రాలువస్తే, వాటన్నిటినీ అధ్యయనం చేయడం అసాధ్యం. 1700, 1800 శతాబ్దాలలో యూరప్‌లో వైజ్ఞాని కులు కచ్చితంగా జెర్మన్, ఫ్రెంచ్, లాటిన్‌లోనేవారి పరిశోధనలు ఉటంకించాల్సిన అవసరం ఉండేది. అందువలన ఆనాటి మూడు భాషల పద్ధతితో పోల్చితే, నేటి ఒకేభాష సూత్రం బాగుంది.

కానీ ఈ భాషాపేక్ష వలన ఎన్నో మహత్తర వైజ్ఞానిక ఆలోచనలను మనం కోల్పోతున్నాం. ఆంగ్లం ప్రాథమిక భాషగానో, మాధ్యమిక భాషగానో లేని దేశాల్లోని మేధస్సు వృథా అయిపోతోంది. కనీసం నాలుగొందల ఏళ్ళుగా ఆంగ్లంలో వైజ్ఞానికులు వారి రచనలను, పరిశోధనలను, ఆవిష్కారాలను, కనుగొన్న విషయాలను పొందు పరచారు. దాదాపుగా అన్ని విజ్ఞాన సిద్ధాంతాలకు, ప్రక్రియలకూ ఆంగ్లంలో పదజాలం తయారై ఉంది. ఏదైనా కొత్త అధ్యయనాంశం వచ్చినా, ఉన్న పదజాలంతో సమాంతరంగా పదజాలం సృష్టించుకునే మార్గం రూపొందించారు వైజ్ఞానికులు. కంప్యూటర్ సైన్సులోని ఇంటర్నెట్, సాఫ్ట్‌వేర్, సైబర్నెటిక్స్ లాంటి పదాలు నేడు విశ్వవ్యాప్తమయ్యాయి. ఎన్నో భాషలకు ఈ చరిత్ర లేదు, అలాంటి సదుపాయాలు లేవు. అందువలన అన్ని భాషలలో ఆంగ్ల పదజాలానికి సమాన పదజాల సృష్టి చేయడం కష్టం. థాయినో, హిందీనో వైజ్ఞానిక భాషగా మలచాలంటే ఇంకొక కొత్త పదజాలాన్ని సృష్టించాలి, అందుకు మరో వందేళ్ళు పట్టొచ్చు.

ఆంగ్లభాష అనుకోకుండా ప్రపంచభాష అయిపోలేదు. ఆ భాషలో వచ్చినంత వైజ్ఞానిక సాహిత్యం మరో భాషలో లేదు. అందువలన భవిష్యత్తులో మరోభాష ఆంగ్లం నేడు అనుభవిస్తున్న ఏకాధిపత్యానికి చేరుకోలేదు. ఇవాళున్న ఇంగ్లిష్ మాట్లాడే ప్రతి సైంటిస్ట్ కనుమరుగైనా, ఆంగ్లంలో ఉన్న పదజాలం, వైజ్ఞానిక సాహిత్యం ఆ భాషనే ప్రపంచ సైన్స్ భాషగా నిలుపుతాయి. అయితే సమీప భవిష్యత్తులో ఆంగ్లంతో పాటు చైనీస్, మరియు ఇంకో భాష(స్పానిష్ లేదా పోర్చుగీస్ లేదా అరబిక్) – మూడు భాషలు సైన్స్ భాషలుగా చెలామణి అయ్యే అవకాశం ఉంది.

ఇవి వివిధ అభిప్రాయాలు. మీ అభిప్రాయ మేమిటి? శాస్త్ర సాంకేతిక భాషగా తెలుగు అభివృద్ధి చెందాలంటే ఏం చేయాలి? ఇంగ్లిష్‌కు సరితూగే పదజాలం తెలుగులో ఎలా సృష్టించుకోవాలి. మీ అభిప్రాయాలు editorammanudi@gmail.com కు పంపగలరు.

డా. పాలెపు సుబ్బారావు
98499 56036

వ్యావహారికభాషే పాలనాభాష కావాలి

ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైళ్ళు అన్నీ దాదాపుగా ఆంగ్లభాషలోనే ఉంటాయి. ఇంతకుముందు ఉద్యోగులు తమ అనుభవాన్ని జతచేసి ఫైళ్ళు తయారుచేసేవాళ్ళు. యిప్పుడు అనుభవజ్ఞులైన ఉద్యోగుల సంఖ్య పదవీ విరమణ ద్వారా, విభజన (బైఫర్కేషన్) వల్ల చాలా వరకు తగ్గిపోయింది. శాశ్వత ఉద్యోగుల నియామకం నిలిపివేయబడింది. కార్యాలయాల్లో పనులు జరగాలి. కాబట్టి పొరుగు సేవల ఉద్యోగులను, ఒప్పంద ఉద్యోగులను నియమించుకోవటం జరుగుతుంది. కాని వాళ్ళకు తగు శిక్షణా సౌకర్యాలు లేకపోవటం వల్ల చాలా కార్యాలయాల్లో ఎన్నో యిబ్బందులు ఎదుర్కుంటున్నారు. అట్లాంటి పరిస్థితుల్లో వ్యావహారిక భాషనే పాలనాభాషగా స్వీకరించినట్లయితే ప్రభుత్వానికి, కార్యాలయాలకు మధ్య కమ్యూనికేషన్ బాగుంటుంది. కొన్నిచోట్ల యిబ్బందులు ఎదురయ్యే అవకాశం లేకపోలేదు. సంబంధిత విషయాల్లో నిష్ణాతులైన వ్యక్తులను సంప్రదించినట్లయితే తగు పరిష్కారం లభించగలదు. ప్రభుత్వానికి సంబంధించిన ఉత్తర్వులు (జి.ఓ.) లు, నియమనిబంధనలు, బడ్జెట్ సంబంధించిన విషయాలు, నిఘంటువులు మొదలగునవి అన్నీ తెలుగుభాషలో ఉండేవిధంగా తగు చర్యలు తీసుకోవాలి.

1. అన్ని శాఖల్లో పరిపాలనా విభాగాల్లో పదకోశాలను అందుబాటులో ఉంచాలి. పరిపాలనకు ఉపయోగపడే పదజాలంతో పదకోశాలను తయారుచేయాలి. తయారు చేయబడి ఉంటే ప్రతి విభాగంల్లో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి

2. ప్రభుత్వ విభాగాలకు మరియు ప్రభుత్వానికి మధ్య జరిగే లావాదేవీలను ఇంగ్లీషుతోపాటు తెలుగులో కూడా జరిగేటట్లుగా చూడాలి.

3. ప్రభుత్వ ఉత్తర్వులను, పత్రాలను ఏవైతే ప్రభుత్వానికి విభాగాలకు మధ్య జరిగే విషయాలన్నీ ఆంగ్లముతోపాటు తెలుగులో ఉండేటట్లు చేయాలి.

4. కొన్ని నమూనాలను తెలుగులో ప్రచురించి అన్ని శాఖల్లో పనిచేసే ఉద్యోగులకు అందుబాటులో ఉంచాలి.

5. రైలు, స్కూలు, కాలేజీ మొదలగు పదాలను అచ్చు తెలుగు పదాలైన ధూమశకటము, పాఠశాల, కళాశాల అనేవిధంగా వాడటం లో యిబ్బంది ఏర్పడినప్పుడు ఇంగ్లీషు పదాలనే తెలుగు అక్షరాలుగా రాసే సౌకర్యం కలుగచేయాలి. యిబ్బంది అనుకుంటే బ్రాకెట్లలో ఇంగ్లీషు పదాలను ఇంగ్లీషులో చూపాలి.

6. పాలనా సౌలభ్యంకోసం ఉపకరించే అన్నిరకాల పుస్తకాలు తెలుగులో అనువదింపచేయాలి.

7. సమాజంలో వ్యావహారిక భాషలో ఉపయోగించే పదజాలాన్నే పరిపాలనావ్యవస్థలో ఉంచే ప్రయత్నం చేయాలి.

8. సమా జంలో కొన్ని ఇతర భాషాపదాలు కూడా ప్రజల్లో నాటుకుపోయాయి. అట్లాంటి పదాలను పరిపాలనాపరంగా కూడా ఉపయోగించే ప్రయత్నం చేయాలి.

9. 'పరిపాలన' ను దృష్టిలో పెట్టుకుని తెలుగు పండితులతో ఒక కమిటి ఏర్పరచి, కొంతమంది సభ్యులనుచేసి వారిని ప్రభుత్వ విభాగాలకువెళ్ళి అమలు అవుతుందో లేదా పరిశీలించటమే కాకుండా, అమలు పరచటంలో ఎదురవుతున్న సాధకబాధకాలను అడిగి తెలుసుకునే ప్రయత్నం చేయాలి.

10. వ్యావహారిక భాషనే పరిపాలనా భాషగా అమలుచేసే ప్రయత్నం చాలా సులభం. వ్యావహారిక భాష అంటే వార్తాపత్రికల్లో, ఛానళ్ళలో, రేడియోల్లో వాడే భాష.

11. వాడటానికి, గుర్తుపెట్టుకోడానికి ఇబ్బందిగా ఉండే కఠినపదాలకు ఆంగ్ల పదాలను వాడే సౌకర్యం కలగచేయాలి.

12. పరిపాలనారంగంలో ఇంతకముందు ఉన్న ఫైళ్ళను తెలుగులో అనువదింపచేసి వాటి నమూనాలుగా ప్రచురించి ఉద్యోగాల్లో కొత్తగా చేరేవారికి అందుబాటులో ఉంచటం.

13. అతిముఖ్యమైన విషయం ఏమిటంటే నేటి సాంకేతిక విధానంతో తెలుగుభాష మమేకం అవటం ఎంతో అవసరం. కంప్యూటర్లలో ముఖ్యమైన ఫారాలు, ఉత్తరములు, ఉత్తర్వులు మొదలగు అన్నింటినీ భద్రపరచబడి ఉండటమే కాకుండా అందరికీ అందుబాటులో ఉంచాలి.

14. ప్రభుత్వ ఉద్యోగులందరికీ తెలుగు భాషకు సంబంధించిన కంప్యూటర్ పరిజ్ఞానాన్ని కొంతవరకైన అందజేసే ప్రయత్నం చేయాలి. డి.టి.పి. చేసే ఉద్యోగులు ఉన్నప్పటికీ, వారులేని సమయంలో కనీసము కంప్యూటర్ ఆన్ చేసి, ప్రింటౌట్ తీసే కనీస పరిజ్ఞానమన్న కలిగి ఉండాలి.

15. ప్రోత్సాహకాల రూపంలో ఉద్యోగుల్లో పోటీపెట్టాలి పరిపాలనాపరమైన ఆంగ్లపదాలకు తెలుగు అనువాదం అన్న విషయం పైన, అంతేకాకుండా నిబద్ధతతో ఎవరైతే తమ సేవలను తెలుగుభాషలోనే చేస్తూ ఉంటారో వారిని ప్రోత్సహించాలి.

16. విభాగాల్లో ఉద్యోగుల పేర్లను, వారి హోదాలను ఇంగ్లీషు భాషలోనే కాకుండా తెలుగు భాషలో ఉండే విధంగా కూడా చర్యలు తీసుకోవాలి. కంటితుడుపు చర్యగా కాకుండా నిబద్ధతతో చేయగల్గాలి.

17. ఇతర రాష్ట్రాల, భాషల ఉద్యోగులను, తప్పనిసరిగా తెలుగు నేర్చుకుని, పరిపాలనా వ్యవస్థలో సహకరించవలసిందిగా చర్యలు తీసుకోవాలి. వారికి అవసరమనుకున్నచో తగు ప్రోత్సాహకాన్ని

(....తరువాయి 32వ పుటలో)

సడ్లపల్లె చిదంబరరెడ్డి
9440073636

లచ్చిమి పెండ్లి

వొగూర్లో వొగవ్వుండె. అవ్వంటే. ఆయమ్మ ముసల్దేమీ కాదు! పొద్దున్నే లేస్తూనే పండ్లు తోముకోవల్ల, నోరు శుబ్బరంగా కడుక్కోవల్ల అని ఆయమ్మ సిన్నపిల్లపుడు సెప్పే వాళ్లెవురూ లేక పొద్దూ యాళా అనకుండా ఆకూ, వక్క, కడ్లపొడీ యెర్రి మేక మాదిరీ నమిల్నమిలి ముప్పై యేండ్లకే పుచ్చిపొయ్యి పండ్లన్నీ రాలి పొయ్యిండె. అందుకే ఆయమ్మ ముసిల్దాని మాదిరీ కనిపిస్తా వుండె!!

ఆయమ్మ పేరు యెవ్వరికీ తెలీదు! నల్లగా వుండే దానికి ఆయమ్మని అందరూ నల్లమ్మ, నల్లమ్మనే పిలుస్తా వుండ్రి.

అట్లా నల్లమ్మ వొగ దినం గూడా రుతాగా పొద్దు గడుపుతా వుండ్లేదు. పొలాల్లో పైర్లు నాటేదానికో, కలుపులు తీసేదాంకో, కోతల పనుల్కో పోతా వుండె. యా పొద్దయినా యెం పనీ సిక్కకుంటే సీమజాలి కంపలు కొట్టుకోని బజార్లో అమ్ముకో నొస్తా వుండె.

యిట్ల జీరంగి మాదిరీ పంజేసే ఆయమ్మకి వొగ కూతురుండె. ఆ పాప్పేరు లచ్చిమి. నల్లమ్మ లచ్చిమిని సిలకపిల్ల మాద్సిరీ పెంచె. అయిదేండ్లు నిండుతూనే యిసుకూల్లో సేరిపించె.

గుడుల్లో పూజారప్ప గారు దేవునికి పూజలు సేసేది మరుస్తా వుండ్రేవో గానీ...నల్లమ్మ మాత్రము లచ్చిమిని యిసుకూలుకు పంపేది మరుస్తా వుండ్లేదు. తొలి గంట యినిపిస్తా వున్నట్లే లచ్చిమి జింకపిల్ల మాదిరీ యెగురుకొంటా బడికి పోతా వుండె. బాగా సదువుకోని సూస్తా



తప్పెట కొట్టుకోని పాట్లు పాడుకొంటా పదైదు యిరవై మంది వొచ్చిరి!! వాళ్లలో వొగ పిల్లోడు "సదువు రాని దద్దమ్మా యెల్లిపోరా యీట్నుంచి" అని నల్లమ్మ కూతురు లచ్చిమి తోన తిట్లు తిన్నోడు!! ఆయప్ప మెల్లగా నల్లమ్మ దగ్గిరికొచ్చి "నల్లమ్మత్తో నేను బాగా సదువు నేర్సిండాను నీ బిడ్నిచ్చి పెండ్లి సేయి" అని అడిగె.

వున్నట్లే పెద్దగాయ! పెద్ద మనిషాయ!!

యింగ సదువులు సాలంజెప్పి నల్లమ్మ కూతురికి పెండ్లి కొడుకును యెదికేకి యల్బారె. తిరిగీ, తిరిగీ ఆయమ్మకి కాళ్లరిగి పాయ. యాలంటే...యా మగ జీవున్ని కది లించినా "కట్నము యంతిస్తావు? యేమేమి సొమ్ములు పెడతావు??" అని అడిగే వోడే!! అట్లా తపుడు నల్లమ్మ యా బాయిలో పడల్ల!! కడాకి ఆదెదికి...యీడెదికి యెవున్నో వొగున్ని పిల్సుకోనొచ్చె!

ఆ పిల్లగాడొచ్చినపుడు లచ్చిమింట్లో వుండ్లేదు. ఆక్కూర్లు ఆరోగ్యానికి మంచిదని ఆయమ్మ బుక్కుల్లో సదివింది గాబట్టి కుంటెం గిఁౘెడ్డి శెనగ సెట్లోకి పొయ్యి కూరాకు పీకుతా వుండె.

లచ్చిమిని సూసేకొచ్చినోడు నెట్టగా ఆ తావకే పాయ. లచ్చిమిని సూసి పండ్లిగిలిచ్చె. ఆమాటా యీ మాటా మాట్లాడిస్తా మింగేసే వోని మాదిరీ సూడబట్టె. వాని తత్తువము ఆయమ్మకి అర్తమయి పాయ. యీని కత యేందో తెల్సుకొందాము అంజెప్పి...

ఆమె: వోరోరి పిన్నోడ దుడుకుబడే సిన్నోడ

నలుగుర్లో నన్ను జూసి నవ్వొద్దురా...! వోరోరి!!

రచ్చబండ కాడికీ నువురార సిన్నోడ

రవ్వంత సేపాడ కూకోర సిన్నోడ

రామాయుణ మిస్తాను సదవరా సిన్నోడ!!వోరోరి!!

అతడు: నా తోడు మా యమ్మతోడు సదవలేనె లచ్చిమి

మారెమ్మ దుర్గమ్మ తోడు సదవలేనె లచ్చిమి

నాతోన మనువాడు నా మంచి లచ్చిమి

ఆమె: గుడి తాకి రాతిరికి నువురార సిన్నోడ

గుడి ముందర నా జతలో కూకోరా సిన్నోడ

బారతము యిస్తాను సదవరా సిన్నోడ

అతడు:నాతోడు మాయమ్మ తోడు సదవలేనె లచ్చిమి

మారెమ్మ దుర్గమ్మతోడు సదవలేనె లచ్చిమి !!వోరోరి!!

ఆమె: పొద్దున్నె మా యింటికి నువు రార సిన్నోడ

కాపీని తాక్కొంట కూకోర సిన్నోడ

పేపర్ను తెచ్చిస్త సదవరా సిన్నోడ

అతడు: నాటోడు మాయమ్మటోడు సదవలేనె లచ్చిమి

మారెమ్మ దుర్గమ్మతోడు సదవలేనె లచ్చిమి

నాతోన మనువాడు మా మంచి లచ్చి

ఆమె: సదువురాని దద్దమ్మ యెల్లి పోరా యీట్నుంచి !వోరోరి!!

యపుడయితే ఆయమ్మ "సదువురాని దద్దమ్మా యెల్లిపోరా యీట్నుంచి" అని బేజారు సేసుకొన్నో అపుడు వానికి శానా అవుమానము అయిపాయ. "థూ! యీ నెమ్మ!! సదువురాని యీ బతుకు యాల బత కల్ల??" అని అనుకోని, తలకాయి దించుకోని దేశాలంటీ యల్లబారి పాయ.

లచ్చిమి నెట్టగా అమ్మతాకొచ్చె. అంత పొద్దుకి నల్లమ్మ కొడవలి నడుములో సిక్కిలి చ్చుకోని, గంప నెత్తిమీ దెత్తుకోని రాతి మిద్ది ముక్కిడి రామక్కా వాళ్ల రాగి సేను కోసేకి బయదేర్తా వుండె. ఆయమ్మని నిలేసి.....

లచ్చిమి: సదువూలేదూ సామూ లేదమ్మా

ఆ సిన్నోడూ నాకూతగ్గా మొగుడూ కాదమ్మా !!సదువూ!!

డబ్బా లొకటే సాలాదోయమ్మ

వాని యదలో అచ్చరాలా జాడే లేద మ్మా !! సదువూ!!

ఆస్తీ అందం జూసీ వాన్ని నేనూ పెండ్లి సేసూకోను

కండా బలము వుందేమో బుఁరా నిండా బంక మన్ను !!సదువూ!!

తెలివీ తేటలు లేనే లేవు యీడూ జోడూ కానేకాదూ

ఎద్దూలాగా బలిసినాడు మొద్దూ కూత లు కూస్తాడు !!సదువూ!!

సినిమా పేరూ సెప్పా లేదూ జాబూ రాస్తే సదవాలేడు

అచ్చిరాలు నేర్సినోడూ అవిటి మొగు డూ అయినా సాలు !!సదువూ!!

ఆ రకంగా లచ్చిమి తనకు ఆస్తూలూ వొద్దు, అంతస్తులూ వొద్దు అచ్చరాలొచ్చినోడు అవిటి మగోదు అయినా సాలు అని మొండి కేశ. తన సదువులు, ముద్దుగా వుండే అచ్చి రాలు, ఆకాశంలో సుక్కల మాదిరీ మెరిసే తెలుగచ్చిరాలూ మనసులో మెదుల్తానే యద లో నుంచీ ఆనందము పొంగుకోనొచ్చె...

లచ్చిమి: అచ్చరమా ముద్దుటచ్చరమా

మా నోటి మాటలా ఆకారమా!! అచ్చ రమా!!

నిన్నెవరు చేసిరే అచ్చరమా

నీ రూపెట్లు తీర్చిరే అచ్చరమా !! అచ్చరమా!!

నిన్ను మొదలెవరు పలికిరే అచ్చరమా

నీకు పేరెట్లు పెట్టిరే అచ్చరమా !! అచ్చరమా!!

తెలుగులో వెలుగైన అచ్చరమా

మా బతుకులో విలువైన అచ్చరమా!! అచ్చరమా!!

నిన్ను నేర్చితేను అచ్చరమా

మా రాతలే మారేను అచ్చరమా ! అచ్చరమా!!

యింటిల్లి పాదికీ అచ్చరమా

యింగితం నేర్పేటి అచ్చరమా !! అచ్చరమా!!

డబ్బులూ వుంటేను అచ్చరమా

దొంగలూ దోస్తారు అచ్చరమా !! అచ్చరమా!!

ఆస్తులూ వుంటేను అచ్చరమా

దాయాదికివ్వాలి అచ్చరమా !! అచ్చ రమా!!

అచ్చురాల్ నేర్చితే అచ్చురమా

అది అరిగిపోనీ ఆస్తి అచ్చరమా !! అచ్చరమా!!

ప్రజల భాషలో పరిపాలించలేని ప్రభుత్వాలు మనకు సిగ్గుచేటు



యీ మాదిరీగా అచ్చిరాల మేలుత నాన్ని గురించి పాట్లు పాడ్నో దాన్నంతా యిన్న ఆడోళ్లు అబ్బురపాయిరి!! "అయ్యో మేమెట్లా కాదు జనాలు? మా కయితే సదివే దానికి కాలేదు మా పిల్లోళ్లని గూడా బడికి పంపిచ్చకుండా జీవాలు మేపేదానికీ, గడ్డి తెచ్చేదానికీ, సన్న బిడ్డల్ని యెత్తుకోనే దానికీ పంపిచ్చి పాడు జేస్తా వుండాము. యీ పొద్దు ట్నుంచి అట్ల సేయగూడదు. అందరూ సద వల్ల" అని నిర్దారణ సేసుకోని వాళ్ల మొగుళ్ల దగ్గరికి సేరి...

వోరి మొగుడో వొయ్యారి మొగుడో

రాత్రి బడికి పోదాము రోరి మొగుడో !!వోరి!!

అత్తనూ రమ్మనూ వోరా మొగుడో

మామనూ రమ్మనూ వోరి మొగుడో

అక్కనూ రమ్మనూ వోరి మొగుడో

బావనూ రమ్మనూ వోరి మొగుడో

అందర్ని రమ్మనూ వోరి మొగుడో !!వోరి!!

బడికి మనం పోతేను వోరి మొగుడో

సదువంత వొస్తుంది వోరి మొగుడో

సదువంత వస్తేను వోరి మొగుడో

పేపర్లు సూడొచ్చు వోరి మొగుడో

బుక్కులూ సదవొచ్చు వోరి మొగుడో

కష్టాలు తెల్సుకోని వోరి మొగుడో

సుకంగా బతుకొచ్చు వోరి మొగుడో !!వోరి!!

యీ రకంగా వొగొగురే సదువుకొనేది మొదలు పెట్రి. ఆ వూర్లో రయితు లుండారు. కూలి సేస్తే కుండగాలె లేకుంటే యండ గాలె...అన్నట్ల బతికే కూల్జనా లుండారు. వాళ్లంతా వూరి ముందర సేరి...

కూలినాలి జనం మనం సదువు కొందము‌ూ- కలిసి సదువు కొందము

సదువులోని సారమంత తెలుసు కొందము !!కూలినాలి!!

కల్లూ సారాయ్ తాగిందంటే సెడి పోతాము మనం సెడిపోతాము

బీడీ సిగరెట్ కాల్సిందంటే రోగా లొస్తాయి మనకు రోగాలొస్తాయి !! కూలి నాలి!!

కష్టపడి పనుల్జేసి అంతో యింతో పొదుపుసేసి

అప్పుల్లేక బతుకుదాము తందనానా మనం

తిప్పల్లేక బతుకుదాము నంద మామా...!! కూలినాలి !!

అట్ల సదివినంక వాళ్లకి శానా తెలి వొచ్చింది. "ఆకాశంలో దాసిపెట్టుకోనుండే వాందేవుడు యా యాడాదీ సరిగ్గా కురిసె ల్లేదు. అయిదేండ్ల కొగ సారి వోట్లాటలో గెల్సే ఆయప్పగారు కుర్చీ లెక్కినంక మొండి సేతు లు సూపిస్తా వుంటారు. కరువు సీమలో సేతి పనులు నేర్సుకోని, కాలానికి తగ్గట్లు కొత్త పంట్లు పెట్టుకోని సుకంగా బతుకొచ్చు అనుకోని...

జనమంతా సదివేస్తే మన దేశాని కెంతో మేలంటా !!జనమంతా!!

మూరేడు మీసాల మనిషొకడు

కండరాల్ తిరిగిన మనిషొకడు

గుండెలి బలిసిన మనిషొకడు

వినియోగించేకొద్దీ భాష వికసిస్తుంది. వాడనిభాష వాడిపోతుంది

ఆస్తులు వుండే మనిషొకడు

చాలా బీద మనిషొకడు

మరి సదువులు మాత్రం రావంటా!! జనమంతా!!

అందాలు వొలికే ఆడ మనిషి

బాగ షోకులు సేసే ఆడ మనిషి

మంచి మొగుడూ వుండే ఆడ అనిషి

బంగారు సొమ్ములు వుండే ఆడ మనిషి

దిన కూలిని సేసే ఆడమనిషి

పాపం సదువులు మాత్రం రావంటా!! ఈ జనమంతా!!

యీ రకముగా సదువులు రాని జనాల గురించి అంగలార్సుకొంటా, సదువుల మింద ఆశలు పెంచేదానికి పూర్లంటీ పొయ్యి సాటింపు సేయల్ల అని యల్బార్తా వున్నట్లే....

తప్పెట కొట్టుకోని పాట్లు పాడుకొంటా పద్దెదు యిరవై మంది వొచ్చిరి!! వాళ్లలో వొగ పిల్లోడు "సదువు రాని దద్దమ్మా యెల్లిపోరా యీట్నుంచి'' అని నల్లమ్మ కూతురు లచ్చిమితోన తిట్లు తిన్నోడు!! ఆయప్ప మెల్లగా నల్లమ్మ దగ్గిరికొచ్చి "నల్లమ్మత్తో నేను బాగా సదువు నేర్సిందాను నీ బిడ్నిచ్చి పెండ్లి సేయి" అని అడిగె.

వాని మాట్లకి నల్లమ్మా, ఆయమ్మ బిడ్డా మూతిమింద సేతులుంచుకోని ''నువ్వు యాడ సదివితివి? యేమి సదివితివి??" అని అడిగిరి. దానికి వాడూ వాని జతగాళ్లూ...

సదువుకొంటిమమ్మాః- మేం సదువుకొంటి మమ్మా

సక్కగా బతికేది నేర్సుకొంటి మమ్మా !!సదువు!!

అనంతపురంలోన అ ఆ లు నేర్సుకోని

కర్నూలు టవున్లోన క కా లు దిద్దుకోని !!సదువు!!

వోంగోలు వూరి లోన వొగటీ రెండ్లు నేర్సుకోని

లేపాచ్చి గుడిలోన లెక్కలన్ని తెల్సుకోని !!సదువు!!



సద్దపల్లి లోనా బుక్కులన్ని సదివేసి

యిందూపురం లోన పరీచ్చలూరా సేసి!! సదువు!!

హైదరాబాదులోన అందరూ మెచ్చేసి

పాటలూ పాడేకి పూరూర్కి పంపిరమ్మ !!సదువు!!

అట్ల సదివి బుద్ధిమంతుడయ్యి పెండ్లి సేసుకోనే దానికొచ్చిండే పిల్లోన్ని సూసి లచ్చిమి శానా సంబరం పడిపాయ! సూస్తా వున్నట్లే సిగ్గుల పెండ్లి కూతురయ్యి.... తలకాయి వొంచుకోని పూలారము తెచ్చి ఆ పిల్లగాని మెడలో యేశ.

మంగళము మంగళమురో గోవింద

నిత్యా సుమంగళమురో గోవింద !!మంగ!!

పని సేసే రైతన్నకూ గోవింద

కష్టాలు తీరాలిరో గోవింద !!మంగ!!

శమటల కూలన్నకూ గోవింద

యిదుములు పోవాలిరో గోవింద !!మంగ!!

సదువులు నేర్సినోళ్లకూ గోవింద

బతుకులు పండాలిరో గోవింద !!మంగ!!

పరభాషా ద్వేషం, పరభాషా దాస్యం – రెండూ తప్పులే

స.వెం.రమేశ్

చట్ట సభల్లో తెలుగువాళ్ల ఆనవాళ్లు



2019 పార్లమెంటు ఎన్నికలలో దక్షిణాది నుండి నెగ్గినవారు మొత్తం 129. తమిళనాడులోని రాయవేలూరు తొగది (నియోజక వర్గం) ఎన్నిక వాయిదా పడింది. ఇదికాక తమిళనాడులో 38, కర్నాటకలో 28, ఆంధ్రప్రదేశ్‌లో 25, కేరళలో 20, తెలంగాణలో 17, పుదుచేరిలో 1 కలిపి మొత్తం 129 తొగదుల్లో ఎన్నికలు జరిగినాయి.

ఆంధ్రప్రదేశ్‌లోని 25 తొగదుల్లో 24 మంది తెలుగువారు నెగ్గగా; అరకు నుండి నెగ్గిన మాధవిగారి అమ్మనుడి 'కొండ' ఇది ద్రావిడనుడుల కుటుంబానికి చెందినది.

తెలంగాణలోని 17 తొగదుల్లో 13 మంది తెలుగువారు నెగ్గగా; గోండి, లంబాడి, ఉరుదూ, మరాఠి నుడులవారు ఒక్కొక్కరు నెగ్గినారు. గోండి ద్రావిడనుడి కాగా, మిగిలిన మూడూ ఇండో ఆర్య కుటుంబపు నుడులు.

కర్నాటకలోని 28 తొగదుల్లో, కన్నడిగులు 19 తొగదుల్లో నెగ్గి తొలి వరుసలో నిలిచారు. తెలుగువారు నలుగురు, తుళువారు ముగ్గురు, లంబాడీ, మరాఠి వారు ఒక్కొక్కరు నెగ్గినారు. కన్నడ, తెలుగు, తుళు నుడులు ద్రావిడ కుటుంబానివి, లంబాడీ మరాఠీ నుడులు ఆర్య కుటుంబానివి. నలుగురు తెలుగువారి వివరాలు : మధ్యబెంగళూరు నుండి నెగ్గిన పి.సి. మోహన్‌గారు బలిజ కుదురువారు. చిత్రదుర్గం నుండి నెగ్గిన ఎ.నారాయణస్వామిగారు తెలుగు మాదిగవారు. తమిళనాడులోని మాదిగలు అందరూ తెలుగువారే. కర్నాటకలో అట్ల కాదు, మాదిగవారిలో తెలుగు, కన్నడ ఇరునుడుల వారూ ఉన్నారు. కమ్మకుదురుకు చెందిన సుమలతగారు తెలుగువారు. మండ్య తొగది నుండి నెగ్గిన సుమలతగారి తల్లినుడి తెలుగు అయినప్పటికీ, వీరు పెండ్లాడింది మటుకు ఒక కన్నడిగుడినే. కన్నడిగులు చిక్కబళ్లారపుర అనీ, తెలుగువాళ్లు చిన్నబళ్లాపురం అనీ పిలుచుకొనే తొగది నుండి నెగ్గిన బచ్చేగౌడగారి ఇంటి నుడి తెలుగు. చిన్న బళ్లాపురంలో ఇప్పటికీ నూటికి అరవైమందికి పైగా తెలుగువారే ఉంటారు. బచ్చేగౌడగారు తెలుగు ఒక్కలిగ. కన్నడ ఒక్కలిగకు తెలుగుమాట 'కాపు'. తీరాంధ్ర తావులోని కాపులకూ వీరికీ పొత్తులేదు. రాయలసీమ కాపులతో దగ్గరి కలయిక ఉంటుంది. తీరాంధ్ర కాపుల కులపట్టం 'నాయుడు' అయితే, రాయలసీమ (నెల్లూరుతోపాటు) కాపుల పట్టం రెడ్డి. నాయుడు, రెడ్డి, సెట్టి, చౌదరి, గౌడ వంటివి కులాలు కాదు, కుల పట్టంలు మట్టుకే. కర్నాటకలోని ఒక్కలిగల్లో పలు చీలికలు ఉన్నాయి. వాటిలో కొన్ని తెలుగు చీలికలు. వేళ్లిచ్చే కాపులు, చింపిరి కాపులు, కొత్తదేవర కాపులు లాంటి చీలికలు అవి. కోలారు, బెంగుళూరు, పడమటి చిత్తూరు తావులలో ఈ కుదుర్లవారు రెడ్డి లేదా గౌడ అనే పట్టాన్ని పెట్టుకొంటారు. ఒకే ఇంటిలోనే ఒకరికి రెడ్డి పట్టం ఇంకొకరికి గౌడ పట్టం ఉండడం ఇక్కడ మామూలే. పలమనేరు శాసనసభ్యులుగా నెగ్గిన వెంకటయ్యగౌడగారు ఈ కుదురువారే. బచ్చేగౌడగారు వేళ్లిచ్చే కాపులు.

సదానంద గౌడ, శోభాకరంద్లాజె, నళిన్ కుమార్ కటీల్‌గార్లు ముగ్గురూ 'తుళు' నుడిని మాటలాడేవారు. ఉమేశ్ జాదవ్‌గారు లంబాడీ, ప్రహ్లాద్ జోషిగారు మరాఠి వారు.

కర్నాటక దగ్గర తెలుగువాళ్లం మాట్లాడుకోవలసిన మందల ఇంకొంత ఉంది. 19మంది కన్నడిగులు నెగ్గినమాట నిక్కమే. అయితే వారిలో అందరూ నూటికి నూరుపాళ్లు కన్నడిగులు కారు. ఉత్తర కర్నాటకలో లింగాయతుల లెక్క ఎక్కువ. లింగాయత అనేది కులం కాదు, లింగాయతులలో ఎన్నో కులాలవారు ఉన్నారు. మాదిగ, బలిజ, రెడ్డి, గాణిగ, సాదర, పంచమసాలి, నొడబ....ఇట్ల కొన్ని పదుల కులాలవారు లింగాయతులుగా ఉన్నారు. లింగాయతులకు మతంనుడి కన్నడం. వీరకన్నడిగులు వీళ్లు. ఒకానొకప్పుడు తెలుగువారిగా ఉండి, వీరశైవులుగా మారినాక కన్నడాన్ని ఇంటినుడిగా చేసుకొన్న కులాలు ఉత్తర కర్నాటకలో ఉన్నాయి. వాల్మీకి, బలిజ, రెడ్డి కులాలవాళ్లు ఇప్పుడు కన్నడిగులే అయినా వాళ్ల మూలాలలోకి తరచి చూస్తే వాళ్లు తెలుగువాళ్లని తేలిపోతుంది. అట్ల తెలుగుమూలాలు ఉన్నవాళ్లు కొందరు నెగ్గి ఉన్నారు. వారి వివరాలను

చూద్దాం.

బళ్లారి, రాయచూరుల నుండి నెగ్గిన వై.దేవేంద్రప్ప, రాజా అమరేశ్వర నాయక్‌గార్లు వాల్మీకి కులపువారు. వీరు ఇప్పుడు కన్నడిగులే కానీ మూలాలు తెలుగువి. రాయలసీమలో ఇంకా తెలుగుదనంలో ఉన్నది ఈ కులం. అనంతపురం ఎంపీ తలారి రంగయ్యగారిది ఈ కులమే. రాయలసీమలో వీరిని 'బోయ' అంటారు.

కర్నాటక ఎంపీలలో తొమ్మిది మంది లింగాయతులు. గాణిగ లింగాయతులు ఇద్దరు, సాదర లింగాయత ఒక్కరు, నొడబ లింగాయత ఒక్కరు, పంచమసాలి లింగాయతులు ఇద్దరు, బలిజ లింగాయతులు ముగ్గురు. బీదర్ నుండి నెగ్గిన భగవంత్ ఖుబా, చిక్కోడి నుండి నెగ్గిన అన్నా సాహెబ్ జొల్లె, హావేరి నుండి నెగ్గిన శివకుమార్ ఉదాసిగార్లు తెలుగు మూలాలు కలిగిన బలిజ లింగాయతులు.

కన్నడ సమాజమే తెలుగువారుగా గుర్తించిన వారు నలుగురు, తెలుగు మూలాలు ఉన్నవారు అయిదుగురు వెరసి తొమ్మిదిమంది తెలుగువారు కర్నాటకలో నెగ్గినట్లు.

నుడినాడుల ఏర్పాటపుడు ఎక్కువ మేలు పొందినది కర్నాటక. దానికి ఆనవాలే ఈ లెక్కలు. 28 మంది ఎంపీలు గెలిచిన కర్నాటకలో అచ్చకన్నడిగులు 14 మందే.

కర్నాటక నుండి కేంద్రమంత్రివర్గంలో చోటు సంపాదించిన వారిని గమనించితే కూడా ఇది తేటతెల్లమవుతుంది. కర్నాటక నుండి నలుగురు సభ్యులు కేంద్రమంత్రులు అయినారు. సదానందగౌడగారు తుళువారు, ప్రహ్లాద్ జోషిగారు మరాఠీవారు, నిర్మలా సీతారామన్‌గారు (రాజ్యసభ) తమిళులు, కాగా సురేశ్ అంగడిగారు ఒక్కడే కన్నడిగుడు.

కర్నాటకకు నుండి కిందికి దిగితే కేరళ ఉంటుంది. కేరళ కూడా ఆంధ్రప్రదేశ్‌లాగా ఒక్కనుడినాడు. నూటికి ఎనభైమందికి పైగా ఒకనుడినే మాట్లాడుతున్న వారుంటే అది ఒక్కనుడి నాడు (యూనీ లింగ్వల్‌స్టేట్). తమిళనాడు, కర్నాటకలు పెక్కునుడినాడులు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళలు ఒక్కనుడినాడులు. కేరళలో 20 తొగదులు ఉన్నాయి. అందులో 19 మంది మలయాళులు నెగ్గినారు. రాహుల్‌గాంధీ ఒక్కరే వేరునుడివారు. వెక్కసమో ఎగతాళో కాదు, నిక్కంగానే నాకు రాహుల్‌గాంధీగారి అమ్మనుడి ఏమిటనేది తెలియదు.

ఇప్పటి తమిళనాడు 29 పార్లమెంటు తొగదుల నెలవు. 40% లోపు తమిళులు ఉంటున్న తావు. తమిళులకన్నా కొద్దిగా ఎక్కువగానే తెలుగువారు బతుకుతున్న చోటు. 1970 కు ముందు మద్రాసు స్టేట్, 1953కు ముందు మదరాసు మాగాణం, మదరాసు పట్టణం కట్టకముందు తెందెలుగు నేల. 60వ పదికంలో ద్రావిడ పార్టీల పుట్టుకకు ముందు, చట్ట సభకూ పార్లమెంటుకూ తెలుగువారే ఎక్కువమంది నెగ్గిన చరిత్ర ఈ తావుది. కనీసం 100 చట్టసభ ఇరువులూ 15 పార్లమెంటు ఇరువులూ తెలుగువారికి దక్కాలి ఇక్కడ. అయితే ఆ నిలవరం లేదిక్కడ. కేవలం మూడు నూర్పాలు తమిళులు ఉంటున్న ఆంధ్రప్రదేశ్‌లో ఇద్దరు ఎంఎల్లేలు తమిళులున్నారు (సత్యవేదు, గంగాధర నెల్లూరు తొగదులు), ఒక తమిళుడు అయితే ఉపముఖ్యమంత్రే అయినారు. ద్రావిడ పార్టీలలో తెలుగువారికి చట్టసభ ఎన్నికల్లో ఇరవైకి లోపు సీట్లు దక్కుతున్నాయి. పార్లమెంటుకు మూడు నాలుగుకు మించవు.

ఈసారి కూడా అంతే. మొత్తం తొగదులు 39, ఎన్నికలు జరిగింది 38. నెగ్గిన తెలుగు వారి వివరాలు ఇట్లా ఉన్నాయి. ఉత్తర చెన్నై తొగది నుండి గెలిచిన కళానిధి వీరాసామిగారిది కమ్మకులం. వీరి ఇంటిపేరు చెరుకూరి. కృష్ణగిరి నుండి గెలిచిన చెల్లకుమార్‌గారు కోమటిసెట్టి. కడలూరు నుండి నెగ్గిన రమేశ్‌గారు సాదుసెట్టి. మదుర నుండి ఎన్నికయిన వెంకటేశన్‌గారు బలిజనాయుడు. దూతగుడి (తమిళంలో తూత్తుక్కుడి), మధ్య చెన్నై నుండి నెగ్గిన కనిమొళి, దయానిధిగార్లు మేళకారులు. మొత్తం ఆరుమంది. కోయంబత్తూరు నుండి ఒక మలయాళి ఆయన నెగ్గినారు. మిగిలిన 31 మందీ తమిళులే.

మదుర నుండి గెలిచిన వెంకటేశన్‌గారు తమిళంలో మంచి రచయిత. వీరు రాసిన 'కావల్‌కోటం' అనే నవలకు కేంద్రసాహిత్య అకాడెమీ పోణిమిని అందుకొనినారు. తంజావూరు తావులో మేళకారులకూ మంగలివారికీ వేరిమి ఉంది. గుడులలో సన్నాయీడోలూ వాయించేవారు మేళకారులు, వీరు వెంట్రుకల పని చేయరు. తెలుగులో మేళకారులూ పెద్దమేళంవారూ అంటారు. తమిళంలో ఇసై వేళాళర్ అంటారు. ఈ కులంలో తెలుగువారూ తమిళులూ ఇద్దరూ ఉన్నారు. పైన చెప్పిన ఇద్దరూ ఒక కుటుంబంవారే, తెలుగువారే. తెలుగువారికి ఇంటిపేర్లు ఉంటాయి, తమిళులకు ఉండవు. కళానిధిగారి ఇంటిపేరు చెరుకూరి. వెంకటేశన్‌గారి ఇంటిపేరు నిమ్మల. చెల్లకుమార్‌గారిది ఓరుగంటి. రమేశ్‌గారిది ధౌళి. కనిమొళిగారిది మువ్వ. దయానిధిగారిది భేరి.

తూరుపున వంగకడలి, మిగిలిన మూడు దిక్కులా తమిళనాడు, ఇదే ఇప్పటి పుదుచేరి. ఈ తమిళమాటకు 'కొత్తవాడ' అని తెల్లము. పరాసులు (ఫ్రెంచివారు) ఇక్కడ కుదురుకోవడానికి వచ్చినప్పుడు ఇక్కడుండిన పల్లెపేరు కమలాపురి. అది పంట రెడ్ల ఊరు. అదే పుదుచేరిగా పాండిచేరిగా మారింది. ఒకే ఒక తొగది ఇక్కడుండేది. పంటరెడ్ల కుదురుకు చెందిన వైద్యలింగంగారు ఇక్కడ నుండి గెలిచినారు. వీరి తండ్రిగారయిన వెంకట సుబ్బారెడ్డిగారే పాండిచేరికి తొలి ముఖ్యమంత్రి. వీరి మామగారయిన రామచంద్రారెడ్డిగారు కూడా ఒక తడవ ముఖ్యమంత్రిగా ఉండినారు. వైద్యలింగంగారు కూడా ఇదివరకు ఒకసారి ముఖ్యమంత్రిగా ఉండినారు.

దక్షిణాదిలోని మొత్తం 129 తొగదుల్లో నుడులవారిగా నెగ్గినవారి వివరాలు ఇవి

1) తెలుగు : 48 మంది (ఆంధ్ర : 24+తెలంగాణ : 13 +తమిళనాడు : 6+కర్నాటక : 4+పుదుచేరి : 1)

2) తమిళం : 31 మంది (మొత్తం తమిళనాడే)

3) మలయాళం : 20 మంది(కేరళ:19 + తమిళనాడు :1

4) కన్నడం : 19 మంది (మొత్తం కర్నాటకే)

5) తుళు : ముగ్గురు (మొత్తం కర్నాటకే)

(తెలుగులో మూలాలున్నప్పటికీ ఇప్పుడు కన్నడిగులే కాబట్టి 5 మందిని ఇక్కడే చేర్చినాను)

6) మరాఠి : ఇద్దరు (కర్నాటక : 1+తెలంగాణ : 1)

7) లంబాడీ : ఇద్దరు (కర్నాటక : 1 + తెలంగాణ : 1)

8) గోండి : ఒక్కరు (తెలంగాణ)

9) ఉరుదూ : ఒక్కరు (తెలంగాణ)

10) కొండ : ఒక్కరు (ఆంధ్రప్రదేశ్)

11) తెలియదు : (కేరళ నుండి రాహుల్‌గాంధీగారు)

మరాఠి, లంబాడి, ఉరుదూ అనే మూడూ ఆర్యకుటుంబపు నుడులు. ఈ నుడులవారు దక్షిణాదిన అయిదుగురు నెగ్గినారు. మరాఠీ వారయిన ప్రహ్లాద్‌జోషిగారికి కేంద్రమంత్రి పదవి కూడా దక్కింది. ద్రావిడ నుడులవారు ఎవరన్నా ఉత్తరాది నుండి నెగ్గినారా అని చూస్తే ఈ కొద్ది మందల దొరికింది. మహారాష్ట్రలోని షోలాపూర్ నుండి నెగ్గిన డా॥ సిద్ధేశ్వర స్వామిగారు తెలుగువారు. వీరిది బేడ జంగమ కుదురు, లింగాయత మతం. బేడ జంగమవారినే తెలంగాణాంధ్ర లలో బుడగ జంగాలు అంటారు. ఒడిసాలోని కోరాపుట్టి నుండి కువి నుడివారయిన ఉలకా సప్తగిరి శంకర్‌గారు గెలిచినారు. ఛత్తీస్‌ఘడ్‌లోని బస్తర్, సర్గుజాల నుండి, గోండువారయిన దీపక్ బైజ్, రేణుకా సింగ్ గార్లు గెలిచినారు. రేణుకాసింగ్‌గారికి కేంద్రమంత్రి పదవి దక్కింది. మహారాష్ట్ర, ఒడిసా, ఛత్తీస్‌ఘడ్‌లలోని అమ్మనుడి చదువరులు వెతికితే మరికొందరి వివరాలు తెలియవచ్చు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లోని వివరాలు

ఆంధ్రప్రదేశ్ చట్ట సభలో 175 మంది సభ్యులు ఉంటారు. 2019 ఎన్నికలలో నెగ్గిన తెలుగేతర సభ్యుల వివరాలు తెలుసుకుందాం.

ఉరుదూను తల్లి నుడిగా కలవారు నలురుగు 1) నవాబ్ భాషాగారు, మదనపల్లి. 2) హఫీజ్ ఖాన్‌గారు, కర్నూలు. 3) అంజద్ భాషాగారు, కడప. 4) మహ్మద్ ముస్తాఫా షేక్‌గారు, గుంటూరు తూర్పు.

తమిళులు ఇద్దరు : 1) కె. ఆదిమూలం గారు, సత్యవేడు. 2) కె.నారాయణ స్వామిగారు, గంగాధర్, నెల్లూరు.

కన్నడ మూలం వారు ఒక్కరు : ఎం. తిప్పేస్వామి, మడకశిర.

కువి నుడివారు ఇద్దరు : 1) వి. కళావతి, పాలకొండ 2) పీడిక రాజన్న దొర, సాలూరు.

కొండనుడి ఒక్కరు : పాముల పుష్పశ్రీవాణి, కురుపాం. కుపియా నుడివారు ఒక్కరు : చెట్టి ఫల్గుణ, అరకు. కోయ నుడివారు ఒక్కరు : తెల్లం బాలరాజు, పోలవరం.

ఆంధ్రప్రదేశ్ శాసన సభలో 163 మంది సుమారు 93% తెలుగువారు; 12 మంది సుమారు 7% వేరే నుడులవారు సభ్యులుగా ఉన్నారు. ఈ పన్నెండు మందిలో ముగ్గురికి మంత్రి పదవులు దక్కినాయి. వారు : అంజద్ భాష, కె.నారాయణ స్వామి, పుష్పశ్రీవాణి.

తెలంగాణ చట్ట సభలోని మొత్తం సభ్యులు 119 మంది. వారిలో పెరనుడులవారు 23 మంది, తెలుగు వారు 96 మంది. శాతాలలో వరుసగా 19, 81 శాతాలు. పెరనుడులవారి వివరాలు. ఉరుదూ వారు 8 మంది. 1) ముంతాజ్ అహ్మద్ ఖాన్, చార్మినార్ 2) అక్బరుద్దీన్ ఓవైసీ, చాంద్రాయణ గుట్ట 3) పాషా ఖాద్రీ, యాకుత్ పురా 4) మోజంఖాన్, బహదూర్ పురా 5) అహ్మద్ బలాల, మలక్‌పేట, 6) జఫర్ హుస్సేన్, నాంపల్లి 7) కౌసర్ మొహయుద్దీన్, కార్వాన్ 8) షకీల్ అహ్మద్, బోధన్. లంబాడివారు 7 మంది 1) రమావత్ రవీంద్ర కుమార్, దేవరకొండ 2) బానోత్ హరిప్రియ, ఇల్లెందు. 3) రాములు నాయక్ వైరా 4) రేఖా నాయక్, ఖానాపూర్ 5) రాథోడ్ బాపూరావు, బోథ్. 6) రెడ్యానాయక్, డోర్నకల్ 7) బానోత్ శంకర్ నాయక్, మహబూబాబాద్. కోయవారు నలుగురు 1) సీతక్క ములుగు 2) పొడెం వీరయ్య, భద్రాచలం 3) రేగా కాంతారావు, పినపాక 4) మచ్చా నాగేశ్వరరావు, అశ్వరావుపేట. గోండివారు ఒక్కరు 1) ఆత్రం సక్కు, ఆసిఫాబాద్. మరాఠివారు ఇద్దరు 1) హన్మంత్ షిండే, జుక్కల్ 2) కాలేరు వెంకటేశ్ అంబర్‌పేట. బుందేలి నుడివారు ఒక్కరు 1) రాజాసింగ్; గోషా మహల్ పై 23 మందిలో ఒక్కరికి కూడా మంత్రి పదవి దక్కలేదు.

ఆంధ్రప్రదేశ్ నుండి ఇండో ఆర్య కుటుంబపు నుడివారు నలుగురు నెగ్గినారు. ఇదే కుటుంబపువారు తెలంగాణ నుండి 18 మంది నెగ్గినారు. హైదరాబాదు నగరంలోని 15 మంది ఇరవులకుగాను 9 ఇరవుల్లో ఆర్యనుడివారే నెగ్గినారు.

ఇటు తెలంగాణ నుండి ఇద్దరు మరాఠీలు నెగ్గినారు కదా, అట్లే అటు మహారాష్ట్రలోని విదర్భతావు నుండి అయిదుగురు తెలుగువారు నెగ్గినారు. 1) ద్వారం మల్లికార్జునరెడ్డి, రామ్‌టెక్ 2) వడెట్టి విజయ్, బ్రహ్మపురి 3) బోద్కూరు సంజీవరెడ్డి, వని 4) మదన్, యావత్మల్ 5) మునగంటి సుధీర్, బల్లార్షా. వెతికితే ఇంక ఉంటారేమో!

(25 వ పుట తరువాయి)

కల్పించాలి.

18. అంతర్జాలాన్ని బాగా ఉపయోగించుకునేవిధంగా తగుచర్యలు తీసుకోవాలి. చానళ్ళలో ఇంగ్లీషు భాషకు ఉన్నంత ప్రచారం తెలుగు భాషకు లేదు. అందుకని పెద్దలు తెలుగుభాషను దృష్టిలో పెట్టుకుని అంతర్జాలంలో మార్పులు తేగల్గితే ఎంతో బాగుంటుంది.

19. తెలుగుభాషను పరిపాలనాభాషగా వ్యావహారిక భాషగా అభివృద్ధి పరిచే వారిని ప్రోత్సహించాలి. కొంతమంది తెలుగుభాష మీద ఉన్న మమకారంతో తెలుగు రానివారికి తెలుగు నేర్పే ప్రయత్నం చేయుచున్నారు. అట్లాంటివాళ్ళకు ప్రభుత్వం తగు సహాయ సహ కారాలు అందివ్వాలి.

20. తెలుగుభాషను నేర్పటం హిందీ ద్వారా ఎంత సులభమో అంత సులభం ఆంగ్లంలో కాదు. కాని తెలుగు అకాడమివారు తెలుగు భాషను ఆంగ్లంలో నేర్పించుతున్నట్లుగా తెలిసింది. తెలుగుభాషను నేర్పాలంటే మాతృభాష ద్వారా లేదా భారతీయ భాషలద్వారా సులభ మవుతుందేగాని ఆంగ్లం ద్వారా సులభం కాదు. ఎందుకంటే వాక్య నిర్మాణంలో చాలా యిబ్బందులు ఎదురవుతాయి.

పిట్టచూపు

చలసాని నరేంద్ర
9849569050

కార్గిల్ యుద్ధానికి 20 ఏళ్ళు ... గుణపాఠం గ్రహించామా !



సరిగ్గా 20 ఏళ్ళ క్రితం, జులై 26న 1999లో కార్గిల్ వద్ద పాకిస్థాన్ సైనికులు ఆక్రమించిన భారత పోస్టులను భారతీయ సైన్యం తిరిగి స్వాధీనం చేసుకొంది. అత్యంత కీలకమైన ఈ యుద్ధం 1999 మే - జులైలలో జమ్మూ, కాశ్మీర్‌లోని కార్గిల్ జిల్లాలో జరిగింది.

ఈ యుద్ధంలో భారత సైన్యం ప్రదర్శించిన అసమాన ధైర్య సాహసాలు, పరాక్రమాలు కారణంగా ఘన, విజయం సాధించినా, పాకిస్థాన్ గత్యంతరం లేక తోక ముడిచి పరిస్థితి కల్పించినా యుద్ధానికి దారితీసిన దేశ రక్షణ పట్ల మన నేతలు నేరమయ నిర్లక్ష్య ధోరణులను ఇప్పటికైనా విడిచామా? దేశ రక్షణకు ఇవ్వవలసిన ప్రాధాన్యత ఇస్తున్నామా? మనసేనలకు అవసరమైన సాయుధసంపత్తిని సమకూరుస్తున్నామా? ఈ అంశాలపై సింహావలోకనం చేసుకోవలసిన సమయం నేడు ఆసన్నమైనది.

'కార్గిల్ విజయ్ దివస్' 20వ వార్షికోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించేందుకు మన సైన్యం తగిన ప్రణాళిక రచిస్తోంది. జూలై 25 నుంచి 27 వరకు ఢిల్లీ నుంచి జమ్మూ-కాశ్మీర్‌లోని ద్రాస్ వరకు భారీ ఎత్తున నిర్వహించే 'కార్గిల్ గెలుపు సంబరాలు' కోసం ఆర్మీ పూర్తి సన్నద్ధతతో ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో జూలై 14న జ్యోతి ప్రజ్వలనతో ఈ కార్గిల్‌గెలుపు సంబరాలు ప్రారంభం కానున్నాయి. ఢిల్లీలోని జాతీయ యుద్ధ స్మారక స్థూపం నుంచి తొలుత ప్రారంభమయ్యే ఈ కార్గిల్‌జ్యోతి దేశంలోని 11 పట్టణాలు, నగరాల్లో కొనసాగి, చివరకు జమ్మూ-కాశ్మీర్‌లోని ద్రాస్‌లో కలవడం ద్వారా ముగుస్తుంది.

కార్గిల్ జ్యోతిలో పాల్గొనే సభ్యులు ఆయా ప్రాంతాల్లో విద్య, దేశభక్తి, ప్రముఖ వ్యక్తులతో చర్చాగోష్ఠి, వివిధ విద్యా సంస్థల్లో విద్యార్థులను కలుసుకోవడం వంటి కార్యకలాపాలు చేబడుతున్నారు. అదేవిధంగా క్రీడాజ్యోతి ప్రతినిధులు సాహసయాత్రల్లో పాల్గొన్నవారిని కలుసుకోవడంతోపాటు టోలోలింగ్, టైగర్ హిల్, పీటీ 4875 వంటి ప్రాంతాల్లోని యుద్ధ్భూముల్లో పాల్గొన్నవారితోపాటు వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్ల కోసం ప్రత్యేక జాతీయ సమగ్రతా శిబిరాలు వంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటారు. ఆయా కార్యక్రమాలు 12 రోజులపాటు కొనసాగి చివరకు లెహ్ ప్రాంతంతో ముగుస్తాయి.

సియాచిన్ సెక్టార్‌లో జరిగిన కార్గిల్ యుద్ధంలో పాల్గొన మన దేశ సైనిక పోరాటం, పటిమ, శ్రద్ధ, పట్టుదల వంటి అంశాలు ప్రజల మదిలో ఎల్లప్పుడూ చిరస్థాయిగా నిలిచిపోతాయి. అదేవిధంగా కార్గిల్ పోరులో మన వీర సైనికులు చూపిన తెగువ ఇపుడు సైన్యంలో ఉన్న ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిగా నిలుస్తుంది. అయితే ఆ నాడు కనీసం తుపాకీ గుంటలు కూడా కొరతగా ఉన్న పరిస్థితులలో, ఎత్తైన ప్రాంతాలలో, చలి ప్రాంతంలో పోరాడే సాధనా సంపత్తి అందుబాటులో లేని సమయంలో మన సేనలు ఏ విధంగా పోరాటం జరిపారో గుర్తు తెచ్చుకోవాలి.

కార్గిల్ యుద్ధం ఒక విధంగా మన సేనలు సంసిద్ధంగా లేని సమయంలో జరిగింది. దశాబ్దాల తరబడి మన సేనలు ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలలో మునిగి ఉండడంతో విదేశాల నుండి ఎదురయ్యే దాడుల నుండి సరిహద్దులను కాపాడవలసిన తమ ప్రాధమిక కర్తవ్యంలో ఒక విధంగా నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించారని

చెప్పాలి. ఎత్తైన ప్రదేశాల నుండి, తీవ్రమైన చలిలో యుద్ధం చేయ డానికి అవసరమైన సాధనాసంపత్తి లేకుండా పోయింది. "మా దగ్గర ఏముంది దానితో యుద్ధం చేస్తాం" అంటూ భారత సైన్యాధిపతి విపి మాలిక్ జూన్ 23న చేసిన ప్రకటన ఒకవిధంగా ఆయనలోని నిస్సహాయ పరిస్థితిని వెల్లడి చేసింది.

యుద్ధంలో ఉపయోగించే ప్రతి చిన్న పరికరం కొరతగా ఉన్నదని ఆయన ప్రకటన వెల్లడి చేయడమే కాకుండా స్వదేశీయ రక్షణ ఉత్పత్తుల పట్ల దృష్టి సారించకచ పోవడంతో రక్షణ పరంగా ఒక విధంగా ప్రమాద పరిస్థితులలో ఉన్నట్లు కూడా తేటతెల్లమైనది. భౌగోళికంగా భారత్ తీవ్రమైన ఉద్రిక్తపూర్వక ప్రాంతంలో ఉంది. జాతీయ ప్రయోజనాల కోసం సైనికంగా బలంగా ఉండవలసిందే.

రక్షణ ఉత్పత్తులలో స్వయం సమృద్ధి సాధింపలేని ఏ దేశం కూడా సురక్షితంగా ఉన్నట్లు భావించలేదు. అందుకనే ఇప్పటికైనా దేశం ఈ విషయమై దృష్టి సారించవలసిన పరిస్థితి నెలకొంది. ఇప్పటి వరకు ఈ రంగంలో మన పాలకులు ప్రదర్శించిన నిర్లక్ష్య ధోరణి క్షమార్హం కాబోదు. కార్గిల్‌లో పాకిస్థాన్ సేనలు చొరబడిన వారం రోజులకుగాని గొర్రెల కాపరులు చేరవేస్తేగాని మన సేనలు తెలుసుకోలేకపోయారు. మన నిఘావిభాగం ఘోర వైఫల్యం స్పష్ట మైనది.

మొదట్లో అసలు ఈ ఘర్షణలో తమ సేనల ప్రమేయం లేదంటూ పాకిస్థాన్ చెబుతూ వచ్చింది. భారత్ సేనలు "కాశ్మీరీ స్వతంత్ర యోధులు" నుండి దాడులు ఎదుర్కొంటున్నట్లు చెప్పింది. అయితే ఆ తర్వాత ఈ యుద్ధంలో పాల్గొన్న తమ సేనలకు మెడల్స్ బహుకరించడంతో పాకిస్థాన్ సేనల ప్రమేయం పట్ల ఎటువంటి అనుమానం లేకుండా పోయింది. పైగా, మృతి చెందిన పాకిస్థాన్ సైనికుల వద్ద దొరికిన పత్రాలు పాకిస్థాన్ సైన్యం ప్రత్యక్షంగా ఈ దాడికి పాల్పడిన్నట్లు స్పష్టం చేశాయి.

ఈ సందర్భంగా నాటి వాజపేయి ప్రభుత్వం అసామాన్యమైన సంయమనం పాటించి, సేనాధిపతులు కోరినా సరిహద్దు దాటకుండా వ్యవహరించడం ద్వారా అంతర్జాతీయంగా పాకిస్థాన్‌ను ఏకాకిచేసి, అసాధారణమైన దౌత్య విజయం సాధించాము. చివరకు అంత ర్జాతీయ వత్తిడుల కారణంగా, ఎటువైపు నుండి సహకారం లభించక పోవడంతో పాకిస్థాన్ వెనుకడుగు వేయక తప్పలేదు. చివరకు మిత్రదేశమైన చైనా సహితం మౌనంగా ఉండక తప్పలేదు.

వాస్తవాధీన రేఖ వివాదాస్పదమైనదని ఒక వంక పేర్కొంటూ, మరోవంక కార్గిల్ యుద్ధాన్ని కాశ్మీర్‌లో జరుగుతున్న ఘర్షణలతో ముడిపెట్టి కాశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయ అంశంగా చేసే ప్రయత్నం కూడా పాకిస్థాన్ చేసింది. అయితే అటువంటి దౌత్యపరమైన ప్రయ త్నాలకు అంతర్జాతీయంగా చెప్పుకోదగిన మద్దతు లభించ లేదు.

భారత్ జరుపుతున్న ఎదురు దాడులు ముమ్మరం అవుతూ ఉండడంతో పాకిస్థాన్ ప్రధానమంత్రి నవాజ్ షరీఫ్ అమెరికాకు వెళ్లి అధ్యక్షుడు బిల్‌క్లింటన్‌ను జులై4న కలిసి, అమెరికా మద్దతును ఆర్జించారు. షరీఫ్‌కు చివాట్లుపెట్టి తీవ్రవాదులతో తనకు గల సంబం ధాలను ఉపయోగించుకొని, పాకిస్థాన్ సేనలను భారత్ భూభాగం నుండి తిరిగి వచ్చేటట్లు చేయమని క్లింటన్ సలహా ఇచ్చారు.

"షరీఫ్ చర్యలు దిగ్భ్రాంతి కలిగించాయి" అని క్లింటన్ తర్వాత తన ఆత్మకథలో వెల్లడించారు. కాశ్మీర్ సమస్యను పరిష్కరించుకొనే దిశలో ద్వైపాక్షిక చర్చలను ప్రోత్సహించే లక్ష్యంతో భారత ప్రధాని వాజపేయి లాహోర్‌కు ప్రయాణం చేసిన సమయంలో "ఆధీన రేఖను దాటి వెళ్లడం ద్వారా పాకిస్థాన్ ద్వైపాక్షిక చర్చలను ధ్వంసం చేసింది" అంటూ పేర్కొన్నారు. మరోవంక, అధీన రేఖను దాటి పాకిస్థాన్ భూభాగంలోకి ప్రవేశింపకుండా భారత్ ప్రదర్శించిన సంయమనాన్ని ఆయన ప్రశంసించారు. లేనిపక్షంలో పూర్తిస్థాయి యుద్ధంగా మారి ఉండేదని తెలిపారు.

ఇతర జి8 దేశాలు సహితం కొలోజీనే సదస్సులో ఆధీన రేఖను ఉల్లంఘించిన పాకిస్థాన్ చర్యను ఖండించి భారత్ కు మద్దతు పలికాయి. ఐరోపా యూనియన్ సహితం పాకిస్థాన్ చర్యను వ్యతి రేకించింది. సుదీర్ఘకాలం పాకిస్థాన్ కు మిత్ర దేశంగా ఉంటూ వస్తున్న చైనా సహితం జోక్యం చేసుకోకుండా వాస్తవాధీన రేఖ నుండి పాకిస్థాన్ సేనలు వైదొలిగి, భారత్ తో సరిహద్దు సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోమని సలహా ఇచ్చింది. ఆసియన్ ప్రాంతీయ వేదిక వంటి ఇతర సంస్థలు సహితం భారత్ వైఖరికి మద్దతు పలికాయి.

అంతర్జాతీయంగా పెరుగుతున్న వత్తిడుల కారణంగా, మిగి లిన పాకిస్థాన్ సేనలను భారత్ భూభాగం నుండి వెనుకకు తిరిగి వచ్చే విధంగా షరీఫ్ చేయగలిగారు. క్లింటన్, షరీఫ్ జారీ చేసిన సంయుక్త ప్రకటన వాస్తవ ఆధీన రేఖను గౌరవించ వలసిన అవస రాన్ని స్పష్టం చేస్తూ, అన్ని వివాదాలను పరిష్కరించు కోవడానికి అత్యుత్తమ వేదిక ద్వైపాక్షిక చర్చలే అని స్పష్టం చేసింది.

రెండు దేశాల వద్ద సామూహిక విధ్వంసక ఆయుధాలు ఉండ డంతో యుద్ధం మరింతగా ఉదృతమైతే అణుయుద్ధంగా మారవచ్చని కార్గిల్ యుద్ధం సందర్భంగా అంతర్జాతీయ సమాజం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అంతకు ముందు సంవత్సరమే, 1998లో రెండు దేశాలు కూడా తమ అణు సామర్థ్యాన్ని పరీక్షించి ప్రపంచానికి చూపాయి. అంతకు ముందు 1974లోనే భారత్ అణు పరీక్షను మొదటగా జరుపగా, పాకిస్థాన్ మొట్టమొదటగా 1998లోనే అణు పరీక్షకు దిగింది.

దక్షిణాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తలకు సూచికగా ఈ అణు పరీక్షలను చాలామంది పరిశీలకులు భావించారు. అణు పరీక్షలు జరిగిన సంవత్సరం కాలానికే కాశ్మీర్‌లో యుద్ధ మేఘాలు ఆవరించ డంతో ఈ సంఘర్షణ తీవ్రతను పరిగణలోకి తీసుకొని, దానిని అంతం చేయడంకోసం ఎవ్వరి ప్రయత్నం వారు చేశారు. ముఖ్యంగా కాశ్మీర్ ను అంతర్జాతీయ వివాదంగా సృష్టించి, అంతర్జాతీయ మద్దతు పొందటంకోసం చేసిన ప్రయత్నాలు విఫలం కావడం భారత్‌కు అనూహ్య విజయం తీసుకొచ్చింది.

మొదటిసారిగా దేశ రక్షణ అంశాలపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. కార్గిల్ సమీక్ష కమిటీని ఏర్పాటు చేసి, ఆ కమిటీ సిఫా ర్సులపై మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయడం ద్వారా దేశ రక్షణకు సంబంధించిన అంశాలపై జాతీయ స్థాయిలో బహిరంగ

(...తరువాయి 36 వ పుటలో)

డా॥ పి. శివరామకృష్ణ 'శక్తి'
9441427977

ఆలోచనే ఆయుధంగా...

'సాహిత్యం సమాజ వృక్షానికి పూసే పువ్వు. పువ్వుకు పువ్వులు పూయవు. సాహిత్యానికి పుట్టే సాహిత్యం నాకు ఆనాడే కృత్రిమంగానూ కాగితం పువ్వుగాను కనిపించింది. ('రాయటం దేనికి' కొడవటిగంటి కుటుంబరావు)

ఇటీవల 'గిరిజన సంస్కృతి - ప్రధానోపాధ్యాయుల కరదీపిక'లో చేర్చేందుకు 'నాను చదువుకుంతాను' కథాసంకలనంలోని కొన్ని కథలు శ్రీ చిన వీరభద్రుడు నాకు చూపించారు. వాటిలో ఉత్తరాంధ్రంలో వర్ధమాన సవర గిరిజన రచయిత మల్లిపురం జగదీశ్ రాసిన మొదటి కథ ఒకటి.

దాంట్లో ఒక సవర పిల్లడు ఆశ్రమ పాటశాల వాతావరణంలో ఇమడ లేక పోతుంటాడు. కానీ డ్రాయింగ్ మాస్టరుకు దగ్గరౌతాడు. కొంతకాలానికి ఆపిల్లాడు బడిమానేస్తాడు. అతడిని వెతుక్కుంటూ డ్రాయింగ్ మాస్టారు వాళ్ల గూడెం వెళతాడు. తిరిగి వస్తూ మామిడి చెట్టు చూపించి, ఒక కాయ కొట్టిమ్మంటాడు. గురి తప్పని సవర కుర్రాడి రాయి దెబ్బకు కాయ పడుతుంది.

కుర్రాడిని బడికి రమ్మని నచ్చజెపుతూ 'కొమ్మలు రెమ్మలు ఎన్ని అడ్డుగా ఉన్నా కాయను కొట్టావు చూడు, అలాగే ఎన్ని ఇబ్బందులున్నా, వాటిని పట్టించుకోకుండా చదువు మీద గురిపెట్టాలి' అని హితబోధ చేస్తాడు.

సవరలు పండుగలలో దేవతలను ఆహ్వానిస్తూ గోడలమిద బొమ్మలు గీస్తారు. అటువంటి నేపథ్యం నుండి వచ్చిన కుర్రాడు డ్రాయింగ్ మాస్టారికి దగ్గరయ్యాడు. గూడెం లో గోడలమీద బొమ్మలు చూసి మాస్టారు చాలా ఉత్తేజితుడౌతాడు. పిల్లాడిని ఒక పికాసోగా తీర్చి దిద్దుతాడు అని ముఖపుస్తకంలో సలహా ఇచ్చాను. ఈకథకు పదేళ్ళ ముందు కావచ్చు, 1998-2000లలో హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో ఒక నిపుణుడికి సవరలచేత ప్రభుత్వం శిక్షణ ఇప్పించిన విషయం నాడు వార్తలలో ప్రముఖంగా వస్తుండేది.

జగదీశ్ ఇటీవలి సంకలనం 'శిలకోల'కు ముందుమాట రాసిన ఏకె ప్రభాకర్, చినవీరభద్రుడు నా వ్యాఖ్యను అతనికి పంపించారు. ఆ సంకలనంలో అతని గురువు గంటేడ గౌరునాయుడుగారు, జగదీశ్ - తన తెగ సంస్కృతి మూలాలను అధ్యయనం చేస్తూ రచనలు సాగించాలని ఆశీస్సులందిస్తారు.

నిజమే గత వందేళ్ళలో జానపదుల,గిరిజనుల సామాజిక చేతనను రగిలిస్తూ వచ్చిన గాథలను మలుచుకున్న కథలు లేనేలేవు.

ఒకనాటి సవరదేశం శ్రీకాకుళం జిల్లాలో ముఖలింగం ప్రసిద్ధ క్షేత్రం. సవర రాజు కూతురు ఇప్పపూలతో శివలింగానికి మొక్కేది. కాశీకి పోతు అలసి పోయిన బ్రాహ్మడు అక్కడ విశ్రాంతి తీసుకోటానికి మజిలీ చేసాడు. అతని కూతురు కూడా ఆ చెట్టు పూలనే శివుడికి సమర్పించేది. అవి బంగారు పూలుగా మారిపోతుండేవి. ఈ తేడాలో మాయ అంతుపట్టని సవరలు శివుడిని నిలదీస్తారు. అయన ఉలకడు. పలకడు. కోపగించిన సవరలు ఈ మాయకు మూలం ఈ చెట్టే అనుకుని దాన్ని నరికేస్తారు. ఆ ఇప్ప మొద్దునే మధుకేశ్వరుడుగా మనం ఆ క్షేత్రంలో పూజిస్తున్నాము.

వస్తుమార్పిడి, ఉమ్మడి కట్టు బాట్లతో మనుగడ సాగించే గిరిజనులలోకి బంగారం, నాణేలు, మంత్రాల వంటి కృత్రిమ విలువలతో దాడి మొదలైంది. అవి అంతుబట్టని గిరిజనులు తమ ఆస్తుల విధ్వంసానికి పూనుకోటం, యజ్ఞం కథలో, అభివృద్ధి మాయకు పొలం పోగొట్టుకున్న అప్పలరాముడిని గుర్తుకు తెస్తుంది. కాని 'పేద వాడి కోపం పెదవికి చేటు'. నీ ఆస్తిని నువ్వు ధ్వంసం చేసుకుంటే, బయటివాడికి కలిగే నష్టమేమీలేదు. కాబట్టి మాయోపాయాలతో గడించినవాడి ఆస్తులు ధ్వంసం చేయాలి. వాడిమీద దాడిచేయ్యాలి. ఇలా బయటి ప్రపంచం మీదికి ఉద్యమాలు ఆవేశాన్ని మళ్లించాయి. కానీ మారుతున్నరోజుల్లో ఈ దాడిని ఎలా 'తెలివి'గా తిప్పికొట్టాలో, పక్కనే ఉన్న పూరి జగన్నాథం కథ బోధిస్తుంది.

పూరి క్షేత్రం ఒకప్పుడు పెద్ద అడవి. అదికూడా సవరల దేశమే. రాజు వేటకొస్తుండేవాడు. తను, తన సైనికులు వేటకు పోయి ఉత్తిచేతులతో తిరిగి వస్తుంటే, సవరలు వేటాడి తెచ్చుకున్న మాంసం అందరు పంచుకోవడమే కాకుండా, తమ అతిథి రాజుకు కూడా వాటా పంపించేవారు. అలుపు సొలుపు లేకుండా రాత్రంతా ఆటపాటలతో గడిపి, మళ్ళి పొద్దునే వేటకు తయారయ్యే వాళ్ళు.

వాళ్ళ అదృష్టాన్ని ,ఉత్సాహాన్ని చూసి రాజుకు కన్ను కుట్టింది. ఏదో గుట్టు ఉండాలి అది తెలుసుకోమని పురోహితుడిని పురమాయించాడు. వాళ్ళ వెంట ఎంత తిరిగినా ఆ గుట్టు తెలియలేదు. ఈ తిరుగుడులో ఒక సవర యువతి అతడి ప్రేమలో పడింది. వాళ్ళు దేవుడికి మొక్కే తంతు, చేసే విన్నపాలు, వాటిలో పాడే పాటలు, పలుకుబడులు, సామెతలు - సంస్కృతంలోకి మార్చి, మంత్రాలు అన్నాడు. రాజు అండతో గుడి కట్టాడు. దైవదర్శనానికి వేళలు. ప్రసాదానికి ధర పెట్టాడు. దేవుడే ఈ కొత్త రూల్స్ పెట్టాడన్నాడు. పదిమంది దేవుడి దగ్గరకు వస్తారు కాబట్టి రూల్స్ పెట్టక తప్పదన్నాడు. ఆ రూల్స్ గోడ మీద రాసాను చదువుకోండి అన్నాడు. తమకు ఈ విధంగా దూరమౌతున్న జగన్నాదుడిని సవరలు నిలదీస్తారు. దేవుడు తన నిస్సహాయతను తెలియ చేస్తాడు. సవరలు రాజును ఓడించి దేవుడిని తీసుకుపోవడానికి తయారౌతారు.

వాడు డబ్బుపెట్టి కావలసినంత సైన్యాన్ని తెచ్చుకుంటాడు. మామూలు యుద్ధంలో వాళ్ళను గెలవటం కష్టం. కాలం మారింది. మీరు బయటి ప్రపంచం పోకడలు తెలుసుకోవాలి. దానికి చదువు నేర్చు కోవాలి. చదువుతోనే వాడి మాయలను తిప్పికొట్టాలి అని

సలహా ఇస్తాడు. ఈ చదువులు మా వల్ల కాదు అని సవరలు మొట్టుకుంటారు. తను అక్షర బ్రహ్మగా వారి మధ్య అవతరిస్తానని అక్షరాస్యతతో తనను అర్చించమని సలహా ఇస్తాడు. అలా అవతరించిన జగన్నాథుడిని ఆరాధించడం, వారి భాషకు ఒక లిపి,జెండా ఒక మతంగా మారింది. అస్తిత్వపోరాటంలో ఆవేశాన్ని పెంచటానికి వాడుకుంటారు తప్ప చదువు అంటే వ్యవహార దక్షతకు సాధనం, భూమి, అడవి నీరు జగన్నాథుని రూపాలు. వాటిని వశం చేసుకుంటున్న రాక్షసుల నుండి విడిపించాలి. అందుకు తగ్గ చదువు నేర్పండి అని అడగటానికి బదులు ఉద్యోగాలిమ్మని వేడుకుంటూ క్యూ కడుతున్నారు.

ఈ పరిణామాలు జగదీశ్ మాటల్లో' 'తనకు తాను పరాయిగా మారేక్రమం గతం లోకంటే రెట్టింపయింది.ఆదివాసులు ఇప్పుడు వాటిముందు దరఖాస్తుదారులుగా క్యూలో నిలబడి ఉన్న సందర్భ మొకటి కొత్తగా ఆవిష్కృతమైంది .దీనిఫలితంగా పనిముట్టుకు శ్రమకు దూరమయ్యాడు. ఆదివాసీ చట్టాలు వాటిఅమలులో వస్తున్న ఇబ్బందులు ఆదివాసీ సమాజం ముందు కొత్త దృశ్యాల్ని అవిష్కరిస్తున్నాయి. ఆదివాసీ సాహిత్యం అనగానే ఉద్యమసాహిత్యం అనే అభిప్రాయం స్థిరపడిపోయింది...'

(బహుళ-సాహిత్యవిమర్శ 2018)

అయితే ముఖలింగం, జగన్నాథుడు మాత్రమే కాదు ఇటువంటివి ఎన్నోకథలున్నాయి. సామాన్య జనచేతన లో గల ఈ సంప్రదాయ రూపాలను తన కాలపు ఆశయాలతో ఎడా పెడా మేళవించి శ్రీ శ్రీ చైతన్యాన్ని రగిలించాడు. కానీ అయన ముందుతరం, తరువాత తరం ఈ మేళవింపును పట్టుకోలేక పోయాయి. సంప్రదాయం గురించి పట్టనట్లే చట్టాలగూర్చి ఏదో అవాకులు చెవాకులు వాగడం తప్ప తెలుసుకుని ఎందరు రాస్తున్నారు? తెలుసుకోమని చెపుతున్నారు!!.

అతవిహక్కుల పట్టాదార్ పాస్ పుస్తకం మీద- మగనాలి మెట్ట, చేవడి బస, జాకరి మెట్ట వంటి ఉత్తరాంధ్ర గిరిజన మాండలికంలో వాడుకలు అచ్చువేసారు. గిరిజన ప్రాంతంలో కింది స్థాయి ఉద్యోగులందరూ గిరిజనులే కాబట్టి - ఇది ఎందుకు వేసారు అనే ఆలోచన వారిలో పెంచడానికి బదులు, అడవినుండి దూరం చేయటానికి కుట్ర జరుగుతోంది అంటూ కవితలలో ఆవేశం ఒలికించటం వల్ల ఒరిగేదేమిటి.!

రావిశాస్త్రి, కేశవ రెడ్డి రచనలు చదివి మురిసి పోవటం తప్ప, యానాది, ఎరుకల పౌర హక్కులకై పోరాడిన న్యాయవాది యానాది రాఘవయ్య గారు రచయిత అని ఎందరికి తెలుసు! ఎందుకు తెలియదు!? చోదక శక్తి కావలసిన సాహిత్యం,మాదక ద్రవ్యంగా మారింది. ఎవడిలోకం, ఎవడి గుంపు వాడిది. రాయటం దేనికి అనే ప్రశ్న వేసుకోనంతకాలం గిరిజనుడు రాసినా, మరొకడు రాసినా ఒకటే.

జీవితమంతా కమ్యూనిస్ట్ గా గడిపిన రచయిత మహీధర రామమోహనరావు గారి 'కత్తుల వంతెన' కథలో ' దొడ్డ కమ్యునిస్టులు రా బాబూ! ఏ పని చేయకుండా సోషలిజం వచ్చేస్తుందిలే అని వీళ్ళ ఊహ కాబోలు' అనిపిస్తారు. అంతటితో ఊరుకోక 'తెలుగు దేశం సామాజిక జీవితం మీద మార్క్సిజం భావన కలిగించిన ప్రభావానికి, దానిపేరున అమలు జరుగుతున్న రాజకీయాల ప్రభావానికి మధ్య వైరుధ్యం ఏర్పడింది. దాన్ని పరిష్కరిస్తేనే ఆంధ్ర ప్రదేశ్‌కు మంచి భవిష్యత్తు అని హెచ్చరిస్తారు.(ప్రజాసాహితి్మమహీధర సాహిత్య పరామర్శ సంచిక. జూలై 2000 పేజి 64, ,74)

'విప్లవాల సంగతి అటుంచి చిన్న చిన్న సంస్కరణలను కూడా సాహిత్యం చేయలేదు. జీవితం దిగబెరుకుతున్నపుడు సాహిత్యం ఎగబెరకదు'అన్న కొ.కు చురకను గమనించి ఆలోచన పెంచే సాహిత్యాన్ని ఆదరించాలి. సంప్రదాయాన్ని సాధికారితను పురి పెట్టుకుంటూ ఆలోచనతో ముందుకు సాగాలి.

(34 వ పుట తరువాయి)

చర్చలకు వాజపేయి ప్రభుత్వం అవకాశం కల్పించింది. అప్పటి నుండి మనసైనిక సంసిద్ధత విషయమై పలు క్రియాశీల చర్యలు తీసుకోవడం ప్రారంభించారు. అయితే ఆ తర్వాత పదేళ్లున్న యుపిఎ ప్రభుత్వం ఈ దిశలో సత్వర నిర్ణయాలు తీసుకోలేకపోవడంతో వెనుక బడిపోయాం.

సరిహద్దులను కాపాడవలసిన సేనలను అందుకోసమే విని యోగించాలని, ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలలో వారిని విని యోగించరాదని ఈ సందర్భంగా నిపుణులు సిరిఫార్సు చేశారు. ఇగ్రవాద వ్యతిరేక చర్యలలో నిమగ్నమైన సాయుధ దళాలకు అవసరమైన సాధనసంపత్తి సమకూర్చాలని సూచించారు. ముఖ్యంగా నిఘా వ్యవస్థను పటిష్ట పరచవలసి ఉంది. సరిహద్దులలో ఎవ్వరికీ వారుగా కాకూండా, సమిష్టి కార్యాచరణ చేపట్టవలసి ఉంది.

కార్గిల్ యుద్ధం తర్వాత పాకిస్థాన్ మరోసారి భారత్‌పై యుద్ధా నికి దిగే సాహసం చేసే అవకాశం లేదు. కాశ్మీర్, పంజాబ్, ఈశాన్య ప్రాంతాలలోనే కాకుండా దేశంలో పలు చోట్ల ఐఎస్ఐ ద్వారా ప్రచ్చన్న యుద్ధంకు తలపడుతుంది. పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రవాద బృందాల కార్యక్రలాపాలు భారత్‌లో పెరుగుతున్నాయి. వారికి సైనిక శిక్షణ, ఆయుధాలు, నిఘా సమాచారం సమకూరుస్తున్నారు. పాకిస్థాన్ దుష్ట పన్నాగాలను తిప్పి కొట్టడం కోసం మనం కూడా త్యాధునిక సమాచార వ్యవస్థను సమకూర్చుకోవలసి ఉంది.

ముఖ్యంగా నేడు సామజిక మాధ్యమాలను ఉగ్రవాద కార్య కలాపాలకు పెద్ద ఎత్తున ఉపయోగించుకొంటున్నారు. ముఖ్యంగా రక్షణ సాధనసంపత్తిలో స్వయం సమృద్ధి సాధించడంలో మరెంతో దూరం ప్రయాణం చేయవలసి ఉంది. ఈ దిశలో నిర్ణయాత్మక భూమిక వహించవలసి ఉంది. కార్గిల్ యుద్ధం సమయంలో రెండు నెలలో 500 మందికి పైగా సేనలను మనం కోల్పోయాము. కానీ గత ఐదేళ్లల్లో యుద్ధం లేకపోయినా కాశ్మీర్‌లో జరుగుతున్న ప్రచ్చన్న యుద్ధం' లో 500 మందికి పైగా సేనలను ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలలో పోగొట్టుకుకున్నాం. స్వతంత్ర భారత్ లో యుద్ధంలో కాకుండా ఇంతటి భారీ స్థాయిలో సేనలను ఎప్పుడు కోల్పోలేదని గ్రహించాలి. దేశ భద్రత ఇంకా ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నదని తెలుసుకొని మన నేతలు అప్రమత్తం కావాలి.

ధారావాహిక

నంద్యాల నారాయణ రెడ్డి
9360514800

సౌతంత్రకాల సదువులు 2

బిడువుకాలపు ఆటలు :

ఇస్కూళ్లకు బిడువులు (సెలవులు) వచ్చేసె. ఇంక మా కతను సెప్పేదొద్దు. [redacted] సిన్నోళ్లమూ బయ[redacted] ఇస్కూలోళ్లకి ఆవులోళ్లూ కొత్త జతగాళ్లు అయిపోయి, ఆడిందే ఆట, పాడిందే పాట. బానమంతా (ఆకాశమంతా) గువ్వలు ఎగిరినట్లా, దిన్నలూ వంకలూ బీళ్లూ బయళ్లంతా మేమూ బెమ (ఆశ) తీరా ఎగుర్లాడేదే పని. పారి (పరిగెత్తి)పోయి పారొచ్చి, కాలవల్ని ఎగిరి దాటేది. మూడు నాలుగు అడుగుల ఎత్తుండే వబ్బుల్ని (పొదల్ని) ఎగిరి దుమికేది. పోటీలపైన పోటీలేసుకొని, ఒకర్నిమించి ఒకరు దాటేదీ దుమికేదీ ఎగిరేది.

బయళ్లలో ఆవుల్ని మేపేటపుడు, ఏడెనిమిది అడుగుల పొడుముండే కట్టెని మెడమీద పెట్టుకొని, రెండు సేతులనూ బుజాల మీదగా వెనకనింకా రానిచ్చి కట్టెపైన వేసుకొని నడిసేది ఒక దిమాకు (గొప్ప) మాకు. అపుడపుడూ కట్టె సాదన (కర్రసాము) సేస్తావుంటాము. కట్టె సాదనని కొద్దిగా నేర్సినోడు మా రామచంద్రుడు. మేము మా ఇండ్లనింకా నూగుల్నో, వేపిన ఉలవల్నో ఎర్రబియ్యాన్నో తెచ్చి వానికి తినేకి ఇస్తేనే వాడు నేర్పుతాడు. అంతేకాదు, పంటచేన్ల తట్టుకు పోనీకుండా వాని గొర్రెల్నీ మేమే తిప్పుకొని రావాల, మేపాల. ఆడ బిడ్డల్నో బక్కనాయాళ్లనో కూరేసి (బలహీనం)గాళ్లనో, గొడ్లకీ గొర్రె లకీ కాపలాగా పెట్టేసి, మేము మా పనుల్ని సాగిస్తుంటాము. కావలి కాసిందానికి వాళ్లకీ తినేకులు వెడతాము.


ఇస్కూలు మొకమే ఎరగని ఆవుల సిన్నోళ్లు రవంత మేదకస్తులు (అమాయకులు) వాళ్లనంతా కౌరవుల్ని సేసేసి, మేము పాండవులం అయిపోతిమి. అంటే అట్లా పేర్లు పెట్టుకొనేస్తిమి. వాళ్లు పొడుముకాళ్ల నాయాళ్లు, మేము రవంత పొట్టి. దూరమూ ఎత్తరమూ ఎగిరి దుమికే పంద్యాల్లో వాళ్లే గెలుస్తా ఉండిరి. ఇట్ల కాదురా అనుకొని, మా మెడలమీది కట్టెల్ని నేలకు ఊనుకొని, వాళ్లకన్నా దూరమూ ఎత్తరమూ ఎగిరేస్తిమి. ఆ ఒరటు (మొరటు) నాయాళ్లు ఒప్పుకోలేదు. 'ఇదంతా అండాగుండీ ఆట' అంటా మమ్మల్ని తరిమేసిరి. మేమే తనీగా (విడిగా) ఒక తావన దుముకుతా ఉండాము. మాలో ఒకని కాలికి ముల్లు దిగిపోయె. అపుడు ఆ ఆవులోళ్లే పారొచ్చి, మెల్లిగా ముల్లుని పీకేసి, ఆ సందుకు తీళతీగపాలను నింపిరి. తీళతీగ పాలైనా జిల్లేడు పాలైనా నింపితే, లోపల ముల్లు విరిగింటేనూ వచ్చేస్తుందంట. నొప్పి కూడా ఒకట్రొండు నాళ్లలో తగ్గిపోతుందంట. తిరిగి అందరమూ జతయిపోతిమి. అర్దము సిన్నోళ్లు మద్దేనము కంటా ఆట్లాడతా ఉంటే, అర్దము సిన్నోళ్లు ఆవుల్ని మేపేది, మద్దేనముపైన ఇరుజట్లూ సర్తు (షిఫ్ట్) ను మార్చుకొనేది.

మా కాళ్లకి సెప్పులంటేనే తెలియదు. ఇంగిలీసోళ్లు, వాళ్లకూ వాళ్ల సిపాయిలూ కోలుకార్లకూ, సెప్పులూ బూదుసులూ సేపించేదానికి తోళ్లనంతా తీసుకొని పోయేస్తారంట. అదేకాదు, సెప్పులకు వాడికయిపోతే, మెతువుకాళ్లు అయిపోయి, మన్నులో చేనుల్లో మడుల్లో పనిసేసేకి అయ్యేలేదని, మనోళ్లు కూడా సెప్పులేయరు. మా కాళ్లు గట్టిరాయి మాదిరిగా ఉంటాయి. మేము నడిసేటప్పుడు మా పాదాల గడుసుతనానికి సిన్నసిన్న రాళ్లు కూడా పిండి పిండయి పోతుంటాయి. అయినా సెప్పులేసుకోవాలనే ఆస. ఏమి సేసేది? పెద్దోళ్లని అడిగితే తిడుతారు. దానికీ ఒక దోవను కనిపెడితిమి. కత్తాళి (నార కలబంద) పట్టలనూ, పోకపట్టలనూ, అంటిపట్టలనూ, సెప్పులట్లా కొలతగా కోసుకొని, నారతో వేళ్లు దూరేనట్ల ఉంగటాలు సేసుకొని, మిడిమెల (మడమలు) వెనక తాళ్లతో కట్టుకొని, ఒకొకనాడంతా ఉండేనట్ల సెప్పుల్ని సేసుకొని తొడిగేస్తుంటాము.

బయలు తినేకులు :

ఇండ్లనింకా తెచ్చిన తినేకుల్ని (చిరుతిండ్లని) అంతా ఒక తువాలు మీద పోసిపెట్టి, ఆటల నడుమ సుదారింపుకు కూకొన్నపుడు అందరమూ పంచుకొని తింటుంటాము. ఎవుడైనా ఒక దొంగనాయాలు, తెచ్చిన వాటిని మూసిపెట్టుకోని తింటే వాడు ఆపొద్దు శకునిగాడు. వానికి ఇంకెవురూ ఏమీ దేకరు. వాని తావ లేనపుడు మమ్మల్ని బేలాడితే, 'నీ పుట్టు సూడు శకుని పుట్టు, నీ పుట్టుకు పులుసు పిండ, నీ మొకానికి దేకుతాముండు' అని తిడుతాము. అయినా నేతరెడ్డిగాడు సావుకారి కొడుకు, మల్లి ఏమో మీసాలరెడ్డి కూతురు. వాళ్లిద్దరే ఒక పక్క సేరి, తినేకుల్ని తిని, ఆవుల్ని మేపుతారు.

ఇంటి తినేకులే కాదు (వేపిన నూగులు, వేపిన ఉలవలు, సెనిక్కాయలు, ఎర్రబియ్యం), బయళ్లలో బీళ్లలో తోపుల్లో మాకు ఎన్నెన్నో తినేకులు సిక్కుతాయి. ఎవుడైనా ఇంట్లో అలిగి, ఏమీ తినకుండా వచ్చేస్తేనూ వాని కడుపు ఎండేదిలేదు. తోపుల్లోని మామిడి, సింత, సీమసింత, నేరిడి, సీతాపనస కాయల్ని రాళ్లతో కొట్టి ఉదిరించు(రాల్చు) కొని తినేస్తాము. వెలకపండ్లలో బెల్లం కలుపుకొని తింటాము. ఇంకా తొండపండ్లు, పన్నీరు కాయలు, కారిపండ్లు, మిండిపండ్లు, కలివిపండ్లు, నాగదాళిపండ్లు, బుడమకాయలు, బుడ్డపండ్లు, ఎర్రకాసిపండ్లు, నల్లకాసిపండ్లు, గూదపండ్లు, ఎళస(రేగు)పండ్లు, కుందిలికొమ్ములు, పుల్లెంతీగలు, గొట్టిగడ్డలు, లవటంగడ్డలు, సింతపులుసాకు వంటి తానుగా (సహజంగా) పండే తినేకుల్ని పెరుక్కొని పచ్చివే తినేస్తుంటాము. పుల్లగా ఉండే సింతపులుసాకుని నలిపి, రాగి కాసులమీద ఉజ్జితే, కాసులు మినమిన



మెరుస్తాయి. బీళ్లలో జిటకామల్లి అనే కూరాకు సిక్కుతుంది. ఎర్నొగుల (వలిసెల) పొడి సల్లుకొని ఈ కూరాకుని వండి తింటే, ఆ రుసీ ఆ గములూ(సువాసన), దానెమ్మ! సొరగంలో కూడా అట్లా తిండి సిక్కేదిలేదు. రైతులు సేన్లలో పండించే అనప, అలసంద, కంది కాయల్ని ఉడకేసుకొని తినేస్తాము. గుమ్మడి, సొర, దోస కాయల్ని దొబ్బుకొచ్చి ఉడికిచ్చి తినేస్తుంటాము. బలమైన, సారమైన ఇట్లా తినేకులు తిని, వంకల్లో బావుల్లో మీజు(ఈత) కొట్టి, బీళ్లల్లో బయళ్లలో ఆట్లాడే మా దగ్గరికి రోగమూ రొస్టూ వచ్చేకే దిగులుపడతాయి.

ఆవుల గంగమ్మ గుడి :

"ఈ బూమండలములో ఉగ(ఉక్క) జాస్తి అయ్యి, ఆవి(ఆవిరి) పైకి లేసినపుడు, వాన కురిసి బూమమ్మను సల్లబరుస్తుంది. అట్లా కాలంలో వచ్చే పండగే ఉగావి పండగ. దాన్నే మనము ఉగాది పండగ అనేది. అపుడు కురిసేది ముంగారు వానలు కదా. ఆ ముంగార్లే ఈ ఏడాది కురవలేదు. దానికే ఇంత సెగ" అంటా ఉండాడు చెన్నారెడ్డి తాత.

మాపు సంగటి పొద్దుకు రవంచ ముందూ వెనకాల, ఊర్లోని పెద్దోళ్లు కొందరు రచ్చ తావున ఉద్ద చేరతారు. అనుబోగాల్నీ అబిమానాల్నీ కతల్నీ గాదల్నీ తిరగేసుకొంటా కలేసుకొంటా మాట్లాడు కొంటా ఉంటారు. సిన్నోళ్లము కొందరము ఆ మాటల్ని వినేకి రచ్చ

తావుకి పోతుంటాము. ఆ పొద్దూ అట్లే, చెన్నారెడ్డి తాత, నంజప్పతాత, ఎల్లప్పతాత, మునిసామి తాత మాట్లాడుకొంటా ఉంటే, మేము వింటా ఉండాము.

"రేవతోన కూడా పలపలమని ఉదిరించేసి పోయింది కానీ నిలిసి కురవలేదే" అన్నాడు మునిసామి తాత.

"కలకుందు (ఊరకుందు), రేవతోనలో రేవులు నిండితే, అవి ఎండే వరకూ వానలు పడేదిలేదని సామెత. రేవతిలో జోరువానలు పడకపొయ్యేదే మేలు" సెప్పినాడు ఎల్లప్పతాత.

"రేవులు నిండే వానలు కాదప్పా, చేన్లను దున్నే వానన్నా పడాల కదా. ఇపుడు సూడు, అసువిని (ఆశ్విని) పోయి బొరిణి (భరణి) వచ్చింది. బొరిణోన కురిస్తే దరిణి పండుతాదంటారు. బొరిణిలోనో కిర్తికలోనో నూగులు విత్తుకోవాల కదా. మిగిలితే కూడా మిసిరి (మృగశిర)లో నూగులు విత్తరాదని పెద్దలమాట. ఇపుడూ వాన కురవలేదంటే దున్నేదెపుడు, విత్తేదెపుడు" వెతపడతా అన్నాడు నంజప్పతాత.

"మనూర్లో ఆ గంగమ్మకి గుడే లేదు. నాలుగు పలకరాళ్లను నిలబెట్టి అయినా గంగమ్మను కూకోబెట్టాల. గంగమ్మకి వానరాయునికీ పూజ సేస్తేనన్నా వానలు కురుస్తాయేమో. అయితే మన మాటల్నిని సేసేదెవురు" నిట్టుసురుతా సెప్పినాడు చెన్నారెడ్డి తాత.

ఇంకా ఏమేమో మాట్లాడతా ఉండిరి తాతోళ్లు, మాకు నిద్ర వచ్చేసి మేము ఇండ్లకు తిరుక్కొంటిమి.

తెల్లారి లేసి సంగటి తినేసి, ఆవుల్ని మేపేకి పోతిని. అక్కడ నా జతగాళ్లనంతా ఉద్దేసి, రాత్రి తాతోళ్లు మాట్లాడుకొన్న సమాచారమునంతా సెప్తిని. అందరికీ వెత వచ్చేసె. 'వాన పడాలంటే ఏమిరా సెయ్యాల' అని అందరమూ యోసన సేస్తిమి. కడసీ (చివర)కు ఒక ముదువు (నిర్ణయం) కు వస్తిమి. సిన్నోళ్లందరమూ సేరి, ఆవులు మేపే దిన్న (మిట్ట) లో ఒక గంగమ్మ గుడిని కట్టాలనుకొంటిమి. గుడికట్టి గంగమ్మకు పూజలు సేస్తే వాన వచ్చే తీరుతుంది. అని మాకు మేమే నమ్మకము సెప్పుకొంటిమి.

ఆ పొద్దుటినింకానే గుడికట్టే పనిని సురువు సేస్తిమి. ఏడేడ ఉండే ఇటికిరాళ్లనంతా తెచ్చి ఉద్దేసేది కొందురి పని. మానుసామాన్లు (కలప) సేకరించేది కొందురిపని. పై కప్పుకి పెంకుల్ని తెచ్చేది ఇంకొందురి పని. ఇట్లా సామాన్లనంతా కూడేసి వారం దినాల లోగానే ఒక సిన్న గుడిని కట్టేస్తిమి. మేము కట్టిన గుడిని సూసిన పెద్దోళ్లకంతా ఆశ్చర్యమైపోయె.

అనెంక పెద్దోళ్లనడిగి పూజసామాన్లు, బియ్యమూ రాగిపిండీ వంటి వంట సంబారాలు, కోడిపుంజులు అన్నిటినీ అవనించు (తయారు చేసు) కొంటిమి. పెద్దోళ్లు ముందుకొచ్చి గుడి ముందర ఒక సప్పరాన్ని (పందిరి) వేసిరి, వంటలు సేసి, పూజలు సేపించిరి. అనెంక సిన్నోళ్లము, వచ్చినోళ్లనందరినీ సోలుగా కూకోబెట్టి సంగటీ అన్నమూ కోడిసారూ వడ్డిస్తిమి. సిన్నోళ్లమూ తినినంక వానరాయుని పాటలు పాడి వేడుకొంటిమి....

"చెరువులన్ని ఎండిపోయె చేపలన్ని సచ్చిపోయె ఇంకన్న రారాద వాన దేవుడా

కుంటలన్ని ఎండిపోయె బాపినమ్మ యాగటాయె ఇంకన్న రారాద వానదేవుడా

బావులన్ని ఎండిపోయె కూరతోట మాడిపోయె ఇంకన్న రారాద వానదేవుడా

ఏరులన్ని ఎండిపోయె ఏకాశి పండగొచ్చె ఇంకన్న రారాద వానదేవుడా

వంకలన్ని ఎండిపోయె వాగులన్ని వట్టిపోయె ఇంకన్న రారాద వానదేవుడా.....

ఏతమెత్తె సిన్నగాడు ఎక్కెక్కిసూస్తాడు జగ్గిచ్చి కొట్టరా వానదేవుడా

గొర్రతోలె అన్నగాడు గోవిందులు పెడతాడు జగ్గిచ్చి కొట్టరా వానదేవుడా

గుంటువేసె మామగాడు గుటకనీళ్లు మింగుతాడు జగ్గిచ్చి కొట్టరా వానదేవుడా

మడకదున్నె బావగాడు మంచెమీద అలిగినాడు జగ్గిచ్చి కొట్టరా వానదేవుడా

గౌడసాని రామక్క పిండి బియ్యం ఇయ్యాలంటె జగ్గిచ్చి కొట్టరా వానదేవుడా.....

వంకాయ తోటోడు వొంగొంగి సూస్తాడు ఇంకన్న రారాద వానదేవుడా

పొళ్లకాయ సప్పరమోడు పొర్లిపొర్లి సస్తాడు ఇంకన్న రారాద వానదేవుడా

మిరపకాయ తోటోడు మిటికి మిటికి సూస్తాడు ఇంకన్న రారాద వానదేవుడా

ఉర్లగడ్డ తోటోడు ఉర్లేసుకొని సస్తాడు ఇంకన్న రారాద వానదేవుడా

తమలపాకు తోటోడు కుళ్లికుళ్లి సస్తాడు ఇంకన్న రారాద వానదేవుడా"....

నమ్మండ నమ్మకపోండ, అద్దేట్లో గుద్దేటూ అనుకోండ, కాకి కూకొని తాటిపండు పడినట్ల అనైనా అనుకోండ. వానదేవునికీ గంగమ్మకీ మా సిన్నోళ్ల పాటలూ పూజలూ సేరి జరిగె అని అనుకోండ. ఆ రాత్రి పెనువాన కురిసి సెరువులు నిండె.

మాకెపుడు సొతంత్రము :

బిడువులు అయిపోయె. తిరగా ఇస్కూళ్లు సురువాయె. ఇన్నాళ్లూ బయళ్లలో దిన్నల్లో ఆవుల సిన్నోళ్ల జతలో తిరుగులాడతా, కంటికి కాలికి సేతికి కావలసిన ఆటలాడతా, నోటికి కావలసిన పాటలు పాడతా, ఒళ్లుకు కావలసిన తినేకులు తింటా గడిపేస్తిమి. ఆ సొతంత్రం పోయె కదా. 'పాటాలు సదవండ్రా, రాయండ్రా, మేస్టరు సేత యేట్లు తినొద్దండ్రా లత్తనాకొడకల్లారా' అంటా పొద్దుపొద్దున్నే అబ్బోళ్ల తిట్లు. అనెంక మాపుసరికంటా బెత్తాన్ని ఆడిస్తా మేస్టరు పెట్టే పెట్లు.

'దేశానికి సొతంత్రమొచ్చి మూడేండ్లాయె' అని మేస్టరు ఎవరికో సెప్తా ఉండాడు. 'మాకెపుడు సార్' అని మెల్లిగా గొణిగినాడు తొణ్ణెకత్తల రాముడు. 'ఎవుర్రా అది' అని బెత్తం ఆడిస్తా అడిగినాడు మేస్టరు. తవళి (అబద్దం) సెప్పరాదు, నిజమే పలకాల అంటుంటాడు కదా మేస్టరు. దానికనే అందరమూ రాముని పక్కకే సూస్తిమి 'ఇగోరా ఇపుడే ఇస్తా నీకు సొతంత్రము' అంటా వాని అరసేతులు వెనకాల పట్‌పట్‌మని బెత్తంతో అంటించె. అంతే, వాడు ఇంటికీ పోలేదు, ఇస్కూలుకీ రాలేదు. వాళ్ల పెద్దోళ్లు, వానిని తడికి తడికి (వెతకి) సుస్తయిపోయిరి. శాన్నాళ్ల తరవాత వాడు బెంగుళూరు మారుకట్లో మూటలు మోస్తా కనపడెనంట. పిలుసుకోని వచ్చేకి వాళ్లబ్బ పోతే, అక్కడా తప్పించుకొని బొంబాయికి పొయ్యేసెనంట. అయినా వాడొక మంచిపని సేసి పోయె. అపుటినింకా ఇస్కూల్లో మేస్టరూ, ఇండ్లల్లో అబ్బోళ్లూ కొట్టేది శానా తగ్గిపోయె. 'వాడు తొణ్ణెకత్తల్ని కొట్టి పూడిసి పెట్టి కాసులు సంపాదించుకొని బతుకుతాడు లేరా' అనుకొని నెమ్మది పడితిమి వాని జతగాళ్లమైన మేము.

పలకపోయి పొత్తమొచ్చె :

అది 1950, కొత్త ఏడాదంట. అంతాకంటా ఉండిన ప్రభవ, ప్రమోద అనే సమచ్చరాలు పోయె. సంకురాత్రి నెల, శివరాత్రి నెల, ఉగాది నెల, మార్నోమి నెల, నోముల నెల, సూన్యపు నెలలు పోయి, చైత్రము, వైశాఖము నెలలు వచ్చి, అవీ పోయి, జనోరి, ఫిబ్రోరి, మార్చి నెలలు వచ్చి పల్లెల్లో కుదురుకొంటా ఉండాయి.

ఇంక మూడు నాలుగు నెలల్లో అవేటివో పెద్ద పరీచ్చలు వస్తాయంట. మేస్టర్లు ఇచ్చే ప్రశ్నాపత్రాలను సూసి, వాచకాలను సూడకుండానే జవాబులు రాయాల్నంట. లెక్కలు కూడా అంతెనంట. కూడేదీ కళిసేది (తీసివేసేది) గుణకారం బాగహారం అన్నీ ఇంకమీదట కాగితాల మీద పెనసలుతో రాయాల్నంట.

ఇన్నాళ్లూ మేము పలకాబలపాలతోనే రాస్తా ఉంటిమి. కొత్త కొత్త పలకలు, వన్నెవన్నెల బలపాలు, సన్నరాత బలపాలు, దప్పం (లావు) రాత బలపాలు ఎంతెంత బాగుండె మాకు. అన్నీ పోయె. కాగితాలూ పెనసళ్లూ రాతపొత్తాలూ అన్నిటినీ కొనిపించి తెప్పించిరి మేస్టరు. జమటగీతల (డబుల్ రూల్డ్) చూసిరాత పొత్తాల్లో, పైన ఒక సోలు మేస్టరు రాసిస్తే, దాన్ని చూసుకొని అట్లే దిగువ సోళ్లంతా మేము రాయాల. ఇట్ల రాసిరాసి ఒకొకరు పదిపది పొత్తాల్ని సించినంక పెనసలు రాత బాగా కుదిరె. మాదిరి ప్రశ్నలూ జవాబులూ రాపించేదే పనిగా పెట్టుకొనె మేస్టరు. మూడోతరగతి వాచకాల్లోని పాటాలు, పెద్దబాలశిక్షను సదివిండే మాకు లెక్కేలేకుండా అయిపోయె.

పెద్ద పరీచ్చంట, అదెట్లా పరీచ్చో, ఏమి రాయాల్నో అనే దిగులు ఒకపక్క ఉండనే ఉంది. అదీకాక అది సర్కారు పెట్టే పరీచ్చంట. ఏప్రిల్ నెల కడసీ వారమొచ్చె. మాకు ఇంతకంటా తెలియని పెద్ద పరీచ్చ వచ్చె. ప్రశ్నపత్రముని ఇచ్చి దూరదూరంగా కూకోబెట్టిరి. చూస్తా చూస్తా కొందురికి ఇంతేనా పెద్ద పరీచ్చ అనిపిస్తే, కొందురికి పరవాలేదనిపించె. పరీచ్చను రాసేస్తిమి. అవిటికి (వాటికి) మార్కులేసి సర్కారు సెప్పినంక, పాసో పెయిలో సెప్తాము అనిరి. ఇస్కూలుకు బిడువులు ఇచ్చిరి. ఎగుర్లాడతా దుముకులాడతా ఊరికి సేరితిమి. కానీ మరుసనాడే మా అనందము ఆవిరైపోయె.

కొత్తకొత్త పొత్తాలు :

బిడువులిచ్చిన రెండోనాడే మా మేస్టరు మా ఊరికొచ్చినాడు. మా పెద్దోళ్లనీ మమ్మల్నీ రచ్చతావుకి పిలిపించుకొన్నాడు. మమ్మల్ని సూపిస్తా మా పెద్దోళ్లతో 'ఈ నాయాళ్లు ఇంకమీదట ఆవుల సిన్నోళ్లతో జతపడి దిన్నల్లో వంకల్లో ఎగుర్లాడుకోని ఉండిపోతారు. ఈసారి నాలుగో తరగతికి పోతారు కదా, రెండుమూడు పుస్తకాలను సదవాల. పాత పాటాలనూ సదువునూ మరిసిపోకుండా ఇంటితావ రవంచ పొద్దన్నా సదివించండ. ఒకొక గంటన్నా నాతావుకి పాటానికి పంపండ" అని సెప్పినాడు.

'అయ్యో శివపూజలో కరడి (ఎలుగుబంటి) దూరినట్లాయె కదరా' అనుకొంటిమి. ఇంకేమి సేసేది? మేస్టరు వాళ్ల ఊరికి పోతావస్తా ఆడే ఆటలు ఉండనే ఉంటాయి. ఒక గంటే కదా పాటము, సరేకానీ అని తయారయిపోతిమి.

మేస్టరు మాకంతా నాలుగోతరగతి పుస్తకాల్ని తెప్పించి పాటాలను సురువు సేసేసినాడు. నాలుగో తరగతిలో మూడు వాచకాలు ఉండాయి. ఒకటి తెలుగు వాచకము, రెండోది హిందూ దేశ చరిత్ర, మూడోది పౌరశాస్త్రము. ఒకొక పొత్తములోనూ దినానికి ఒకొక పాటమును సదవాల. పెద్దబాలశిక్షను సదివిందదే మాకు, ఈ కొత్త పొత్తాల పాటాలను సదివేది లెక్కలేక పోయింది. కానీ రాసేది, అర్తాలు సెప్పేది మాత్రము రవంచ కష్టమాయె.

ఇస్కూలు తిరగా సురువయ్యేతలికి మేము నాలుగో తరగతికి పోతిమి. రవంచ పెద్దతనము వచ్చినట్లాయె మా మనసుకు. బిడువుదినాల్లా సదివుండిన మాకు, పాటాలు సులువుగానే ఉండాయికానీ, పుస్తకాన్ని ముట్టకుండా పూర్తిగా ఆటల్లో మునిగిపోయినోళ్లకు మాత్రము శానా కష్టమయిపోయె.

తెలుగు వాచకము జతకు ఇంక రెండు పొత్తాలు సేరిపోయె కదా. హిందూదేశ చరిత్ర పొత్తములో, మొదటి పాటము సత్యహరి శ్చంద్రుని కత, రెండోది రామాయణ కత, మూడోది మహాభారత కత, ఆ మీదట కాకతి రుద్రమ్మ, ఛత్రపతి శివాజీ, ఝాన్సీరాణి, శ్రీకృష్ణదేవరాయలు పాటాలు ఉండాయి. పౌరశాస్త్రములో గ్రామాల పరిశుభ్రత, శుద్ధమైన నీరు, ఆరోగ్యము వంటి పాటాలు ఉండాయి. అన్నిటినీ అంటిపండును ఒలిచి పెట్టినట్ల బాగా నేర్పిస్తా ఉండాదు మా మేస్టరు. మేమూ సోంబేరితనం సూపకుండా సదవతా ఉండాము. సదవను సదవను మా బాసకూడా రవంత రవంత మారతా వస్తా ఉంది. ఇంతకు ముందు సేసి, సూసి, సదువు, సెయ్యి అంటుండేవాళ్లము, ఇపుడు చేసి, చూసి, చదువు, చెయ్యి అంటుండాము. రండ, పొండ, తినండ అనే మాటలు, రండి, పొండి, తినండిగా మారతా ఉండాయి. ఎంతమారినా అది ఇస్కూలు వరకే, ఇంటి తావున మా తేట తెలుగే.

(తరువాయి రాబోయే సంచికలో...)

ప్రజల భాషలో పరిపాలించేదే ప్రజాస్వామ్య ప్రభుత్వం

సన్నిధానం నరసింహశర్మ
9292055531

రెండు మహర్దశల నిండు వెలుగుల్లో
గౌతమీ పొత్తపు గుడి


డా॥ అరిపిరాల నారాయణరావుగారు

"సిరులెల్లక్షరము లక్షరమైన సిరిజూపు
ఆప్తోపదేష్ట గ్రంథాలయమ్ము"

అన్నారు ఓపద్యంలో కల్లూరి వెంకట సుబ్రహ్మణ్య దీక్షితులుగారు. నిజమే మరి. సంపదలన్నీ నాశనమయ్యేవే. కాని గ్రంథాలయాల్లో గ్రంథరూప జ్ఞాన సంపదలు నాశనం కావివి. గ్రంథా లయం బంధువు వంటి గురువుగా ఉండి నాశనంగాని ఆ సంపదల్ని చూపుతాయి. అయితే ఆ పొత్తాల సిరులు మనవల్ల సరైన శాస్త్రీయ రక్షణ కల్పించుకో భవనాది సౌకర్యాలు కల్పించకో నాశనమవుతాయి.


ఆకుల సత్యనారాయణగారు

గ్రంథాలయ సేవా వ్రతుల అంకిత సేవల వల్ల ఇప్పటికీ మనకున్న పొత్తాల సిరుల మొత్తాలు తక్కువవేమీ కాదు.

రాజమంద్రంలోని శ్రీ గౌతమీ గ్రంథాలయం, వేటపాలెంలోని సారస్వతీ నికేతనం, హైదరాబాదులోని శ్రీకృష్ణదేవారాయాంధ్ర భాషా నిలయం, నెల్లూరులోని వర్ధమాన సమాజగ్రంథాలయం, అనకాపల్లి లోని శారదా గ్రంథాలయం, ఇంకా మరికొన్ని అవి ఏ ప్రాంతాలలో నున్నా ప్రాంతాలకతీతంగా పాఠక, పరిశోధక, రచయితల సమూహాలకు సేవలు దశాబ్దాల తరబడి అందిస్తూనే వున్నాయి.

ఇందులో తెలుగువారి ప్రాచీన సాహిత్య నిధులైన కావ్య, నాటక, పత్రికా సంపుటాలు రికార్డులు మరెన్నో విభాగాలవి గణనీయంగా అపురూపంగా ఉన్న గ్రంథాలయాలు శ్రీగౌతమీ ప్రాంతీయ గ్రంథాలయం, సారస్వత నికేతనం, శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం.

ఇందులో శ్రీ గౌతమీ ప్రాంతీయ గ్రంథాలయం 1979 వరకూ ప్రయివేటు గ్రంథాలయంగా ఉండి, రెండున్నర సంవత్సరాల ప్రజోద్యమఫలంగా 1979 ఫిబ్రవరి 19వ తేదీన రాష్ట్ర ప్రభుత్వంవారి ప్రాంతీయ గ్రంథాలయమైంది.

గౌతమి నాళం కృష్ణారావుగారిచే స్థాపింపబడింది. స్వర్ణ ఘట్టాలను చూసింది. ఆటుపోటులు ఎదుర్కొంది. ప్రధానంగా భవన సౌకర్యాలు తగినట్లు లేకపోవడం వల్ల ప్రజలు ప్రభుత్వానికి అప్పజెప్పారు. తొలుత దొరతనం అరకొరగా భవన సౌకర్యాలు కూర్చారు. శాస్త్రీయ గ్రంథ రక్షణ తాళపత్ర వ్రత ప్రతుల రక్షణ అరకొరగా జరిగింది.

కాని ఇటీవల ఏకకాలంలో రెండు మహర్దశలు గౌతమికి పట్టాయి.

అలా పట్టడానికి కారకులు ప్రధానంగా ఇద్దరు. ఒకరు రాజమండ్రి శాసన సభ్యులుగా ఉండిన శ్రీ ఆకుల సత్యనారాయణగారు; రెండవవారు ఈ రెండువారు ఈ రెండు మహర్దశల మార్గాలకు వెలుగు బావుటా చేతబట్టిన పరిశోధిక రచయిత డా॥ అరిపిరాల నారాయణరావుగారు. గట్టి పట్టుదల, నిర్మాణ కార్యధురీణత, నిస్వార్థ పరత్వం వంటి సుగుణాల మేలు కలయికగా ఇద్దరి తలపులూ ఒకటయ్యాయి.

భవనాల నిర్మాణాలు : - వివిధ గ్రంథాలయ కార్యకలాపాలకు అత్యంత ఆధునిక భవన విభాగాలు అందచందాలతో రూపు కట్టాయి. శ్రీ ఆకుల వారి కృషివల్ల ఎం.పి.నిధుల నుండి 70 లక్షల రూపాయలు, ముఖ్యమంత్రి ప్రత్యేక అభివృద్ధి నిధుల నుండి 2 కోట్ల డెబ్బై లక్షల రూపాయలు రాబట్టగలగడం వల్ల భవన నిర్మాణాలు మంచి ఊపులోకి వచ్చాయి. డా॥ అరిపిరాల వివిధ గ్రంథాలయాల వినూతన భవన ఆధునిక నిర్మాణాలు ఎలా వున్నాయో పరిశీలించి, పరిశోధించి శాసన సభ్యుల దృష్టికి తీసుకురాగా నిర్మాణాత్మక మార్గ దర్శకత్వం లభ్యపడిందని శ్రీ ఆకుల వారు భావించి ఇంజనీర్లను కూడా అరిపిరాల చూపుడు వ్రేళ్లను బట్టి రూపకల్పనలను చేయమన్నారు. వారూ అలా చేశారు. గ్రంథాలయ 'మూల' సేవాంకితులైన తొలినాటి మేటి పేరులు భవన విభాగాలకు ఉంచబడతాయి.

రెండవ మహర్దశ డిజిటలైజేషను :

ఆచార్య క్రొత్తపల్లి వీరభద్రరావు గ్రంథాలయాలను రెండు రకాలుగా అభివర్ణించారు. గొప్ప గ్రంథ సంపదలుండి కూడా ఆలయాలు (భవనాలు) లేనివి ఒకరకమైతే; భవనాలుండి గొప్ప గ్రంథ సంపదలు లేని గ్రంథాలయాలు మరొక రకమైనవని. మొదటి రకం గ్రంథాలయం గౌతమీ గ్రంథాలయమని అప్పట్లో అభిప్రాయపడ్డారు.

ఇప్పుడు రెండు కొరతలూ లేని పొత్తపుగుడిగా గౌతమి నూతనంగా ఆవిష్కరింపబడుతోంది. తగిన భవనాలు లేక వర్షధారలు గ్రంథాలయంలో బీరువాలపై పడడం, పుస్తకాలు కొన్ని చెదలు పట్టడం సి.నారాయణరెడ్డిగారి వంటి సరస్వతీ పుత్రులు కన్నీటి పర్యంతమవడం ఎన్నో సంఘటనలు జరిగాయి. ఈనాడు పత్రిక పుడుతూనే మొదటి సంచికలోనే గౌతమి సమస్యలు, గ్రంథ రక్షణాది విషయాలు సవివరంగా రాష్ట్రమంతా ఇవ్వడంతో ఈ సమస్య వ్యాపింపజేయడంతో ఇందలి గ్రంథాల రక్షణ తక్షణ కర్తవ్యమని ప్రజలు



డిజిటలైజేషన్ టీమ్

ప్రజా ప్రతినిధులు భావించారు. ఆనాడు ఈనాడు ప్రభుత్వ స్వీకరణకు తోడ్పడింది.

మైక్రో ఫిల్మ్, మైక్రోఫిచ్, స్కానింగ్ డిజిటలైజేషను వంటి ఆధునిక సౌకర్యాల వల్లే గ్రంథ సంస్కరణ జరుగుతుంది. ఇందులో డిజిటలైజేషనుకు ఉన్న ప్రయోజనాలు, శాస్త్రీయ అంశాలు, దీర్ఘకాలిక అంశాలను గమనించారు, డా.అరిపిరాల. ఒక సందర్భాన రాజ మండ్రి సీతంపేట శాఖా గ్రంథాలయంలో తాము, శాసన సభ్యులు శ్రీ ఆకుల సత్యనారాయణగారితో, నగర మేయరు ఇద్దరితో ముచ్చ టించి ఒకసారి గౌతమికి రావలసిందిగా సూచించి అక్కడ భవనాది అంశాలు డిజిటలైజేషను అంశాలు వారికి నాటబలకడం జరిగింది. గౌతమీ గ్రంథాలయాభిమానంతో శ్రీ ఆకుల పచ్చజండా వూపారు. శ్రీ నారాయణరావు కార్యక్రమం బండి వేగం పుంజుకుంది.

భవనాల నిర్మాణం విషయంలో దొరతనం ధనం ఎంత వుందో అది సరిపోకపోతే నేను తక్కినవి ఇస్తాను. అని వెన్ను తట్ట డంతో అరిపిరాలవారికి ఆకుల వారి ప్రోత్సాహం నిర్మాణాత్మకంగా గ్రంథాలయానికి వినియోగించారు. రాజీలేకుండా చక్కని భవన నిర్మాణాలు వచ్చాయి.

ఇంతలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియావారు. ఈ సత్కార్యాలకు హర్షం వ్యక్తం చేస్తూ తాముగా నాలుగున్నర లక్షల వ్యయం చేసి జిరాక్సు, కాపీయింగ్, స్కానింగ్ వంటి బహుళార్థ సాధకాలయే సాంకే తిక యంత్ర సామాగ్రి ఏర్పడేలా చేశారు.

డిజిటలైజేషన్ కార్యక్రమం గురించి శ్రీ నారాయణరావు స్పందిస్తూ "ఎనిమిది లక్షల రూపాయలు స్వతంగా వెచ్చించి పూర్తిగా గ్రంథాల డెజిటిలైజేషను కార్యక్రమానికి శాసన సభ్యులు శ్రీ ఆకుల సత్యనారాయణగారే కారకులు. మా పనిలో మనసు ఫౌండేషనువారు మనసు పెట్టి సహకార సూచనలిచ్చారు. గ్రంథాలయ సంచాలకులు, గెజిటెర్ లైబ్రేరియన్ శ్రీ ఆర్.సి.హెచ్. వేంకటరావు సానుకూలంగా వ్యవహరించారు.

ఇప్పటికి పది లక్షల పుటల డిజిటలైజేషన్ జరిగింది. ఇందులో ఏడువేల పుస్తకాలున్నాయి. ఇందులో అపురూప అమూల్య ప్రాచీన గ్రంథాలున్నాయి. సంస్కృతం, తెలుగు, ఆంగ్లం, ఉర్దూభాషలవి వున్నాయి. 1950కి పూర్వం పుస్తకాలే ఈ కార్యక్రమంలో భాగమ య్యాయి. 1348 కి చెందిన ఉర్దూ అపురూప గ్రంథం, కలకత్తా నుండి మద్రాసు వరకూ అంశాలుగా గల ఈస్టిండియా కంపెనీ కాలానికి చెందిన కరస్పాండెన్సు ఉన్న గ్రంథం కూడా ఉంది. ఆస్థా నహం చేసిన శ్రీపాదకృష్ణమూర్తి శాస్త్రి స్వహస్త దస్తూరీతోగల వ్రాత ప్రతులు, కబీరు అభంగాలు, మూడు మెకంజీ వ్రాత ప్రతులు ఇంకా 1900 కి పూర్వపు ప్రాచీన గ్రంథాలు కూడా ఉన్నాయి' అని వివరిం చారు. శ్రీ ఆరిపిరాల ఆధ్వర్యంలో వై.హేమసుధ, పడాల మీనాక్షి నాగిరెడ్డి వేంకటేష్, జలగం భరత్, కె. రామప్రసాదు అనే అయిదు గురు దళ కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరందరికీ జీతనాతాలు శ్రీ ఆకుల సత్యనారాయణగారే యివ్వడం గమనార్హం. 2019 జూలైతో ఈ కార్యక్రమం ముగుస్తోంది కాగా పదిలక్షల రూపాయలుంటే ఈ కార్యక్రమాన్ని సంపూర్ణవంతం చేయవచ్చు.

భవన నిర్మాణం, డిజిటలైజేషన్ మార్గనిర్దేశకులు, ప్రేరకులు అయిన డా.అరిపిరాల గౌతమీ అభిమానం దశాబ్దాల నుండి వస్తున్నదే. 1985లో గౌతమిలోని 1862 పొత్తం హిత సూచని పునర్ముద్రణకు ఎంతో కష్టపడ్డారు. బెనారసు విశ్వవిద్యాలయం నుండి 19వ శతా బ్దపు సాహిత్యశైలి – గురజాడ రచనలు పరిశోధనలపై డాక్టరేటు పట్టా పొందారు.

1985 డిశంబరు 6,7,8, తేదీల్లో నరసాపురంలో తెలుగు వెలుగు మహాసభల్ని భారతదేశంలోని కవి పండిత పరిశోధక ఆచార్య ప్రముఖులతో నభూతోభవిష్యతిగా చేశారు. రోణంకి, ఆరుద్ర, తంగి రాల మొదలైన 500 మంది హేమాహేమీలు పాల్గొన్న సభలవి వాటికీ సూత్రధారి డా.అరిపిరాలే. 'మధునాపంతుల సాహితీరేఖలు. లేఖలు, ఎన్నో సంచికలకు, గూడూరు నమశ్శివాయ రాసిన ప్రకాశం పంతులు పుస్తకానికీ ఆయన సంపాదకత్వం వహించి ముద్రింప జేశారు. 'ఎదురీత' స్వీయ వ్యాస సంపుటి వేశారు.

తన విశ్రాంత ఉద్యోగ సందర్భాన వై.ఎన్.కళాశాలకు కొత్త పుస్తకాలు, అరుదైన పుస్తకాల్ని బీరువాలతో సహా ఇరవై వేల ఖరీదు చేసేవి ప్రదానం చేసిన ప్రదాన వ్యక్తి ఈయన. కందుకూరి స్వీయ చరిత్రను ఆంధ్రకేసరి సమితిచే తిరిగి అచ్చు వేయించిన సచ్చరిత్రు డీయన. మంచి వ్యాస రచయిత, పరిశోధకుడు, గ్రంథ పరిష్కర్త, పాత పుస్తకాల వేట కాదు, మడి పనులు కాక ఉమ్మడి సాహిత్య కార్యక్రమాల సేవలు చేసిన గత కీర్తి వుండడం వల్లే ఆ ప్రేరణతోనే మహోద్యమంగా యజ్ఞంగా గౌతమీ డిజిటలైజేషన్ ను నిర్వహించారు.

ఈ డిజిటలైజేషన్ కార్యక్రమం నుండే గౌతమీ పుస్తకం చింతామణి నాటకం 1920 వ ముద్రణ ప్రతి ఫ్రెంచి వ్యక్తి, పండితుడు. దానియేలు నైజర్సుకి ఇచ్చారు. ఆయన ఈ కార్యక్రమాన్ని లిఖిత పూర్వకంగా ప్రశంసించారు. తెలుగు మహిళల రచనలపై పరిశోధనలు చేస్తున్న కాశ్మీర్ యువ పరిశోధకుడు అహ్మద్‌షెఫీ సైతం ఈ కార్యక్రమాన్ని అభినందించారు. ఇటీవల మాజీ డిప్యూటీ స్పీకరు శ్రీ మండలి బుద్ధప్రసాద్ గౌతమిలోని ఈ పుస్తక రక్షణ కృషిని సమీక్షించి 'నా మనస్సునకు నచ్చినపని ఎంతగానో ఆనందం అని రాశారు. నిజానికి తెలుగు గ్రంథాలయ జ్ఞానాభిమానులకు అందరూ మెచ్చే పనియిది. ఆనందం సర్వ సాహితీ ప్రజానందం.

ఏమైనా రెండు మహర్దశల నిండు వెలుగుల్లో– రెండు తెలుగు రాష్ట్రాలకీ కావలసిన గౌతమి పొత్తపుగుడి వెలుగుల్లో సరస్వతీ దర్శనాన్ని చేయించడం ఆమోద హేతువేకాదు;

ఆహ్లాదహేతువు కూడా.

కీ.శే. పలగాని గోపాలరెడ్డి

విఖ్యాత దివిసీమ

పవిత్ర కృష్ణవేణి పాయల నడుమనిమిడి, ఆ నీటిచే తడిసి పునీతమైన రేగడి దివిసీమకు చరిత్రలో ఒకవిశిష్టత ఉందని గుర్తించిన శ్రీయుత గొర్రెపాటి వెంకట సుబ్బయ్య వంటి వారు ఈ దివిసీమ చరిత్రను వెలికి తెచ్చినారనవచ్చును. చన్నీటికి వేడి నీరన్నట్లు నాకు తోచిన కొన్ని అంశములను విజ్ఞులముందుంచడమే నా ఈ వ్యాసోద్దేశం.

క్రీస్తు శకారంభ ప్రాంతంలో సముద్రాలను గడుస్తూ కృష్ణానది మొగల వద్దకు చేరుకొన్న విదేశీయులు నిక్షిప్తం చేసిన వ్రాతలవల్ల ఆ ఏటిమొగవద్ద ఆనాటికే "మైసోల"గా పిలువబడ్డ ఒక నౌక విశ్రమణముండినటుల చరిత్రకు తెలుస్తుంది. ఆ మైసోల అన్న పేరుకొక నిర్దిష్టమైన అన్వయమున్నందున ఆ పేరు విదేశీయుల అపభ్రంశ పలుకుకాదు. ఆ అనాది కాలంలో స్థానికులందరి నోట నానిన పేరది.

మై + సోల అన్నదాపేరుకు విరుపు. పూర్వభాగమైన "మై" (తమి) అన్న పదం మేషం లేక మేకకు సూచకం. గగన శాస్త్రానుసారం రాశి చక్రంలో మొదటిది మేషరాశి. రాశి చక్రాన్ననుకరిస్తూ ఒకానొక ప్రముఖ ప్రదేశాన్ని కేంద్రంగా భావించి, దాని పరిసరాలను దాని దిశకోశాలందున్న రాసుల పేర్లతో పిలిచిన సందర్భాలున్నవి. ఆ విధానం మేష లేక మై (తమి) రాశి తూర్పు దిశాసూచకం.

నెల్లూరు జిల్లాలో ఒకనాటి రేవు పట్టణమైన గంగపట్టణమునకు తూర్పుదిశలో మైపాడన్న గ్రామమింకా, ఉన్నది. తమిళనాటితో ఎడనెడా తగిలే మెయిలాడుతురై (మై + ఇల్ + ఆడు + తురై న్నిటి వరకు మాయహరంగా పిలుపు), చెన్నై శివారైన మైలాపురం (మై + ఇల్ + పురం), మైలం (మైం + ఇల్లమ్), ఇత్యాదులన్నీ "తూర్పు వీడు" వంటి పేర్లే. జగ్గయ్యపేటకు తూర్పు దిశలో ఒక మైలవరమున్నది. ఈ సామ్యాలను బట్టి "మై" అన్నది దిశా సూచకంగా నా ప్రతిపాదన.

ద్వితీయార్థమైన "సోల" అంటే (పాము కోరవలె పోనుపోను సన్నబడని) ఏటిమొగ అనెడి అన్వయాన్ని సాధించగలం.

ఏదయినా ఏటిమొగ వద్ద పోటు పాటులందు, రోజూ రేపటి మాపటి వేళలన్న విధంగా, ప్రతి దినం రెండుమార్లు కొంత నీరెక్కి అంతే నీరు దిగిపోతుంటుంది. ఎదుర్కోలన్నట్లు సమస్థాయైన ఆ నీటి కదలికలు ఏటిమొగ వద్ద దిగబడి, మొగకడ్డపడే పూడిక మట్టిని తొలగించలేవు. పూడికతో మెరకైన ఏటిమొగ నౌకల ఆగమన నిగమాలనుకనుగుణం కాదు. ఆ నది పరీవాహక ప్రాంతం నుండి దిగిన వరదనీరో లేక ఆ నది కాలువల క్రిందిసాగయ్యెడి పంట పొలాల సముదాయం నుండి దిగజారి ఆ నదిలోనే పడెడి పులక (మురుగు) నీరో కలిసి, ఏటిమొగ పై పాటును మించిన నీరు పారితే, ఆ బలపడిన ఉరవడికి ఏటిమొగ పూడిపోదు. ఏటికొచ్చే వర్షాకాలపు వరదలైతే అటొచ్చి ఇటుపోతాయి. ఒండ్రును మోసుకొన్ని మొగవద్ద దిగవిడిచి అచ్చటి మెరకకు అంతో ఇంతో తోడ్పడుతుంది కూడా. కానీ పంట పొలాలనుండి దిగివచ్చే పులకనీటి జాలులో ఒండ్రు సమస్య ఉండదు. అంతేగాక ఇటొచ్చి అటుపోవు వరదలవలె అల్పకాలికం కాక "ఏడుమున్నూరు దినాలు" (నెల్లూరు మాండలికం)గా (ఏడాదిలో సింహభాగం) పటు నీటికి సహాయకారికాగలదు. కానీ ఆ నీటి పరిమాణము ఉధృతి కొంత స్వల్పమే కావచ్చు. ఏడాది పొడవునా అన్నట్లు సుదీర్ఘకాలం స్రవించే అట్టి పులకనీటి జాలుకు, అదుపు కొరవడినట్లు, నోటి నుండి నిలువక స్రవించు "సొల్లు" లేక "జొల్లు"తో పోలిక. ఆ పదాల పరిణామ రూపాలే సోల, జోల వంటిపదాలు. అమ్మజోలపాటకు స్థాయి మంద్రము గతి మందము. అలసి సొలసి జీవ సోలిపోయి మగతలోకి జారును. అట్టి తూగుతూ దిగెడి నీటి జాలున్నదే గోదావరి తొలిపాయి (తుల్యభాగ). దానికి సముద్ర సంగమం కాకినాడ దిగువనున్న (సొ) చొల్లంగి వద్ద. అది కూడ అలనాటి రేవు ప్రాంతమే. దాని జాలంతా పులక నీటి మయమే. తమిళనాటిలో "జోలారు" (జోల ప + ఆర్) ఉందా ? జోలారుపేట అట్టి నదీతీరస్థమని నమ్మిక. కళింగ దేశంలోని "జోలాపుట్టి", మహారాష్ట్రలోని సోలాపూరు, ద్రవిడ దేశంలోని సోలింగరు వంటి ప్రదేశాల పరిశీలన, తులనాత్మక విశ్లేషణలు నా ప్రతిపాదనను సమర్థించగలవని నమ్మిక. నెల్లూరు జిల్లా గంగపట్నం వద్ద తగిలే "సార్ముడి" లోని "సారు" కూడ "సొల్లు" వంటి పదమే. ఆ ఊర్లో అనాది సోల నారాయణాలయముంది.

పైన వివరించినిట్టి "సోలు" లేక ఏటిమొగతో అలనాటి చోళ జాతి ప్రభువులు, గుజరాత్‌లోని సోలంకి జాతి వారికేదయినా లంకె ఉన్నదో చూడవలసి ఉన్నది.

కృష్ణ ఎడమపాయి మొగకు దగ్గర్లో "సార్లగొంది" గా పిలువబడెడి ఒక ఊరుంది. అనెగొందిని తలపుకు తెలుస్తుందా పేరు. సొరచేపలకు నెలవైన "సిజ్ఞ" అని పిలిచెడిదా పేరు. కానీ, జీవశాస్త్ర ప్రమాణానుసారం ఏటి మొలగలకెగువనున్న ఉప్పు చప్పటి నీటిలో "సోర"లు, దాని సంతానమైన పాలసొరలు స్థావరం చేసుకొని జీవనం సాగించలేవు. ఆ పేరు "సొల్లగొంది" కి అపభ్రంశ పరిణామ రూపమని నానమ్మకం. అగుచో ఆ సొర్లగొంది కూడ కాకినాడ వద్ద తగిలిన "చొల్లంగి" వంటి పేరౌతుంది.

కృష్ణానది రెండుపాయలతో సంబంధంలేని మరి రెండు రేవు పట్టణాలా ఉత్తరసీమల్లో ఉన్నవి. అవి (1) మచిలీపట్టణము; (2) పెద్ద పట్టణము. ఈ మచిలీపట్టణము "సోలకంటే భిన్నమని నా భావన. ఏమంటే మచిలీపట్టణమున్న పేరులోని "మచిలీ" మీన కోణ (ENE) సూచకం.

ఈ మైసోలలో తమతమ నీటి జాళ్ళను దిగవిడచిన గెడ్డలు లేక సెలలేమున్నవో చూడవలెనంటే నేటికా దివిసీమ ప్రాంతపు నైసర్గికమెంతో చెదిరిపోయింది. అచ్చట తగిలే కొన్ని ప్రాదేశిక నామాలు చూచాయ సాక్ష్యములుగా ఇంకా ఉన్నవి.

దిగుడుబావి మెట్లపై దిగనడచిన విధంగా కదలెడి గెడ్డ లేక వాగుల పేర్లు ఉత్తరాంధ్రలో అతి సామాన్యం. దివిసీమలో పులిగెడ్డ, అవగ్గెడ్డలతోపాటు ఆ సమీపంలోనే పురిటిగెడ్డ, వక్కలగెడ్డ అనెడి గ్రామాలున్నవి. పులిగెడ్డ అన్నపేరు నెల్లూరు జిల్లా (వాకాడు మం॥) లోని పులికాలవను పోలినపేరు. ఆ పులికాలవ అచ్చటి ప్రాచీనరేవైన దుగ్గరాజ పట్టణానికి ప్రాణ ప్రధాత. ఆ సమీపం లోనిదే పులికట్టు సరస్సు అందులోని ఒక ఊరు పులింజేరి (నేడులేదు). తెనుగు – తెలుగులందు కన్పించే ల – న మార్పును మందిలో ఉంచుకొంటే, ఆవన్గెడ్డకు అవల్గెడ్డ మారుపేరు కాగలదు. బియ్యపు గింజసాగదంచితే, చదునైన అటుకులు లేక "అవల్" (తమి) లేక అవల్ + అక్కి (కన్న) సామ్యాంగా గ్రహిస్తే అవల్గెడ్డ అంటే విస్తారమైన పరపునేలపై పాగిపోయెడివాగు. తిరుచానూరు వ (చిత్తూరు జిల్లా) వద్ద ఉన్నది. కర్నూలు జిల్లాలో తుంగభద్ర తీరాన నెలకొన్న "అయిజ" కూడ అట్టి వాలుతలమే. అవచితిప్పయ్య సెట్టి పూర్వీకుల నెలవైన అవనాశి దక్షిణ ద్రావిడ దేశంలోనిది. ఇవన్నీ నదీతీరస్థ ప్రదేశములే. పురిటిగడ్డ అంటే తడి ఆరని ప్రదేశంగా చెప్పవచ్చు. నెల్లూరు జిల్లాలో కడలేరు ప్రాంతంలో ఒక పురిటిపాలెం. ఇతరత్రా ఒక పురిణి (శాసనోక్తనామం – "పురుణ్ణిల్") ఉంది. అవి రెండూ చిత్తడినేలలే. మరొక జాల్లు ఆ దగ్గర్లోని "ఒక్కల గెడ్డ" దిగవ స్వర్ణముఖి కుడిగట్టు "ఒక్కట్టునాడు"గా పిలువబడినది.

ఒక గెడ్డలతోపాటు ఒక "సెల" కూడ ఉండినది. అదే ప్రాకృత శాసనాలలో "కణక సెల", "కణ్టక సొల" గానూ పిలువబడిన అనాది వాణిజ్య కేంద్రం. నేటి ఘంటసాలగా గుర్తించబడినది. సెల ఏరంటే వంపులు లేక సన్నగా ప్రవహించెడి నవ్యవాహిని (Nascent) ఆ కంటక సెల, కృష్ణ మొగలోని మైసోలకు చెప్పుకోదగినంత దూరంగా ఎగువగా నదిలో పడినది. ఈ పేరులోని "కంటక" భాగం కృష్ణానది కుడివైపు దరిపై (అమరావతికెగువ) సున్నకండేరు వాడి అదే కంద్ర వాడి ప్రాంతపు పేరును తలపుకుతేగలదు. ఆ దిగువ వెలనాటిసీమలో మరొక కంద్రవాడి కూడ ఉంది. దానిని ఈవని కంద్రవాడిగా పిలిచిరి. దిగువ నెల్లూరుజిల్లాతో అనాది రేవుపట్టణమైన "కొల్లుత్తురై" (నేటి కృష్ణపట్నం) "కణ్ణలేటు" మొగవద్దనే ఉంది. "కణల్" (తమి) అంటే ఉప్పుచప్పని నీటిని తట్టుకొని పెరిగెడి ఆల్చి, చిల్ల పొన్నవంటి మొక్క లని ఒక భావన. అందువల్లే కండేరువాడి, కంటక సెలవంటి వాగులు అట్టి ("కణల్") మొక్కలమయమను కొనవచ్చును. అలాకాకపోతే గడ్డి పెద్ద – (గడ్డశిల, గడ్డకత్తెర వంటివి సామ్యాం) ఏలులేక సెలగా నైనా చెప్పవచ్చును. దేశంలో ఇతరత్రా "గణ్డకి"వంటి పేరున్న నదులు న్నాయి. వీటన్నిటి పరిశీలన, తులనాత్మక విశ్లేషణ చేస్తే మరింత విశదం కాగలదు.

నాటి మైసొలకు వచ్చిపోయిన నౌకల వివరాలు లేవుకానీ కొన్ని ఆధారాలున్నవి. అవచితిప్పయసెట్టి పరంగా తీరవ్యాపార ప్రసక్తిగా శ్రీనాథకవి "కప్పలి జోంగు"ల నెడి నౌకలను పేర్కొన్నాడు. వర్తకులు ప్రతివానికొకటన్నట్లు, విశ్రాంతితో పాటు, సరుకు, డబ్బు, జాగ్రత్తపరచుకొనే గది సౌకర్యాలున్న పెద్ద నౌకను "కప్పల్" (తమి) అనడం ఇంకా ద్రవిడ దేశంలో వినగలం.

ఆగ్నేయాసియా తీరదేశాల్లో జోంగు(నేటి)లు వాడిన దాఖలా లున్నవి. దివి సీమలో (చల్లపల్లి మం॥) కప్పలదొడ్డి పేరిట ఒక గ్రామమింకా ఉన్నది. కప్పల్ నౌకల నడిపిన వారు స్థిరపడిన నెలవుగా నా పరిగణన. ఏమంటే నెల్లూరు జిల్లాలో అలనాటి రేవు పట్టణాలైన దుగ్గరాజపట్టణం సమీపంలో ఒక కప్పరమ్.దు, కృష్ణపట్నం రేవుక న్నట్లు ఒక కప్పలదొరువు పేరుతో గ్రామాలింకా ఉన్నవి. బహువచన సూచకమైన "ల" లేక "ఆర్" (తమి)లున్న పేర్లతో కన్పించే ఊర్లు ఏకజాతివారి ఆవాసములే (ఉదా. అంగలకుదురు, వాకలపూడి ఇత్యాది) కాళహస్తిలో దొరికిన (క్రీ.శ. 1529 నాటి) ఒక కన్నడ శాసనం ప్రకారం విజయనగర ప్రభువైన అచ్యుతదేవరాయలు దుగ్గ రాజ పట్టనం, అచ్చటి మరికొన్ని రేవులకై వచ్చెడి "కప్పల్"పై సుంకాన్ని కాళహస్తీశ్వరునికి దఖలు పరిచినాడు. ఈ ఆధారాలను బట్టి "మైసోల" కు "కప్పల్" నౌకలు వచ్చెడివని నాభావన. ఆ సమీపంలో నేటికిన్నీ తగిలే "కప్తానుపురం" గురించి వివరాలు సేకరించవలసి ఉన్నది.

ఓడకంటే చిన్నది నావకంటే పెద్దది పడవ బహుశా "కప్పల్" అంటే పొరపాటుకాదు. కాని "కప్పల్" సముద్రయానమునకే పరి మితమన్న వాదన ఒకటుంది. తప్పనలేము. పడవను "పోతావ్" (తెను)అని కూడ పిలిచినట్లున్నది. దివిసీమలో "పోతరాజు" సర్వ సాధారణ వ్యక్తినామం. ఆ పేరు పల్లీయులకే కాక కాపులందు కూడ ఉన్నది. ఈ పేరు వెనుక ఉన్న చారిత్రకాంశములు విచారణీయం. గుంటూరు జిల్లా (వెలనాడు ప్రాంతం)లోని చేజెర్లలో కపోతేశ్వరాల యపు శికరాలవైపు చూస్తే "తిరగబడిన పోతమ్" తలపుకు వస్తుంది. కపోతేశ్వర నామంలో "పోత" దాగినట్లు తోస్తుంది.

ఈ సీమ పల్లెకాపులదొక విశిష్టత. రోజుల తరబడి రాత్రిం బవళ్ళు లోతు సముద్రంపై నిలచెడి స్తోమతగలవారు కష్టజీవులు. వీరిని గూర్చి తదుపరి మరికొంత తెలుస్తుంది.

దుగ్గరాజపట్టణం రేవు వద్ద నున్న "మల్లాం" అపురూపమైన కార్తికేయ క్షేత్రం. తెనుగునాట తదుపరిదిగా చెప్పుకొనెడిది గుంటూరు జిల్లాలోని "తామ్రప" లేక చేబ్రోలు. ఆ మీదది మైసోలకెగువనున్న మోపిదేవి. ఆ ప్రాంతంలోనే దుర్గమమైన ప్రాంతంలోనే కృత్తివెన్ను మరొకటి. ఆ పేరులోనే కార్తియేయుని జన్మనక్షత్రమైన "కృత్తిక" కన్పిస్తుంది. మోపిదేవి ఆలయంలో కూడ వల్లీ, దేవసేనలు దర్శనమి స్తారు. ఇందుకు సంబంధించిన ఇతిహాసమంతా దాక్షిణ్యాత్య ద్రావిడ సాహిత్యంలోనే ఉంది. నెల్లూరు జిల్లాలో మోపిదేవిని పోలిన "మోపురు"లు మూడున్నాయి. కడపలోని మోపూరుకు అనాది చరిత్ర ఉంది. శాసనాల్లో "మ్రాన్పూరు" గా చెప్పబడిన సందర్భముంది. ఆ మోపూరులన్నీ నదీ తీర్థస్థములే. ఇతరత్రా రామాయపట్టణం కేగువగా అనతి దూరంలోనే ఒక "మోచెర్ల" ఉంది. అదొక నారసింహక్షేత్రం. గుంటూరు జిల్లాలోని "మోపురు" వంటివి ఇతరత్రా ఉన్నవి. వీటన్నింటికి తీర వ్యాపారంతో ఏదో ముడి ఉన్నట్లు తోస్తుంది.

ఇంత వరకు వివరించినదాన్లో ఎడనెడ ద్రవిడపరమైన అన్వయములు, అంశములు తడవబడినవి. నాకు పరిచితమైనవి, వెంటనే అందుబాటులోనివవే కాబట్టి ఈ వ్యాసంలో ఈ ప్రస్తావనలు

తెలుగును బోధించడం కాదు ; తెలుగులోనే అన్నీ బోధించాలి

తగిలినవి. తెనుగునాట ఆర్ష సంస్కృతి వ్రేళ్ళూనని నాటి అంశం "మైసోల" పూర్వద్రావిడాన్వయములను కొనవలెను.

నాటి కంటకసేలకు నేటి పేరు ఘంటసాల తొలినాటి ప్రాకృత నామ మీరూపంగా పరిగణించగలదో లేదో, ఆ భాషాకోవిదులు తేల్చవలసి ఉంది."సాల" (తమి) అంటే, మానవ శ్రమ (Man power) శ్రద్దతో తయారై, రాకపోకల కనువైన రాచమార్గం (MOUNT ROAD = అణాసాలై) గఅసాల అంటే పెద్ద (గణ్డు = పెన్నిధి సామ్యం) రహదారి. నాటి జగ్గయపేట మైసోలల మధ్యరాకపోకలు ఆ "కణ్ణక సెల" మీదుగా సాగినవో లేదో చూడవలసి ఉన్నది. "కణ్ణకసోల" అనెడి పేరు కూడ శాసనాల్లో తగిలినందున, అదొక (చిన్నపాటి) రేవుగా నుండినదా?

20వ శతాబ్ది ద్వితీయార్థంలో కూడ, కృష్ణానది రెండుపాయల మొగల నుండి ఎన్నో 25 మూరల పడవలలో ఆ ఏటి కటునిటు ఉన్న ప్రాంతంలో పుట్టి పెరిగిన పల్లెకాపులు, నడి సముద్రమన్న ప్రాంతాలకు చేరి, ఏకబగిగా, రాత్రింబవళ్లు చేపలవేట చేసిన సత్యం ఆయా ప్రాంతపు అవసరానికి అనుగుణ్యమైన కవసరమైన పలు విధములైన వలల పేర్పుడు, వారి వంట వార్పు, నిద్ర అన్నీ ఆ పడవ "అమరం" స్థానంలోని బల్ల కూర్పు (ఐవషస) పైనే. ఆ పడ వలో ఆధునిక నిల్వ వసతులులేనందున, వేటకు దక్కిన చేపంతా (entire catch) ఉప్పులో ఊరవేసి ఆరబెట్టడమో, తోరణాలు గ్రుచ్చి ఎండబెట్టడమో వారికి పడవపై కూడ దైనంది చర్య. శనివారం తిరుగు ప్రయాణం కట్టి, నాగాయలంకలో, ఆదివారం జరిగే వారపు సంతలో అమ్మిసొమ్ము చేసుకొని, ఇండ్లకు చేరినట్లే చేరి, చెప్పులలో కాళ్ళున్నట్లు, ఉప్పు-పప్పు మూటలు కట్టుకొని మరొక వారపు వేటకు సోమవారం ప్రయాణం కట్టెడివారు. ఆ కష్టజీవుల అంకిత భావం, స్వశక్తిపై నమ్మకం, సముద్రం అమ్మవంటిదన్న నమ్మకం నాలాంటి వారికి మరపురాని సంగతి.

క్రీ.శ. 1960 ప్రాంతంలో ఆ సంతకు వారం వారం చేరిన "వట్టిచేప" షుమారు 100 టన్నులపాటిది. పది పండ్రెండు నిండు లారీలు, ఆ రాష్ట్రపు ఏజన్సీ ప్రాంతాలకేగాక, పొరుగు రాష్ట్రాలకు కూడ తరలిపోయెడివి. లాడూ-బేడూ చేప కాదు. పండు గొప్ప, వంజరం, చందువా, నెత్తలి వంటి, అందరూ మెచ్చెడి, చేపరకాలే ఆ కదలిపోయెడి సరకులో సింహభాగం. సంవత్సరానికి 4-5 వేల టన్నుల చేప విలువ 5 కోట్ల రూపాయలనవచ్చు. తీరాంధ్ర దేశంతో అట్టి దీర్ఘకాలిక వేటవిధానం. అంతటి ఉప్పుచేపల సంత మరెక్కడా లేనదన్నది పదహారనాల సత్యం. ఆ పల్లెకాపులు అంతటి ఘనచరిత్ర సృష్టించిన వారు తరాలపాటు సంక్రమించిన వారసత్వపు చరిత్రను నిలిపి మనకు చూపించిన ఆ ప్రాంతపు శ్రమైకజీవులు. అదంతా మైసోల అందించిన వరమేనంటాను.

క్రమంగా ఆధునికీకరణ ప్రభావం వారిపైనా పడింది. ఏటి కావలిగట్టుపైనున్న రేపల్లెలో పోటీపంతను పుట్టించారు. రేపల్లె సమీ పంలో మూడు పూవులారుకాయలుగా విలసిల్లిన 25 మూరల కొయ్య నౌకల నిర్మాణం ఆగిపోయింది. ఆ నిర్మాణ కుశలత సాంకేతిక పరి జ్ఞానం పారంపర్యంగా యువతరానికి అందకుండానే మరుగై పోయింది. నౌకల నిర్మాణానికవసరమైన మేలిరకపు కలప అరుదో, కరవో అయింది. దాని ధర చుక్కలనంటింది. పల్లెకాపుల ఆర్థిక స్తోమత, 25 మూరల నౌకల కొనుగోలుకు చాలలేదు. యువతరం వారికి. కులవృత్తి మెరమెరలు కంటి కానడంలేక శ్రమతక్కువైన జీవన విధానాలవైపు మొగ్గుచూపారు. కానీ ప్రభుత్వ విధానాలవల్ల మత్స్య పరిశ్రమ సాంకేతికపురోగతి కొంతమేర సాధ్యమైంది. ఉప్పు చేపల స్థానే తాజా చేపల సంతకు బీజం పడింది. మంచుగడ్డల వాడకంవల్ల ఎక్కువగా తాజాచేపలే సంతలకు చేరుతున్నావి. వట్టి చేపల తయారీలో సంభవించే బరువు తరగు నిరోధించడమే కాక మంచిదర పలకడం ఒక ధనాంశం (+). కృత్రిమ కలవతో, గాలి వాటంపై ఆధారపడవలసిన అవసరంలేని యాంత్రిక నావలు చాప క్రింద నీరులా రంగంలోకి చేరినవి. ఇలా పలుకోనాల సాముదాయి కానుకూలముల వల్ల నేటి చేపల వేట విధానం కొలది గంటలకే నన్నట్లు తరిగి మార్పు చెందింది. ఆధునీకరణ సర్వదా ఆహ్వానించ తగినదే. కానీ చరిత్రకారులు కోరుకొనే (మిగిలిఉన్న) అరకొర సాక్ష్యాలు తెరమరుగవుతున్నాయి. ఆనాటి నౌకల ప్రతిరూపమైన 25 మూరలపడవ, కృష్ణానది పాయలకే సొంతం కాగా అది త్వర త్వరగా అంతరించిపోయినది. నేటికి ఒక్కటే ఒక్క పడవ మిగిలి ఉంది. అది కూడ రేపోమాపో అన్నట్లు తయారైందిగా తెలుస్తుంది. ఎందుకైనా మంచిది. దానిపై సమగ్ర సాంకేతిక నివేదిక రూపొందిం చడం చేయదగినపని. ఆ పడవ ఛాయా చిత్రం నిలువ చేయదగి ఉంది.

ప్రాకృత సంస్కృతాలెంత ముఖ్యమో పూర్వాద్రావిడ, కళింగ భాషల పాత్రకూడ అంతే ఉందని నా అభిప్రాయం. ఎక్కడికక్కడేన్న దోరణి ప్రక్కనబెట్టి, సామ్యమున్న, ఇతర మాటలు, ఇతర ప్రాంత సాహిత్యం, శాసన సంపద, ప్రక్కప్రక్కన పెట్టి, తులనాత్మక ధోరణితో పరిశీలనలు, పరిశోధనలు చేస్తారని నా ఆకాంక్ష. పుట్టెడు చరిత్రకు పుట్టినిల్లైన దివిసీమకు తగిన ఘనత దక్కగలదని ఆశ.

సూచికలు :

1. ప్రాచీనాంధ్ర భూగోళము, కె. ఈశ్వరదత్తు, పుటలు 49 - 50.

2. ఎపిగ్రాఫికా ఇండికా, సంపుటి iv ప, సంఖ్య 16

3. హరవిలాసము శ్రీనాథకవి, 1 వ అశ్వా 28వ పద్యం 4. దక్షిణ భారతదేశ శాసనములు, సంపుటి ix శ, భాగం ॥,

సంఖ్య 550, 551.

చిటిప్రోలు వెంకటరత్నం

నవల కూడా కావ్యమే

డా॥ ముదిగంటి సుజాతారెడ్డిగారు "రస సిద్ధాంతం నవల" అనే వ్యాసం రాశారు. ఆ వ్యాసంలో వారు నవలకు రస సిద్ధాంతాన్ని వర్తింపజేయడం సంభావ్యమే అన్న తాత్పర్యాన్ని వ్యక్తం చేశారు.

రస స్వరూపాన్ని భరత మహర్షి ఈ విధంగా చెప్పాడు. "విభావానుభావ వ్యభిచారి సంయోగాద్రసనిష్పత్తిః" ఈ విషయాన్నే ధనంజయుడు ఈ విధంగా విస్తృతం చేశాడు.

"విభావై రనుభావైశ్చ సాత్త్వికైర్వ్యభిచారిభి'

అనీయామానంః స్వాద్యత్వం స్థాయి భావో రసః స్మృతః"॥

ఐతే సుజాతారెడ్డిగారు తమ వ్యాసంలో ఈ మాటల అర్థాన్ని గ్రహించలేదు. 'రసం' అనే శబ్దానికి వారు ఏ విధమైన అర్థాన్ని గ్రహించారన్న విషయం ఈ క్రింది మాటలు తెలుపుతున్నాయి. "కవిత్వం కానీయండి నవల కానీయండి చదివినపుడు మన గ్రంథులను పెకలించి మనలో సంచలనం కలిగించి మనల్ని ఒక దిశగా నడిపే శక్తియే రసం" (5వ సంచిక –పుట 78) "...నవలను చదివినపుడుగాని సినిమాను చూసినపుడుగాని వాటిలోని పాత్రలు, సంఘటనలు మన శరీరంలోని గ్రంథులను రేపి మనల్ని సంచలితుల్ని చేసి మనం మనం కాదు నవల చదువుతుంటే మన మనః ఫలకం మీద నిలిచిన పాత్రనే అన్న భావన వరకు పోయి మనల్ని కార్యోన్ముఖుల్ని చేస్తవి" (5వ సంచిక – పుట78).

వీటి కంటె స్పష్టంగా, ఈ మాటల సారాంశమనిపించే విధంగా వ్యాస రచయిత్రి ఉద్దేశాన్ని మాటలు బహిర్గతం చేస్తున్నాయి. "...రస సిద్ధాంతంలోని సాధారణీకరణం, తాదాత్మ్యత. (ఈ శబ్దానికి సరియైన రూపం – తాదాత్మ్యం) లు నవలా పఠనం జరిపి రసానుభూతి స్థితిని పాఠకుల్లో కలిగించి వాళ్ళను నడిపే చోదకశక్తిగా పనిచేస్తుంది" (5వ సంచిక – పుట 80).

ఈ మాటలలోని ఉద్దేశాన్ని గమనిస్తే 'రస' శబ్దానికి శాస్త్రీయంగా ఉన్న అర్థాన్ని రచయిత్రి స్వీకరించలేదని, ఆ అర్థంలో ఉన్న మౌలికమైన లక్షణాన్ని మాత్రమే స్వీకరించారని తెలుస్తోంది.

సాధారణీకరణం, తాదాత్మ్యం అన్నవి కావ్య జాతిలోకి వచ్చే అన్ని గ్రంథాలకు అన్వయించగల లక్షణాలు, కావ్య జాతిలోకి రాగల ఏ గ్రంథం విషయంలోనైనా "ఈ పై లక్షణాలు కలిగి ఉంటుందా?" అనేది చర్చనీయమైన విషయం కాదు. నవల కూడా కావ్యమే.

నవల కావ్యమెలా ఔతుందన్నది ప్రశ్న. అసలు సర్వవాఙ్మయూ రెండు విధాలుగా మాత్రమే విభజింపబడడానికి వీలుంటుంది. శాస్త్రం, కావ్యం. నవల శాస్త్రం కాదనేది నిర్వివాదమని భావించదగిన అంశం. ఇక పరిశేషన్యాయం చేత కావ్యమే ఔతుంది.

అందువలన 'రసం' అనే శబ్దానికి పై చెప్పబడిన అర్థాన్ని గ్రహించినపుడు కావ్యజాతి అంతటికి అది అన్వయిస్తుందనడం ఎలా చర్చ అవసరంలేని విషయమో నవలకు అన్వయిస్తుందనడం కూడ అలాగే చర్చ అవసరంలేని విషయం.

కావ్యానికి, నవలకు స్వభావరీత్యా వైవిధ్యమే తప్ప వైరుధ్యమేమీ లేదనే అంశాన్ని వ్యక్త పరిచే ఇంకొక విషయాన్ని కూడ ఇక్కడ చెప్పుకోవడం సముచితంగా ఉంటుంది. కళా పూర్ణోదయాన్ని పద్యాలలో రాయబడిన నవల అని అనడం ప్రచురంగా ఉంది. కావ్యానికి, నవలకు – రెండిటి సామాన్యమైన ఏదో లక్షణం ఉంది అన్న అంశాన్ని ఈ విషయం తెలియపరుస్తోంది. నవలలో 'కావ్యంలో కూడ ఉండే' ఏదో లక్షణం లేకపోతే కావ్యాన్ని నవల అనడం ఎలా సాధ్యం?... మరొక విషయం. కావ్యాన్ని నవల అనడం సంభావ్యమైనపుడు నవలను కావ్యం అనడం ఎలా సంభావ్యం కాదు?

అందువలన 'రస' శబ్దానికి ఈ పై చెప్పబడిన అర్థాన్ని స్వీకరించినపుడు నవలకు రస సిద్ధాంతం అన్వయిస్తుందా? అనేది చర్చనీయాంశం కాదు. చర్చనీయాంశం ఎప్పుడు ఔతుందంటే 'రసం' అన్న శబ్దానికి ఆలంకారికమైన అర్థాన్ని స్వీకరించినపుడు మాత్రమే.

ఈ ఆలంకారికార్థాన్ని స్వీకరించినపుడు కావ్య ప్రక్రియలలోని మిగిలిన వాటికంటె కొంత ఎక్కువగా 'రస' సూత్రాన్ని అన్వయింపజేయవచ్చునని చెప్పవచ్చును. ఎందుకంటే రస స్వరూపాన్ని ఆలంకారికులు కథతో కూడి ఉన్న కావ్యాల నుద్దేశించి చెప్పారు కనుక, 'నవల' కథా సహితమైన ప్రక్రియే కనుక.

అందువలననే వ్యాస రచయిత్రి ఈ వ్యాసంలో మొదట 'రస' స్వరూపాన్ని సంగ్రహంగా స్పష్టం చేసి తరువాత అటువంటి స్వరూపం కలిగిన రసం నవలకు అన్వయిస్తుందా? అని ప్రశ్నించుకుని ఆ అంశాన్ని తర్కిస్తే వ్యాసానికి రావలసిన సముచిత స్వరూపం వచ్చేది.

రస సిద్ధాంతాన్ని దేనికి అన్వయింపజేయవచ్చునన్న ఆలోచన ఎలా ప్రయాణించిందన్న అంశాన్ని వివరించడం సాహిత్య ప్రియులకు ప్రయోజనకరంగా ఉంది.

"...శ్రవ్య కావ్యంలో కవి వర్ణన ప్రతీది సులభమైన శైలిలో ప్రసన్న రీతిలో వుండాలి. అప్పుడే కవి వర్ణనలు పాఠకుల కనుల ముందు రూపుగట్టగలుగుతవి. ఈ గుణం ఆధునిక వచన ప్రక్రియ అయిన నవలలోను వుండాలి" (5వ సంచికకు పుట 77) ఇది సముచితంగా ఉంది.


"సహృదయునిలో వీర రసం అంటే స్థాయీ భావమైన ఉత్సాహం ఆవిర్భవిస్తుంది" (5వ సంచిక పుట 76) వంటి మాటలు ఈ వ్యాసంలో ఉన్నాయి. వీరరసం, ఉత్సాహం ఒకటి కావు అన్న విషయాన్ని అలా ఉంచితే "స్థాయి భావమైన ఉత్సాహం ఆవిర్భవిస్తుంది" అనడం సముచితం కాదనక తప్పదు. సహృదయుడిలో అంతకు ముందులేనిదేది నూతనంగా ఆవిర్భవించదని అంతకుముందు అతడిలో వాసనా రూపంలో ఉన్న స్థాయి భావమే ప్రబోధించబడుతుందని రస సిద్ధాంతం ఆంతర్యం. ఈ విధమైన శాస్త్ర విషయాలతో నిండి ఉన్న వ్యాసంలో శబ్ద ప్రయోగం శాస్త్రోచితమైన నిర్దుష్టతతో ఉండడం సమంజసమైన విధానం.

వ్యాస రచనకు ఆలోచనలను రేకెత్తించే ఇటువంటి విశిష్టమైన విషయాన్ని ఎన్నుకున్నందుకు రచయిత్రిని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను.

(...తరువాయి 49 వ పుటలో)

పుస్తక సమీక్షలు

వ్యాసనీరాజనం
(సాహిత్య వ్యాసాలు)




రచన : డా॥ తుర్లపాటి రాజేశ్వరి
వెల: 200/- పుటలు : 165
ప్రతులకు :ఎన్.ఎస్మూర్తి
ఫ్లాట్ నెం 405, 3వ అంతస్థు
రాజారాణి సరోవర్ అపార్ట్‌మెంట్సు
3వ లైను, బరంపురం - 760002
గంజాం జిల్లా -ఒడిసా
సెల్ : 9078743851

ఆంధ్రభారతిపై ఆ రాష్ట్రాలలో నివశించే వారికన్న, ఇతర రాష్ట్రాలలో స్థిరపడిన తెలుగువారికే ఎక్కువ మమకారం, అభిమానం ఉన్నాయా అని ఒకోసారి అనిపించక మానదు. పొరుగు రాష్ట్రం ఒడిసాలో, తెలుగుభాష ఒడియా భాషా వాహినులకు వారధిగా డా॥ తుర్లపాటి రాజేశ్వరి సాహిత్య ప్రస్థానం కొనసాగుతోంది. బహుభాషా కోవిదురాలు, తెలుగు సాహితీ ప్రక్రియలలో - కవిత్వం, నవల, రూపకం, అనువాదం, విమర్శ యిలా వివిధ శాఖలలో తన రచనల సుమహారాలను ఆంధ్రభాషా సరస్వతికి అర్పిస్తున్నారు. ఇప్పుడు 'వ్యాస నీరాజనం' పేరున 21 వ్యాసాల సమాహారాన్ని సమర్పించి అక్షర నీరాజనం చేశారు.

ఇంతకు పూర్వమే, 'వ్యాస వారధి' (34 అంశాలపై), 'తెలుగుధనం' వ్యాస సంపుటాలను రాజేశ్వరి వెలవరించారు. చరిత్ర, సంస్కృతి, సాహిత్యాలకు సంబంధించి, పరిశోధనాత్మకంగా విలువైన విమర్శతో, చక్కనిభాషలో పరిచయాత్మకంగాను, ఆసక్తిని కలిగించేలా అందించి తెలుగులో ఉన్న కొద్దిమంది మహిళా విమర్శకులలో పేర్కొనదగిన రచయితగా ప్రముఖులచే ప్రశంసలందుకున్నారు రాజేశ్వరి.

ఇప్పటి 'వ్యాస నీరాజనం' లోని 21 వ్యాసాలు వివిధ మాస, దిన పత్రికలలో ప్రచురితం అయినవే! చాసో, రావిశాస్త్రి, ఇనాక్, సుజాతారెడ్డి, డా॥ అచ్యుతరామరాజు మొ॥ ప్రముఖ కథకులను గురించీ; విశ్వనాథ్, శివారెడ్డి, ఎన్.గోపీ వంటి కవుల కవిత్వంపైనా వారి కవిత్వ విశేషాల గురించి సహేతుకమైన, హృద్యమైన విశ్లేషణ చేసాడు. ఈ సంపుటిలో ప్రధానంగా చెప్పుకోవలసినది రచయిత ద్విభాషా తులనాత్మక వ్యాసాలు, ఒడియా రాష్ట్రంలో తెలుగు వారి గురించి రాసిన వ్యాసాలు గురజాడ (కన్యాశుల్కం నాటకం), ఒడియా రచయిత ఫకీర్ మోహన్ (మాధవ మహంతీంకో కన్యాసునా - నాటకం) తుళు రచయిత కె.విఠల హెగ్డె కథ (మది మాళత్తు మదియాయె) - రచనలలో సంఘ సంస్కరణాత్మక దృష్టి, మానవీయ దృక్పథం, బాల్య వివాహాలు, కన్యాశుల్కం వంటి సమస్యలు ఎలా చిత్రింపబడ్డాయో చాల చక్కగా విశ్లేషించారు. ఇక, ఆధునిక యుగంలో తెలుగేతర రాష్ట్రాలలో తెలుగు సాహిత్యం, కళింగంలో తెలుగు ప్రాచీనత, ఒడియా తెలుగు భాషల సాహిత్య సంబంధాలు, ఆ రెండు భాషల మధ్య ఉన్న ఆదాన ప్రదానాలు, ప్రభావాలు, ఆ భాషల మధ్య సాన్నిహిత్యం కారణంగా పరస్పరం ఎలా ప్రభావితం అవుతున్నదీ ఎంతో ఆసక్తికరంగా విశదీకరించారు. ఇంకొక ప్రత్యేకత - జాతీయోద్యమంలో ఒడిషాలో తెలుగు మహిళలను గురించి, వారి త్యాగమయ చరిత్ర గురించి, ఆదుర్తి లక్ష్మీబాయి, ఎల్లాయి సూరమ్మ, జయంతి సూరమ్మ, పోకల తారమ్మ పూడిపెద్ది వెంకట రమణమ్మ, తెలిదేవర రంగమ్మ, కాదుమూరి నాగరత్నమ్మ గాదెలక్ష్మీ నరసమ్మ వంటి త్యాగధనులైన స్త్రీ మూర్తుల గురించి చదివి పులకిస్తాం. అలాగే, రెండుసార్లు జాతీయ స్థాయి పురస్కార గ్రహీత అపురూప చిత్రకారుడు, ఆదివాసీ చిత్రకళలో అనన్య శిల్పి తెలుగు తల్లి ముద్దుపట్టి దువ్వాకుల నారాయణరావు గురించిన విశేషాలున్న వ్యాసం - యిలా విభిన్న విషయాలపై వ్రాసిన వ్యాసాలు రచయిత విస్తృత అధ్యయనం, ఆంగ్ల ఆంధ్ర తుళు మొ॥ భాషా ప్రావీణ్యత లోతైన విశ్లేషణ - మొత్తం కలిపి తన మాతృభాష తెలుగు తల్లికి అక్షర నీరాజనం చేసిన సందర్భంలో అభినందన చందనాలు! ఈ 'వ్యాస సంపుటి' భాషా ప్రేమికులను, సాహితీ వేత్తలను అలరిస్తుందనటంలో అతిశయోక్తి లేదు.

'నీళ్లింకని నేల' రాయలసీమ కథల సంకలనం



సం : యస్.యం.డి.ఇనాయతుల్లా
కెంగార మోహన్
వెల: 150/- పుటలు : 144
ప్రతులకు : యస్.యం.డి.ఇనాయతుల్లా
ఇం.నెం. 80-129 సి 6 బి
అబ్బాస్ నగర్ -కర్నూలు - 2
సెల్ : 98493 67922

సీమ బతుకు చిత్రపటాన్ని తెలుగు రాష్ట్రాల పాఠకుల ముందుంచడమే ప్రధాన లక్ష్యంగా 13 మంది కర్నూలు కథకులు, కర్నూలు జీవితాన్ని, పరోక్షంగా రాయలసీమ బతుకు వెతలను ఈ సంపుటిలో చిత్రీకరించారు. ఆరు దశాబ్దాల పాలకుల నిర్లక్ష్యం, ప్రకృతి సహకరించకపోవటం, నదులలో నీళ్లు ఇంకిపోయి సాగునీటికి రైతులు, తాగు నీటికి ప్రజానీకం అల్లల్లాడటం, 'సుగ్గి' కోసం పల్లెల్లోని ప్రజల్లో 75% మంది వలసలు వెళ్లటం జరుగుతోంది. సేద్యంలో రైతులు విషమ పరిస్థితులను ఎదుర్కొంటూ దీనంగా బ్రతుకులను

నెట్టుకు వస్తున్నారు. ఒక విధంగా చూస్తే తెలంగాణా కంటె కూడ రాయలసీమే వెనుకబాటులో ముందుంటుందని; సీమ వెనుకబాటు గురించి మాట్లాడే, పోరాడే సీమేతర గొంతులు కరువు కావడం, సీమ కరువుకు తోడయిందని ముందుమాటలో సంపాదకులు అభిప్రాయపడతారు. ఈ సంకలనంలోని కథల పైన పేర్కొన్న సీమ వెతల నేపథ్యంతో, రాయలసీమ మాండలిక పద పరిమళంతోను నిండినవి. ప్రకృతి సృష్టించే కరువు, పాలకుల వికృతి సృష్టించే పరిస్థితి ఉన్నా, ఈ నేల నుండి కన్నీటి కథల ధారమాత్రం యింకిపోదు అనేది రాయలసీమ మాండలిక పద పరిమళంతోను నిండినవి. ప్రకృతి సృష్టించే కరువు, పాలకుల వికృతి సృష్టించే పరిస్థితి ఉన్నా, ఈ నేల నుండి కన్నీటి కథలధార మాత్రం యింకిపోదు అనేది రాయలసీమ వాసుల ఆత్మ విశ్వాసం ఈ కథలలో ఈ కథకుల్లో కనిపిస్తుంది.

మొదటి కథ, సంకలనం శీర్షిక 'నీళ్లింకని నేల' (పౌరోహిత్యం) మారుతి) లో పొట్ట చేత పట్టుకుని హైదరాబాదు వలస వెళ్లిన గిద్దయ్య చివరకు తన భార్య డంప్ యార్డులో అంటబెట్టిన చెత్తలో పడి ప్రాణాలు కోల్పోతే, మిగిలిన ఎముకల్ని 'గువ్వల దొడ్డి' - సొంతూరుకి మూటకట్టి తెచ్చి మట్టిలో పూడ్చటం - వలస మిగిల్చిన విషాదానికి పరాకాష్ఠ. ఆ కుటుంబం గుండె నీళ్లింకని నేలగా మారిందని పాఠకులు గ్రహిస్తారు. నీళ్లు కరువై రైతన్న మట్టిలో నిమజ్జనం అయిపోతుంటే, గణేశ నిమజ్జనం కోసం నీరు సరఫరా చేయడం, వాతావరణాన్ని కాలుష్యం చేయడం 'నిమజ్జనం' కథలో., 'గట్టిపాలు, గడ్డ పెరుగు' తో పాటు మంచి మానవ సంబంధాలు మోసుకుంటూ తిరిగే గ్రామీణ యువతి 'దుర్గి' దుర్మార్గుడు, స్త్రీలోలుడైన ఈరబద్రయ్యకు ఎదురు తిరిగి కళ్లెర్రచేసి హెచ్చరించడం 'దుర్గి' కథలో విశేషం. 'కాడెద్దు', 'మట్టి మనిషి' 'బతుకుపటం' కథలలో సీమ రైతులు సేద్యంలో ఎదుర్కొంటున్న విషమ పరిస్థితులు కళ్లకు కట్టినట్లుగా చిత్రించారు. ఊరికోసం, ఉసురుపోతయేం, జనం కోసం చస్తే యేం (అంటూ 'పొలి ముద్ద' కథలో త్యాగధనుడైన సంజీవరెడ్డి అనే యువకుడి చారిత్రక గాథ; సీమ మహిళల రోజువారీ జీవన పోరాటాన్ని 'పుండు' కథలో మేధావుల, శాస్త్ర వేత్తలకు ప్రశ్నార్థకంగానే మిగిలిన జీవన రసహ్యం. మృత్యువు గురించి 'రహస్యం' లోను, కర్నూలు చరిత్రలో కళ్లముందు చారిత్రక చిహ్నాలు అదృశ్యం అవటం 'అస్పష్ట రూపాలు' కథలోను యిలా అన్ని కథలు కర్నూలు అస్తిత్వపు ఋజువు అని, 'కర్నూలు వర్తమాన కథ' అనే తన పీఠికలో కాశీభట్ల వేణుగోపాల్ అంటారు. ఇక, 'చెద' రంగం' 'ఆశల పట్లకి' 'ముసుగు' అనే మూడు కథలు విభిన్న సామాజిక, మహిళా సమస్యలపై ముగ్గురు రచయిత్రులు రాసినవి.

ఈ 13 కథల సంకలనంలో దాదాపు అన్నిటిలోను రాయలసీమ వెనకబాటు తనం, రైతుల కడగండ్లు, వలసల బాధలు, చాల హృద్యంగా కళ్లకు కట్టినట్టు రచయితలు తమ రచనలలో నిక్షిప్తం చేసారు. సీమ దైన్యాన్ని గురించి సంపాదకులు 'ముందుమాట' లో చాల గాఢంగా సీమేతరులకు హృదయాన్ని తాకేలా విశదీకరించారు. అసలు 'విషయ సూచిక' లేదా 'ఇదీ క్రమం' లేదా 'ఇదీ వరుస' అని కాకుండా 'కన్నీటి చారికలు' అని శీర్షిక పెట్టటం కొంత కలత పెడుతుంది. రాయలసీమ మాండలిక పరిమళం ఆసక్తికరంగా ఉన్నా 'మట్టిమనిషి' కథలో ఆలూరు మాండలికం సీమేతరులకు కొరుకుడు పడదు. ఏమైనా ఈ సంకలనంలోని కథల ద్వారా రాయలసీమ బ్రతుకుల గురించి ఇతర ప్రాంతాలవారు చదివి అర్థం చేసుకోవటానికి చాల ఉపయోగపడుతుంది.

శాస్త్రీయ దృక్పథం - మానవ మనుగడ
(శాస్త్రీయ వ్యాస సంకలనం)



రచన : పసల భీమన్న
వెల: 90/- పుటలు : 152
ప్రతులకు :పసలభీమన్న
ఇం.నెం. 79-8-9/1 పోస్టల్ కాలనీ
శ్యామలానగర్, రాజమండ్రి - 533 103
సెల్ : 9490123276

హేతువాద ప్రచారం, కులమతాలు మూఢ నమ్మకాలు శ్రమదోపిడీలేని శాస్త్రీయ సమాజం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన విద్యాధికుడు, మానవవాది పసల భీమన్న. ఇంద్రజాలం ద్వారా నాస్తికత్వం, మానవవాదం, హేతువాదం రంగాలలో సుదీర్ఘంగా సేవ చేస్తున్నారు. ఈ సంకలనంలో 22 వ్యాసాలున్నాయి. ఇవన్నీ ప్రధానంగా విజ్ఞానదాయకమైన శాస్త్రీయ వ్యాసాలు. శాస్త్రీయ దృక్పథం, హేతువాదం, మార్క్సిజం, మానవవాదం, విద్యా విధానం వంటి ఆసక్తికరమైన విషయాలను గురించిన సమాచారం ఉంది. మానవ వాదం మన లక్ష్యం కావాలి, దానికి సాధనం హేతువాదం - అంటే శాస్త్రీయ దృక్పథం మన సమాజంలో నెలకొనాలని, ప్రజలు స్వేచ్ఛగా హేతుబద్ధంగా ఆలోచించాలని కోరుకుంటారు, పసల భీమన్న ఇందులోని వ్యాసాలు లోగడ 'హేతువాది', (సైన్సు - హేతువాదం' 'ప్రజా పత్రిక' వంటి పత్రికలలో ప్రచురింపబడి ప్రశంసలనందుకున్నవే!

'సాంఘిక దురాచారాలు - మూఢాచారాలు' వ్యాసంలో వాటికి గల కారణాలను విశ్లేషించటంతో పాటు, అజ్ఞానం, భయం, స్వార్థం నివృత్తి అయితే ఆ దురాచారాల నుండి విముక్తి లభిస్తుందని చెప్తారు రచయిత. అదేవిధంగా 'భావ ప్రకటనా స్వేచ్ఛకు సంకెళ్ళు' లో మోడీ ప్రభుత్వ హయాంలో మత విద్వేషం, అసహనం, కుహనా జాతీయవాదం, ఆర్.ఎస్.ఎస్. దాడులు, హేతువాదుల హత్యల గురించిన విశ్లేషణ ఉంది. స్త్రీ పురుష సమానత్వం, మానవాళి మనుగడకు ఆధారాలు, జస్టిస్ ఆవుల సాంబశివరావు హేతువాద భావాలు, యువతా నీ ప్రయాణం ఎటువైపు? ప్రశ్నించేతత్వం - నా జీవితానుభవాలు మొ॥ వ్యాసాలు హేతు, నాస్తిక, మానవ -

వాదాలకి సమర్ధనీయంగా సాగిన రచనలు. ఇక, ఇదీ గీతా రహస్యం (నార్ల) ఆంగ్ల వ్యాసానికి డా॥ ఇన్నయ్య (తెలుగు), దానిని సంక్షిప్తీకరించిన వ్యాసం ; సైన్సు – మానవ వాదం – స్వామి అక్షరాత్మానంద (ఆంగ్లం) అమిరపునటరాజన్ (తెలుగు) వ్యాసానికి సంక్షిప్తీకరణ; బ్రాహ్మణ వాదం' – వి.టి. రాజశేఖర్ శెట్టి (ఆంగ్లం) వ్యాసానికి స్వేచ్ఛానుసరణ, సంక్షిప్తీకరణ వ్యాసం ; డా॥ వి. బ్రహ్మారెడ్డి 'మానవ మనుగడకు – శాస్త్రీయ దృష్టి అవసరమా!' వంటి ఆలోచనలు రేకెత్తించే వ్యాసాలు ఇందులో ఉన్నాయి.

ముఖ్యంగా ప్రఖ్యాత రచయిత్రి రంగనాయకమ్మ ప్రభావం రచయితమీద గాఢంగా ఉందని చెప్పుకున్నారు. ఆమె రాసిన 'మార్క్సిజమే తెలియకపోతే, పుట్టిన వాళ్లం పుట్టినట్లే ఉంటాం' (50 వ్యాసాలు – 2010లో ప్రచురణ) చదివాక తనకు జ్ఞానోదయమైందని అంటారు. ఆ పుస్తకంలోని – 'మానవ సమాజం ఇంకా ప్రారంభం కాలేదు' 'కన్నీళ్లే సమస్యలను పరిష్కరించవు', 'నీడతో పోరాడదామా?', 'రిజర్వేషన్ల వల్ల కులాలు పోవు' వ్యాసాలు సంక్షిప్తీకరించి ఈ సంకలనంలో రచయిత తన అభిమానాన్ని చాటుకున్నారు. అంతే కాకుండా, రంగనాయకమ్మ అభిప్రాయపడినట్టు 'మన సమస్యలకు శాశ్వత పరిష్కారం మార్క్సిజమే' అని రచయిత కూడా ప్రగాఢంగా నమ్మినట్టు తెలుస్తుంది. మార్క్సువాదమే శ్రమదోపిడీ నుండి శ్రామిక వర్గాన్ని విముక్తి చేయగలదు. ఆ తరువాతి స్థానమే నాస్తిక వాదం, హేతువాదం, మానవవాదం అంటారు భీమన్న.

ఆధ్యాత్మిక / హిందూ వాదులకు ఇందులోని అంశాలు కొన్ని అభ్యంతరకరంగా తోస్తాయి. ప్రధానంగా మన రెండు తెలుగు రాష్ట్రాల పాలకులు మత మౌఢ్యాన్ని, కాపాడటమే కాకుండా ప్రోత్సహిస్తూ స్వాములవారి సేవలో ఆసక్తిని కనబరుస్తున్నారు. మత వర్గాలు, ఆధ్యాత్మిక శక్తులు శక్తివంతం అవడం బహుళ ప్రజానీకం అజ్ఞానంలో ఉండటం కూడా అందుకు కారణం అని రచయిత ఒక సందర్భంలో అన్నది ఆలోచించాల్సిన విషయం. ఏమైనా శాస్త్రీయ దృక్పథం, శాస్త్రీయ సంస్కృతి మాత్రమే మన సమస్యలని పరిష్కరించి మానవజాతిని నైతికమార్గాన నడపగలవు అనే విశాల దృక్పథంతో కూడిన వ్యాసాల వలన సమాజంలో భావ విప్లవం రావాలని రచయిత కోరుకోవటం సమంజసమే, అనిపిస్తుంది.

యం.వి.శాస్త్రి
9441342999

(46 వ పుట తరువాయి)

"గోపిచంద్ మెరుపుల మరకలు – విశ్లేషణ" అని డా॥ కాత్యాయనీ విద్మహేగారు రాసిన వ్యాసం మీద డా॥ సుమతీ నరేంద్రగారి ప్రతి స్పందన చదివాను. ''రచయిత ఉద్దేశించని దాన్ని రచనలో వెదకాలనుకోవడం సమంజసం కాదు గదా" (5వ సంచిక – పుట 117) అన్న సుమతీ నరేంద్రగారి దృష్టి ఔచిత్య పూరితమైంది. అసలు ఒక సిద్ధాంతం మంచిదో కాదో తర్కించడమన్న విషయం సాహిత్య క్షేత్రం పరిధిలోది కాదు. అది తాత్త్విక క్షేత్రానికి సంబంధించింది. రచయిత తాను చెప్పదలచుకున్న విషయాన్ని పాఠకుడికి హృదయంలో నాటుకునేలా చెప్పడంలో, కళా మూల్యాలు భగ్నం కాకుండా తన రచనను దిద్ది తీర్చడంలో ఎంత వరకు సాఫల్యం పొందాడన్నది చూడడమే సాహిత్య విమర్శకుడి పని. అతని సిద్ధాంతంలోని మంచి చెడ్డలను ప్రశ్నించడం ప్రారంభిస్తే... విమర్శకుడికి స్వేచ్ఛ ఉండి రచయితకు స్వేచ్ఛ ఉందని ఒక న్యాయదూరమైన పరిస్థితి తలెత్తుతుంది.

(రచయిత విశ్రాంత తెలుగు అధ్యాపకులు
1989 ఫిబ్రవరి – ఏప్రిల్ 'తెలుగు పరిశోధన' లో ప్రచురించిన వ్యాసాన్ని ఇక్కడ తిరిగి ముద్రిస్తున్నాము. రచయితకు, ఆ పత్రిక బాధ్యులకు మప్పిదాలు)

హిందీ సినీసీమను ఆదుకుంటున్న తెలుగు డబ్బింగ్ సినిమాలు.

హిందీ సినీసీమను ఆదుకుంటున్న తెలుగు డబ్బింగ్ సినిమాలు. అర్జున్‌రెడ్డి తెలుగు సినిమాల్లో ఒక విలక్షణ చిత్రం. మూస పోసిన సినిమాలకు భిన్నంగా వచ్చి విజయం సాధించింది. ఆ చిత్రం హిందీలో కబీర్ సింగ్‌గా తిరిగి తయారయింది, అశేష జనాదరణ పొందుతోంది. హిందీ సినిమా నటుల్లో దాదాపు అందరూ తెలుగు సినిమాలలో విజయం పొందిన సినిమాలను హిందీలో తిరిగి రూపొందించుకొని తమ ఫ్లాప్ కెరీర్‌ను తిరిగి విజయవంతంగా మార్చుకుంటున్నారు. గత పదేళ్ళలో అధికారికంగా 40 దక్షిణభారత భాషీయ సినిమాలు హిందీలోకి పునర్నిర్మించగా, అందులో 18 అద్వితీయ విజయం సాధించాయి, వాటిలో సింహభాగం తెలుగు సినిమాలే. యూట్యూబ్ లో, సెట్‌మ్యాక్స్, జీ సినిమా లాంటి చానెళ్ళలో సింహ భాగం తెలుగు నుండి డబ్ చేసిన సినిమాలే ప్రదర్శిస్తున్నారు. హిందీ ప్రాంత ప్రజలలో అందుకు తగ్గట్టే తెలుగు డబ్బింగ్ సినిమాలకు మంచి ఆదరణ ఉంది.

– ర షే



20.6.19 వ తేదీ హైద్రాబాద్ రవీంద్రభారతిలో జరిగిన కిన్నెర కార్యక్రమంలో ప్రముఖ రచయిత్రి డా॥ సి.భవానీదేవి రచన "స్వాతంత్ర్యానంతర తెలుగు, హిందీ కవిత్వంలో స్త్రీ" ను ఆచార్య ఎన్.గోపి ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్రీయుతులు వోలేటి పార్వతీశం, ఆచార్య ఎస్వీ రామారావు, శ్రీమతి ఎస్. స్వయంప్రభ, డా॥ ఎస్.రఘు, డా॥ పి.జ్యోతి, కిన్నెర రఘురాం పాల్గొన్నారు.

శ్రద్ధాంజలి

రామతీర్థ

కనువెలుగు 17.7.1969 – కనుమరుగు 30.5.2019



(యాజులూరి సుందర రాంబాబు) రామతీర్థ గా సాహితీ జగ మెరిగిన ఘనుడు మంచి చదువరి, కవి, విమర్శకుడు, అనువాదకుడు తెలుగు ఒకటే కాదు ఆంగ్ల, ఉర్దూ, హిందీ, బెంగాలీ ఒరియా భాషల్లో సాహిత్యాన్ని సైతం అవపోసన పట్టే సిన మేధావి. పలాస జన్మస్థలం. 17-7-1969 జన్మదినం. తండ్రి రైల్వే ఉద్యోగం వలన కుర్దారోడ్‌లో తనసాహిత్య ప్రక్రియ ప్రారంభించాడు. పారాదీప్ కార్మిక రక్షణవిభాగం ఉద్యోగిగా కామేశ్వరితో వివాహం ఇద్దరు సంతానం. బదిలీపైవిశాఖ చేరిక అనంతరం జీవితం పూర్తిగా సాహితీ సేవకే అంకితం చేశారు.

తెల్లమిరియం కవితా సంపుటి మంచిపేరుతెచ్చివ్వగా కెన్యాలో స్మృతికి పదేళ్లు(నివాళి సంచిక) శతాబ్ది శ్రీశ్రీ, శతజయంతి సంగీతాంజలి సి.డీ, జనస్వరాంజలి, జనగణమణ నూరేళ్లపండుగ సీ.డీ, ఠాగూర్ నాటిక అనువాదం హూదూద్ దీర్ఘకవిత, అన్నపూర్ణాక్షరం రాచకొండ ఆంగ్ల కవితలకు తెలుగు అనువాదం, కన్యాశుల్కం కవిత్వోత్సవం, నిర్భయజ్యోతి దీర్ఘకవిత, ఎన్నోసమీక్షలూ, సదస్సులలో నిర్వహణ వందలుగా అముద్రిత వ్యాసాలు, ప్రసంగాలూ పుస్తకావిష్కరణలు, ముందుమాటలు ఇలా వారిసాహితీసేవారంగం ఓవిస్తృత ప్రపంచం వీరి సంచలనాత్మక కవితా సంపుటి తెల్లమిరియం కు ఆరుద్రబోణీ పేరిట ముందుమాట వ్రాశారు. ధైర్యమైన నిర్మొహమాటమైన, సూటైన పదాలకూర్పుతో నేర్పుగా వ్రాసే రామతీర్థ కొత్త పదాలెన్నోసృష్టించారు హీరోగి, శనిమా రేప్ క్లాక్, మృగాడు వంటి పదాలు వీరిసృజనే ఇపుడెందరో వాడుతు న్నారు. కన్యాశుల్కంలోని విలువలు జనంలోకి చొచ్చుకుపోవాలని భావించేవారు సాహసోపేతంగా జగద్ధాత్రితో సాహితీ సహజీవనం సాగిస్తూ అనేక సాహిత్య కార్యక్రమాలు నిర్వహించేవారు మొజాయిక్ అనేసాహితీసంస్థ నడుపుతూ కవులను 10వేలరూపాయలనగదుతో సత్కరించేవారు పాత తరం కవులను సజీవంగా ఉంచటంకోసం వారి సాహిత్యాన్ని వివిధ రీతుల్లో జనంలోకి తీసుకొచ్చేవారు. చలంపాత్రలతో నాటికలు, గురజాడ పాత్రలతో నాటకాలు ఎన్నో వీరి ఆలోచనా రూపాలే సాహితీ సంస్థలన్నింటినీ కలుపుకుని కందుకూరి శతజయం త్యుత్సవాలను అద్భుత రీతిలో చేశారు. సమాపనోత్సవ సమయానికి హఠాత్తుగా జీవితం సమాప్తం అయిందనిపించుకున్నారు ఆంధ్ర ప్రభుత్వం నుంచీ గురజాడ పురస్కారం, రావిశాస్త్రిపురస్కారం ముని పల్లిరాజుపురస్కారం పొందారు. వీరులేనీ లోటు విశాఖ సంస్కృతికీ, సాహితీ భారతికే కాదు కవిలోకానికే దుఃఖదాయకం. సాహితీ సురగంగాతీర్థమై మనకు అందిన మహోన్నతమూర్తి రామతీర్థ.

అబ్బూరి ఛాయాదేవి

కనువెలుగు13.10.1933 – కనుమరుగు 28.06.2019



అబ్బూరి ఛాయాదేవి. అనుక్షణం అత్యంతవిలువైనదిగా గడిపి అనంతలోకాన్ని చేరిన అమ్మ వర్ధమానరచయిత్రులకు పెద్దదిక్కుగా ఉంటూ ఆప్యాయపుపలకరింపు నిరాడంబరత కు నిలువెత్తు రూపం అబ్బూరి ఛాయాదేవి, మొన్న హైదరాబాదు సీ ఆర్ ఫౌండేషను ఆశ్రమంలో కనుమూశారు.

తెలుగులో అరుదైనకథలకు అక్షరమై స్త్రీలజీవితసమస్యలను సునిశితంగా కథలో ఇమిడ్చి స్త్రీవాద రచయిత్రి గా పేరుపొందారు. "తనమార్గం" కథాసంపుటికి గాను కేంద్ర సాహిత్య అకాడెమీ బహుమతి పొందిన అబ్బురప్రతిభాశాలి అబ్బూరి 1933న రాజమండ్రి తనకు అమ్మపొత్తిలి, 1951న హైదరాబాదు నిజాం కాలేజీ చదువులమ్మలోగిలి. అక్కడేకాలేజీమాగజైనులో ఆమె మొదటికథ అను భూతి అచ్చుఅయింది. ఆతర్వాత ఆమెకలం నిరంతరం తరతరాల స్త్రీజాతి సమస్యలపై అక్షరాయుధమై కొనసాగింది ఆడపిల్లలను కనటం మొదలు పెంచటంలోనూ వివక్ష గానే ప్రవర్తించే కన్నవారి ఆలోచనా విధానాన్ని నిలదీస్తూ "ఈసమాజంలో ఆడపిల్లలను బోన్సాయ్ మొక్కల్లా ఎదగనివ్వరంటూ వ్రాసిన బోన్సాయ్ బ్రతుకులు విశేషాదరణ పొందినది 2000 సం.లో ఈకథ పాఠ్యాంశంగా ఆంధ్రప్రభుత్వం తెలుగు వాచకంలో చేర్చటం ఆమెకోచిరుకానుక.

అబ్బూరిరామకృష్ణారావుగారి కోడలిగా వరదరాజేశ్వరావు గారి భార్యగా, కంటే ఛాయాదేవిగా నేప్రత్యేకస్థానంస్థాయి సమాజంలో నిలుపుకున్నారు. జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీలో డెప్యూటీ లైబ్రేరియన్‌గా పనిచేసి రాజీనామాచేశారు. 1990నుంచీ ఆంధ్రజ్యోతి పాఠకులకు పెద్దదిక్కుగాఉంటూ సాహిత్య అకాడెమీకి రచయిత్రుల రచనా సంకలనం కూడా చేసిపెట్టారు. జిడ్డుకృష్ణమూర్తి తత్వాన్ని తనదైన బాణిలో సామాన్యులకు అర్థమయ్యేరీతిలోపరిచయంచేశారు. ఆ తాత్విక దృక్పథంలోనే తాను నడిచారు శేషజీవితం సీఆర్ ఫౌండేషను ఆశ్రమంలో గడుపుతూ కూడా తనను కలవ వచ్చిన రచయిత్రులు అభిమానులనూ ఆప్యాయంగా పలకరిస్తూ సలహాలుఅందిస్తూ గడుపుతున్న ఛాయాదేవి అమ్మ విధి పిలుపునూ విధానంగా స్వీకరించి తరలిపోయారు. ఆమె మరణానంతరం తన దేహాన్ని మెడికల్ కాలేజీకి అప్పగించమని కోరారు. ఆమె కోరిక తీరినది అజరామర కీర్తి పొందిన అబ్బూరి ఛాయాదేవి ఆంధ్ర రచయిత్రి కావడం మన అదృష్టం. అడుగుజాడలు అనుసరించడమే మనధర్మం.

– కోడూరు సుమన

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362



తానా నవలలపోటీ-2019 విజేత:సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి

తానావారి ప్రతిష్ఠాత్మక రు. 2 లక్షల రూపాయల పూర్తి బహుమతిని అందుకొంటున్న తొలి నవల 'కొండపొలం'.

2019 జులై 4,5,6 తేదీల్లో వాషింగ్టన్ డి.సి.లో జరుగుతున్న 22వ మహాసభల సందర్భంగా ఈ బహుమతిని అందజేస్తున్నట్లు తానా అధ్యక్షులు సతీష్ వేమన, పోటీ నిర్వాహకులు డా॥ జంపాల చౌదరి, ప్రచురణల కమిటీ చంద్ర కన్నెగంటి ఒక ప్రకటనలో తెలియజేశారు. అంపశయ్య నవీన్, కాత్యాయని విద్మహే న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

అనంతపురంలో తెలుగుభాషా సంస్కృతి సంఘం ఏర్పాటు



ప్రపంచీకరణ మార్కెట్ శక్తుల ప్రభావంతో ప్రాంతీయ భాషల అస్తిత్వం ప్రమాదంలో పడిపోతోందని, ఈ సంక్లిష్ట సందర్భంలో భాషాభిమానులు అంతా ఏకమై పోరాటాలకు సిద్ధం కావాలని"అధికార భాషగా తెలుగు అమలు- సంరక్షణ" పై అనంతపురములో లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో జరిగిన సమావేశంలో ప్రసిద్ధ రచయిత సింగమనేని నారాయణ పిలుపు నిచ్చారు. "జన సాహితి" సంస్థ నాయకులు సూర్యసాగర్, విశ్రాంత ఆచార్యులు పి.యల్ శ్రీనివాసరెడ్డి, విశ్రాంత సబ్ కలెక్టర్ గోవింద రాజులు, ప్రముఖ రచయిత శాంతినారాయణ, కేంద్రసాహిత్య అకాడమీ యువపురస్కార గ్రహీత డా. అప్పిరెడ్డి హరినాథరెడ్డి, పి.డి.యస్.యు నాయకులు నరేష్, ఎ.ఐ.యస్.యఫ్ నాయకులు మనోజ్, రాష్ట్ర సమన్వయకర్త డా. ఉద్దండం చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షులు సౌరపు గోవిందరాజులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రమేష్ నారాయణ, రామకృష్ణ, హరికృష్ణ, యమునా రాణి, కొత్తపల్లి సురేష్, అశ్వత్థరెడ్డి, దాదా ఖలందర్, తులసిదాస్...మధరశ్రీ, యోధా వెంకట్, గోసల నారాయణ స్వామి, టి.వి రెడ్డి, వల్లం రమేష్ బాబు, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

– డా. అప్పిరెడి హరినాథరెడ్డి

'అమ్మనుడి' చదువరులకు ప్రత్యేకంగా...'జోగిని మంజమ్మ' ఆత్మకథ



ఆమె 'మంగళముఖి' !

వారిలో ప్రజాభిమానం పొందింది.

స్త్రీ కాదు-పురుషుడూ కాదు

మగవాడిగా పుట్టి ఆడదిగా మారి నటువంటిది.

అదీ కోరుకున్నది కాదు ఇది తన తప్పుకాదు.

ఈ వాస్తవాన్ని గ్రహించని కుటుంబం శారీరకంగా, మానసికంగా హింసించింది.

ఆ హింస స్వరూపం చెప్పనలవికానిది.

ఆ యాతనను అనుభవిస్తూనే తనలో చెలమలా పొంగుతున్న ఆడతనాన్ని అదిమి పెట్టుకోవడానికి విఫలయత్నం...

ప్రకృతి ముందు కృత్రిమం నిలబడటం సాధ్యమా?

సాధ్యం కానప్పుడు గుండెలో దాచుకుని ఆ బాధను అనుభవించటం.

మరలా కుటుంబం నుంచి హింస.

ఈ రెండింటిని అనుభవించడానికి సాధ్యం కాని సంక్లిష్ట పరిస్థితిలో ఇల్లు వొదిలి బయటి ప్రపంచంలోకి....

అప్పటికి తనకు కేవలం పదినాలుగేళ్ళే!!

మనస్సులో వేధించే స్త్రీత్వాన్ని దేహంలో మోసుకుని ఊరూరు గుడి, గోపురాలు తిరుగుతూ గడిపిన అలమరి బతుకు.

అన్నం, నీళ్లు, బట్టలు లేక, తన వాళ్ళంటూ ఎవరూ లేని ఏకాకిగా కనీవినీ ఎరుగని దుఃఖాన్ని దిగమింగుకుంటూ...

ఆ దుఃఖాన్ని భరించలేక ఆత్మహత్యాయత్నం...

కానీ విధిరాత మరోలా ఉంది.

చావు రాలేదు. విషయం తెలిసి ఇంటి వాళ్ళు ఆస్పత్రిలో చేర్చారు.

చికిత్స పూర్తికాకుండా తనను ఆస్పత్రిలో వదిలేసి వచ్చారు.

ఇదంతా దైవపీడన వల్లనే అని భావించిన ఈ కుటుంబం చివరికి తనకు జోగమ్మ దీక్ష ఇప్పించింది.

అందుకు కుటుంబానికి కోటి నమస్కారాలు అర్పించింది.


బతుకు అస్తిత్వం కోసం మళ్ళీ సంచార జీవితం. అప్పుడు కనిపించింది యల్లమ్మ జోగతి నృత్యం....

ఆగస్టు సంచిక నుండి నెలనెలా చదవండి

అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly)
July 2019 Vol :5, Issue 5

Date of publication : 1st of every month
Date of posting : 3rd & 6th of every month

RNI-APTEL / 2015/62362
Postal Reg NO. TEN/13/2018-20



If not delivered, please return to : 'The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:9440 448244